ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ప్రకాశం 5
జిల్లా వార్తలు
గురువారం 18, ఏప్రిల్ 2024



కందులూరులో ఎస్ఈబీ అధికారులు పట్టుకున్న మద్యం బాటిళ్లు (ఫైల్)

ఎన్నికల వేళ అధికార పార్టీ సేవలో ఎక్సైజ్ శాఖ తరిస్తోంది. వైసీపీ అభ్యర్థులకు అడిగినంత మద్యం సరఫరా చేస్తూ వారి ప్రాపకం కోసం పనిచేస్తోంది. ఏకంగా ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి కేసులకు కేసులు అక్రమంగా అధికార పార్టీ నేతల ఇళ్లకు చేరుస్తోంది. ఆ లెక్కలను కప్పిపుచ్చుకోవడానికి రేషన్ విధానం అంటూ షాపులను మధ్యాహ్నానికే మూసివేస్తూ సాధారణ మందుబాబులకు చుక్కలు చూపెడుతోంది. ఇందుకు బుధవారం ముండ్లమూరు మండలంలో పట్టుబడిన భారీ డంపే నిదర్శనం. అదేవిధంగా దుకాణాల్లో పనిచేసే సిబ్బంది కొందరు ఆ సమీపంలోనే బాటిళ్లు ఉంచి బ్లాక్‌లో అమ్ముకుంటూ భారీగా సంపాదిస్తున్నారు. మరికొందరు బెల్ట్‌షాపుల నిర్వాహకులకు అధిక ధరకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు.

వైసీపీ ఎక్సైజ్



నర్సింగోలులోని చికెన్ దుకాణంలో ఎస్ఈబీ అధికారులు పట్టుకున్న మద్యం బాటిళ్లు (ఫైల్)

బెల్టుషాపులకు తరలిస్తున్న సిబ్బంది

మద్యం దుకాణాలలో పనిచేసే సిబ్బంది బాగా చేతివాటం చూపుతున్నారు. వారు వైసీపీ నాయకుల సిఫార్సులతోనే ఉద్యోగాలలో చేరడంతో అంతా ఇష్టారాజ్యంగా మారింది. దుకాణాల నుంచి నేరుగా మద్యాన్ని బెల్టుషాపులకు తరలిస్తూ అనేక ప్రాంతాల్లో పట్టుబడ్డారు. ఇటీవల టంగుటూరు మండలం కొణిజేడులో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తి వద్ద ఎస్ఈబీ అధికారులు 10 బాటిళ్ల మద్యం పట్టుకున్నారు. అతనికి సరఫరా చేసిన కందులూరు దుకాణం సేల్స్‌మన్‌ను అరెస్టు చేశారు. ఆ మరుసటి రోజే జరుగుమల్లి మండలం నర్సింగోలుకు చెందిన వ్యక్తి వద్ద 108 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అతనితోపాటు మద్యం అమ్మిన కందుకూరు బెల్ట్‌షాపులో పనిచేస్తున్న ఇద్దరు సేల్స్‌మెన్‌లను అరెస్టు చేశారు. అదేసమయంలో బార్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు విక్రయాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

అధికార పార్టీకి అడిగినంత మద్యం

- డిపో నుంచే సరఫరా అంటూ ప్రచారం
- బెల్టుషాపులకు అమ్ముకొంటున్న సిబ్బంది
- కోటా పేరుతో మధ్యాహ్నానికే దుకాణాల మూత
- సాధారణ మందుబాబులకు చుక్కలు
- ఇదే అదనుగా బ్లాక్‌లో అధిక ధరలకు విక్రయం
- ముండ్లమూరులో భారీ డంప్ పట్టివేత
- 14మందిపై కేసు నమోదు.. అందులో సిబ్బంది కూడా

ఒంగోలు (క్రైం), ఏప్రిల్ 17 : ఎక్సైజ్ శాఖ అధికారపార్టీకి తొత్తులా వ్యవహరిస్తోంది. ఏకంగా ప్రభుత్వ వైన్ దుకాణాల నుంచి వైసీపీ అభ్యర్థులకు మద్యం సరఫరా జరగడమే ఇందుకు నిదర్శనం. అలాగే ముండ్లమూరు మండలంలో బుధవారం పట్టుబడిన డంప్ కూడా ఆ శాఖ డొల్లతనాన్ని, వైసీపీ పట్ల చూపుతున్న విపరీతమైన స్వామిభక్తిని తేటతెల్లం చేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ దుకాణాల నుంచి గ్రామాలకు, అదీ అధికారపార్టీ నేతలు చెప్పిన వారి ఇళ్లకు మద్యాన్ని సరఫరా చేస్తూ పలువురు సిబ్బంది ఎస్ఈబీ అధికారులకు పట్టుబడ్డారు. అయినప్పటికీ వెనక్కితగ్గకుండా జిల్లావ్యాప్తంగా మద్యం అక్రమంగా తరలిస్తూనే ఉన్నారు. మరికొంతమంది బార్ల నుంచి ఎన్నికల కోసం అధికారపార్టీ అభ్యర్థులకు సరఫరా చేస్తున్నారు. నామినేషన్ల వేళ ముండ్లమూరు మండలంలో 243 పెట్టెల మద్యాన్ని వైసీపీ నేతలు తమ ఇళ్లలో నిల్వ ఉంచారు. ఆ మండలంలోని ప్రభుత్వ దుకాణాల నుంచి ఆ మద్యం సరఫరా జరిగింది. అదేసమయంలో మద్యం డిపోల నుంచి కూడా తరలించారా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మద్యం దుకాణాలలో ఒక్క బాటిల్ బయటకు ఇవ్వాలన్నా స్కాన్ చేయాల్సిందే. అలాంటిది 243 పెట్టెల మద్యం బాటిళ్ల తరలించడాన్ని పరిశీలిస్తే అనేక అనుమానాలు వస్తున్నాయి. ఇదే తరహాలో జిల్లాలో అనేకచోట్ల జరిగి ఉండవచ్చని ప్రచారం మొదలైంది.

బాధ్యత అంతా ఆ శాఖదే

మద్యం దుకాణాల నిర్వహణ బాధ్యత ఎక్సైజ్ శాఖది. ప్రతి షాపును నిత్యం తనిఖీ చేసి నిల్వలను పరిశీలించేందుకు ఎక్సైజ్ కానిస్టేబుల్ నుంచి ఎస్సై వరకు విధులు నిర్వర్తిస్తుంటారు. ఇలాంటి పరిస్థితులలో ముండ్లమూరు మండలంలో మూడు దుకాణాల నుంచి 243 పెట్టెలు సుమారు రూ.20 లక్షల పైచిలుకు విలువైన మద్యం అక్రమంగా తరలించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మద్యం రేషన్ అంటూ చెబుతున్న అధికారులు



ముండ్లమూరు మండలంలోని వైసీపీ నేతల ఇళ్లలో దొరికిన మద్యం కేసులు

మద్యం అమ్మకాలపై ఎన్నికల సంఘం ఆంక్షలు పెట్టింది. రేషన్ విధించింది. గత ఏడాది ఈ సమయంలో ఏతేదీన ఎంత మద్యం విక్రయించారో అంతే అమ్మాలన్న షరతుతో మద్యం దుకాణాలు మధ్యాహ్నానికే మూతపడుతున్నాయి. ఒక్కొక్కరికి ఒక్క క్వార్టర్ బాటిల్ మాత్రమే ఇస్తుండటంతో మద్యానికి గిరాకీ పెరిగింది. దీన్ని కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. మద్యం షాపుల పరిసర ప్రాంతాల్లోని కొన్ని టిఫిన్, కూల్‌డ్రింక్స్ దుకాణాల వారు ముందుగా మద్యం తెచ్చి అక్రమంగా నిల్వ చేస్తున్నారు. క్వార్టర్‌కు అదనంగా రూ.100 తీసుకొని విక్రయిస్తున్నారు. దీనికి తోడు కొంతమంది ఉదయాన్నే మద్యం బాటిళ్లను తీసుకుని మోటారు సైకిళ్లలో దాచుకుని వైన్‌షాపులు మూసివేశాక అమ్ముతున్నారు. వారితో సర్కారు వైన్స్‌లో పనిచేసే సిబ్బంది లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకొని ఎక్కువ బాటిళ్లు ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సర్కారు దుకాణాల్లో పనిచేసే సిబ్బందిని ప్రలోభాలకు గురిచేసి అధికారపార్టీ నేతలు పెద్దమొత్తంలో మద్యాన్ని బయటకు తరలిస్తున్నారు. ప్రభుత్వ దుకాణాల నుంచి అక్రమంగా మద్యం తరలించుకుపోతుంటే ఎక్సైజ్ శాఖ చోద్యంచూస్తూ కూర్చోవడం ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అదేవిధంగా ఎన్నికల దృష్ట్యా బార్ల నుంచి కూడా మద్యం బయటకు తరలించి నిల్వలు ఉంచారనే వాదనలు ఉన్నా, ఆవైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

జోరందుకున్న మొబైల్ వ్యాపారం

ఇలా నిత్యం ప్రభుత్వ దుకాణాల నుంచి కేసులకు కేసులు తరలించడంపై ఎన్నికల కమిషన్ దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని మందుబాబులు కోరుతున్నారు.



పట్టుబడిన మద్యం కేసులను పరిశీలిస్తున్న ఎస్పీ సుమిత్

ఎన్నికల్లో ప్రలోభాలకు పాల్పడితే సహించం

- మద్యం, డబ్బులు పంపిణీ చేస్తే కఠిన చర్యలు
- ఎస్పీ గరుడ సుమిత్ హెచ్చరిక
- పోలీసులు పట్టుకున్న లిక్కర్ కేసుల పరిశీలన

దర్శి , ఏప్రిల్ 17 : ఎన్నికల్లో ప్రలోభాలకు పాల్పడితే సహించేది లేదని ఎస్పీ గరుడ సుమిత్ సునీల్ హెచ్చరించారు. మద్యం, డబ్బులు పంపిణీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బుధవారం ముండ్లమూరు మండలంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకొని దర్శి ఎస్ఈబీ కార్యాలయానికి తరలించగా ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ముండ్లమూరులో అక్రమంగా నిల్వ ఉంచిన 243 పెట్టెల మద్యాన్ని స్వాధీనం చేసుకొని 14మందిపై కేసు నమోదు చేశామని తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం విలువ రూ.20,63,203 అని తెలిపారు. ఎక్కడైనా ఇలా నిల్వలు చేసినట్లు తెలిస్తే ప్రజలు 100, 112లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. మద్యం అక్రమంగా నిల్వ ఉంచిన నిందితుల వివరాలను ఏఎస్పీ కె.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో వివరించారు. ముండ్లమూరు మండలం రెడ్డినగర్, ముండ్లమూరు, తదితర గ్రామాల్లో 243 కేసుల మద్యాన్ని ఎస్ఈబీ అధికారులతో కలిసి పట్టుకున్నట్లు తెలిపారు. మేడం రమణారెడ్డి, డ్రైవర్ శ్రీరాం కొండయ్య, బి.ఖాసింవలి, వై.శ్రీనివాసరావు, ఈ.పెదమాలకొండారెడ్డి, ఈ.పెదలక్ష్మిరెడ్డి, కె.చిన్నబాల, జి.ఐక్రయ్య, ఐ.దుర్గాప్రసాద్, పి.వెంకటేశ్వర్లు, జి.వెంకటరెడ్డి, కె.అంబేద్కర్, పి.శివారెడ్డి, షేక్ అంజిబాలును నిందితులుగా గుర్తించినట్లు వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ అశోక్‌వర్ధన్, ఎస్ఈబీ సీఐ సుందర రామయ్య పాల్గొన్నారు.

వైసీపీ నేతల ఇళ్లలో మద్యం నిల్వలు

- ముండ్లమూరు మండలంలో భారీగా పట్టివేత
- దాడి చేసి స్వాధీనం చేసుకున్న ఎస్ఈబీ అధికారులు

మెయిన్‌లో..

కీలక ఘట్టానికి సిద్ధం

- నేటి నుంచి నామినేషన్లు
- 25 వరకూ స్వీకరణ.. 26న పరిశీలన
- 29 వరకు ఉపసంహరణకు గడువు


- రిటర్నింగ్ అధికారుల వద్ద దాఖలుకు ఏర్పాట్లు
- ఒక పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు
- 2,183 పోలింగ్ కేంద్రాలు..18,14,371 మంది ఓటర్లు
- తాజాగా మరో 8,320 దరఖాస్తులు

నియోజకవర్గం	నామినేషన్ల కేంద్రం	రిటర్నింగ్ అధికారి	ఫోన్ నెంబర్
ఒంగోలు పార్లమెంట్	ఒంగోలు కలెక్టరేట్	దినేష్‌కుమార్	8886616001
ఒంగోలు అసెంబ్లీ	ఆర్డీవో ఆఫీసు	జి.వి. సుబ్బారెడ్డి	9281034411
యర్రగొండపాలెం	స్వశక్తి భవన్	డాక్టర్ శ్రీలేఖ	9281034427
దర్శి	తహసీల్దార్ ఆఫీసు	లోకేశ్వరరావు	9281034435
సంతనూతలపాడు	చీమకుర్తి మున్సిపల్ భవనం	ఆర్.గోపాలకృష్ణ	8886616002
కొండపి	తహసీల్దార్ ఆఫీసు	ఎ.కుమార్	9281034432
మార్కాపురం	ఆర్డీవో ఆఫీసు	రాహుల్‌మీనా	9281034413
గిద్దలూరు	తహసీల్దార్ ఆఫీసు	డి.నాగజ్యోతి	9281034426
కనిగిరి	ఆర్డీవో ఆఫీసు	పి.జాన్‌ఇర్విన్	9281034412

ఒంగోలు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల నిర్వహణలో కీలక ఘట్టం గురువారం నుంచి ప్రారంభం కానుంది. అత్యంత ప్రధానమైన అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రక్రియ మొదలవుతుంది. తొలుత ఆయా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు తమ కార్యాలయాల్లో ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణను చేపడతారు. ఈనెల 25 వరకు దాఖలు చేయవచ్చు. సెలవు దినాలు కాకుండా గురువారం నుంచి 25వతేదీ మధ్య ప్రభుత్వ పనిదినాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ఆ మేరకు ఎన్నికల కమిషన్ స్పష్టత ఇవ్వగా సంబంధిత రిటర్నింగ్ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. నియోజకవర్గ కేంద్ర తహసీల్దార్ కార్యాలయాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయాలుగా ఏర్పాటుచేశారు. అభ్యర్థులు అక్కడే నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ఇప్పటికే అందుకు సంబంధించి అధికారిక ఏర్పాట్లను పూర్తిచేశారు.

ఆర్వో కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు

పోటీచేసే అభ్యర్థులు లేదా వారి తరపు ప్రతినిధులకు అవసరమైన సమాచారం, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు మంగళవారం నుంచి ఆర్వో కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు కూడా ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో మార్చి 29 నాటికి మొత్తం 18,14,371 మంది ఓటర్లు ఉండగా వారిలో 9,10,370 మంది మహిళలు, 9,03,894 మంది పురుషులు ఉన్నారు. అలాగే 107 మంది థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు. కాగా ఈనెల 15 వరకు ఓటరు నమోదుకు అవకాశం ఇవ్వడంతో మరో 8,320 దరఖాస్తులు అధికారులకు అందాయి. వాటిని పరిశీలిస్తున్నారు. అర్హులైన వారికి తుది జాబితాలో ఓటు హక్కు కల్పించనున్నారు. ఆ ప్రకారం జిల్లాలో మరికొంతమేర ఓటర్లు పెరిగే అవకాశం ఉంది. కాగా జిల్లాలోని ఎనిమిది సెగ్మెంట్లలో 2,183 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎన్నికల ప్రక్రియలో దాదాపు 25వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు భాగస్వామ్యులు అవుతున్నారు. వచ్చేనెల 13న పోలింగ్ జరుగుతుంది. జూన్ 4 లెక్కింపు ఉంటుంది.



ముహూర్తాలు ఖరారు

- నామినేషన్‌ల వైపు టీడీపీ అభ్యర్థుల దృష్టి
- నేడు మాగుంట.. రేపు స్వామి, బీఎన్, ఎరిక్షన్, అశోక్‌రెడ్డి, లక్ష్మి
- 24న దామచర్ల, ఉగ్ర.. 25న కందుల దాఖలుకు సన్నాహాలు
- కొందరు తొలుత సాధారణంగా వేసి తర్వాత ర్యాలీలకు ఏర్పాట్లు

ఒంగోలు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రచారంలో ప్రత్యర్థుల కన్నా మిన్నగా దూసుకుపోతున్న టీడీపీ కూటమి అభ్యర్థులు గురువారం నుంచి ప్రారంభమవుతున్న నామినేషన్‌ల ప్రక్రియ వైపు దృష్టి సారించారు. ఈనెల 18నుంచి 25 వరకు పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్‌ల స్వీకరణ జరగనుంది. దీంతో జిల్లాలోని ఒంగోలు పార్లమెంట్, 8 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి టీడీపీ తరఫున బరిలోకి దిగుతున్న అభ్యర్థులు మంచి రోజు చూసుకుని ముహూర్తం నిర్ణయించుకున్నారు. కొందరు అభ్యర్థులు కొద్దిమంది కార్యకర్తలతో వెళ్లి ఈసీ నిబంధనలకు అనుగుణంగా ఐదుగురితో ఆర్వో వద్ద నామినేషన్లు దాఖలుకు ఏర్పాట్లు చేసుకుంటుండగా, మరికొందరు ఒకేసారి భారీ ర్యాలీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే తొలుత సాదాసీదాగా నామినేషన్ వేసి, ఆ తర్వాత మరోరోజు భారీ ప్రదర్శన నిర్వహించే ఏర్పాట్లలో మరికొందరు ఉన్నారు. అలా ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు జిల్లాలోని ఆయా నియోజకవర్గాలలో టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు వేసే అవకాశం ఉంది. పార్టీవర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న సిటింగ్ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రక్రియ ప్రారంభ రోజైన గురువారం సాదాసీదాగా నామినేషన్ వేయనున్నారు. బుధవారం తిరుమలలో దైవదర్శనం చేసుకున్న ఆయన రాత్రికి నెల్లూరులో బస చేశారు. గురువారం ఉదయం అక్కడి నుంచి బయల్దేరి వచ్చి వల్లూరమ్మ గుడిలో పూజలు చేస్తారు. అనంతరం 11 గంటలకు పార్లమెంట్ రిటర్నింగ్ అధికారైన కలెక్టర్ దినేష్ కుమార్ చాంబర్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. రెండోరోజైన 19వ తేదీన కొండపి నియోజకవర్గ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎర్రగొండపాలెం అభ్యర్థి గుడూరి ఎరిక్షన్‌బాబులు భారీ ర్యాలీలు నిర్వహించి నామినేషన్లు వేయనున్నారు. సంతనూతలపాడు అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్, గిద్దలూరు అభ్యర్థి ఎం.అశోక్‌రెడ్డి, దర్శి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిలు కూడా 19వతేదీన సాదాసీదాగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. అనంతరం మరోరోజు భారీ ర్యాలీలను నిర్వహించాలన్న యోచనలో వారు ఉన్నారు. ఇక ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్, కనిగిరి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఈనెల 24న నామినేషన్లు వేయనున్నారు. దామచర్ల ఈసారి ర్యాలీ, ఆర్భాటం లేకుండా సాదాసీదాగానే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉగ్ర నరసింహారెడ్డి నామినేషన్ దాఖలు రోజు భారీ ర్యాలీ ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఇక చివరిరోజైన 25వతేదీన మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి నామినేషన్ వేయనున్నారు. ఆ సందర్భంగా భారీ ర్యాలీకి ఆయన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ త్రిపాఠి, పక్కన ఎస్పీ సుమిత్

పటిష్ట భద్రత

- ప్రశాంత వాతావరణంలో నామినేషన్లు
- నిష్పక్షపాతంగా వ్యవహరించాలి
- చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి
- గుంటూరు రేంజ్ ఐజీ త్రిపాఠి
- పోలీసు అధికారులతో సమీక్ష

వివరాలు లోపలి పేజీల్లో..



ఒంగోలులోని కొండపైన ఉన్న శ్రీ సీతారామస్వామి ఆలయంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్‌లో) కల్యాణం

అంతా రామమయం..

జిల్లావ్యాప్తంగా బుధవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భక్తిభావం వెల్లివిరిసింది. రామనామస్మరణ మార్మోగింది. శ్రీరామనవమిని ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఊరూరా చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. భక్తులు తిలకించి పులకించిపోయారు. అనంతరం వడపప్పు, పానకం పంపిణీ చేశారు. పలుచోట్ల అన్నదానాలు జరిగాయి. ఒంగోలు పోలీసు క్వార్టర్స్‌లోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ గరుడ సుమిత్ సునీల్ దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. నగరంలోని కొండమీద ఉన్న సీతారాంపురంలోని శ్రీ సీతారామస్వామి కల్యాణోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

\- ఒంగోలు కల్చరల్

నేను మీ సేవకుడిని..

- ఈ ప్రాంతం బిడ్డని.. ఇక్కడే ఉంటా
- తాగు, సాగునీరే కాదు.. ఉపాధి అవకాశాలూ కల్పిస్తా
- 15 ఏళ్లుగా నియోజకవర్గానికి వారు చేసిందేమీ లేదు
- విడతకో ప్రాంతానికి వెళుతూ మోసం
- టీడీపీ కూటమి ఎర్రగొండపాలెం అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు

(ఆంధ్రజ్యోతి ఒంగోలు)

'పునర్విభజనలో ఎర్రగొండపాలెం నియోజకవర్గం ఏర్పడి 15 ఏళ్లు అయింది. అభివృద్ధి లేకపోగా కనీస మౌలిక వసతుల కల్పన కూడా కరువైంది. అందుకే ఇప్పటివరకూ జరగని అభివృద్ధిని రానున్న ఐదేళ్లలో చేసి చూపించాలనుకుంటున్నా' అని టీడీపీ కూటమి ఎర్రగొండపాలెం అసెంబ్లీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు స్పష్టం చేశారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తన అభిప్రాయాలను స్పష్టం చేశారు. పశ్చిమప్రాంతంలో పుట్టి రాజకీయ ఓనమాలు నేర్చుకుని ఒకే జెండా, ఒకే మాట, ఒకే బాటగా ఎదిగానని చెప్పారు. గ్రామ రాజకీయాల నుంచి ప్రజాజీవితంలోకి వచ్చిన తనకు పల్లెల్లోని సమస్యలు, ప్రజల బాగోగులతోపాటు పాలనా విధానాలు, అభివృద్ధి సాధనపై అపార అనుభవం ఉందని తెలిపారు. సర్పంచ్‌గా, ఎంపీపీగా, జడ్పీటీసీ సభ్యునిగా తాను పనిచేసిన రోజులు గుర్తుచేసుకున్నారు. ఆ అనుభవాలతోనే భవిష్యత్తులో ఎర్రగొండపాలెం అభివృద్ధికి బాటలు వేస్తానని చెప్పారు. పదవుల కోసం పార్టీలు మారేతత్వం తనది కాదన్నారు. పార్టీ ఆదేశం మేరకు వైపాలెం వచ్చిన తాను వెంటనే కుటుంబాన్ని ఇక్కడకు తెచ్చుకున్నానన్నారు. ఒకసారి ఇక్కడ, మరోసారి ఇంకోచోటుకు పదవుల కోసం పారిపోనన్నారు. మహానగరాల్లో కాపురాలు పెట్టి ఇక్కడ సేవ చేస్తానని దొంగమాటలు చెప్పనని పరోక్షంగా ప్రత్యర్థుల వ్యవహారశైలిని విమర్శించారు. 2009లో పునర్విభజన అనంతరం గెలుపొందిన సురేష్ 2014లో ఎస్ఎన్‌పాడుకు వెళ్లారని, తిరిగి 2019 ఎన్నికలకు ఇక్కడికి వచ్చి గెలుపొందారని తెలిపారు. రెండుసార్లు ఆదరించిన ప్రజలను వదిలేసి ఇప్పుడు మరొక నియోజకవర్గానికి మారారని విమర్శించారు. ప్రస్తుతం ఇక్కడ వైసీపీ తరపున పోటీలో ఉన్న చంద్రశేఖర్ స్వగ్రామం తూర్పు ప్రాంతమని, కుటుంబం ఉండేది హైదరాబాద్ అని వివరించారు. గిరిజనులు, దళితులు, బడుగుల పరిస్థితి దయనీయంగా ఉందని, వెలిగొండ రాకపోగా స్థానిక సాగునీటి వనరుల అభివృద్ధి ద్వారా వ్యవసాయరంగాన్ని ఆదుకునే ప్రక్రియ అసలు జరగలేదని మండిపడ్డారు. గిరిజనులు, దళితులపై ఈ ప్రభుత్వంలో సాగించిన దమనకాండతో వారి బతుకులు ఛిద్రమయ్యాయని పేర్కొన్నారు. అందుకే ఒక నాయకుడిగా కాక సేవకుడిగా ఈ ప్రాంత రైతు, రైతు కూలీల అభ్యున్నతి కోసం పాటుపడేలా ప్రణాళిక రూపొందించుకున్నానన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడగానే మార్కాపురం కేంద్రంగా జిల్లా ఏర్పడుతుందని ఎరిక్షన్‌బాబు స్పష్టం చేశారు. వెలిగొండ పూర్తయి కృష్ణానీరు ప్రవహిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక చంద్రబాబు, లోకేష్‌తో తనకున్న అనుబంధాన్ని వినియోగించి పరిశ్రమలు తీసుకొచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తానని గూడూరి హామీ ఇచ్చారు.




చండ్రపాడులో జరిగిన కల్యాణమహోత్సవంలో పాల్గొన్న విజయ్‌కుమార్


ఉప్పుగుండూరులో..


నిర్మల్‌నగర్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్న దామచర్ల


లాయర్‌పేట సాయిబాబా మందిరంలో శిద్దా రాఘవరావు పూజలు

వైభవంగా సీతారాముల కల్యాణం

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు ● భక్తులకు అన్నదానాలు



ఎస్పీ కార్యాలయం సమీపంలో జరిగిన శ్రీరాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎస్పీ సుమిత్‌సునీల్ దంపతులు, భక్తులు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 17: శ్రీరామనవమి పండుగను బుధవారం ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణోత్సవాలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఉగాది పండుగ మరుసటి రోజు నుంచి అనేకచోట్ల వసంత నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమై బుధవారం శ్రీరామనవమి కల్యాణోత్సవంతో ముగిశాయి. గత తొమ్మిది రోజులుగా జరుగుతున్న వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అనేకచోట్ల భజన, భక్తిసంగీత విభావరి, నృత్యప్రదర్శనలు, ప్రవచనాలు వంటి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఒకవైపు భగ్గున మండే ఎండతో భానుడు ప్రతాపం చూపుతున్నా, స్థానికంగా జరిగే సీతారాముల కల్యాణోత్సవాలు చూడటానికి ప్రజలు ఉత్సాహంగా తరలివచ్చారు.

ఒంగోలు నగరం పోలీస్‌క్వార్టర్స్‌లో ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో ఏర్పాటు చేసిన కల్యాణోత్సవంలో ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పలువురు పోలీసుశాఖ అధికారులు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ నగరంలోని పలు ప్రాంతాలలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవాలను సందర్శించి అక్కడి భక్తులకు శ్రీరామనవమి శుభాకాంక్షలను అందజేశారు. స్థానిక గుంటూరురోడ్డులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం 36వ డివిజన్‌లోని నిర్మల్‌నగర్ పార్కువద్ద ఏర్పాటుచేసిన శ్రీరామనవమి వేడుకల్లో దామచర్ల పాల్గొనగా నిర్వహణ కమిటీ గౌరవాధ్యక్షులు తాటిపర్తి గోపాల్‌రెడ్డి, డాక్టర్ కె.సీతారామయ్య, నాగబోయిన భాస్కర్‌రావు తదితరులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు దామచర్ల జనార్దన్‌కు ఆశీర్వచనాన్ని అందజేశారు. అదేవిధంగా 46వ డివిజన్‌లోని లంబాడిడొంక, 48వ డివిజన్ సత్యనారాయణపురం, 29వ డివిజన్ కొణిజేడు బస్టాండు, 32వ డివిజన్ గద్దలగుంట, 18వ డివిజన్ కొత్తమామిడిపాలెం ప్రాంతాలలో ఏర్పాటు చేసిన శ్రీసీతారామ కళ్యాణోత్సవాలలో సైతం దామచర్ల పాల్గొన్నారు.

లాయర్‌పేటలోని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన సీతారామకళ్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతుల ఆధ్వర్యంలో స్థానిక లాయర్‌పేట సాయిబాబా మందిరంలో సీతారాముల కళ్యాణోత్సవం నేత్రపర్వంగా నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

బ్రాహ్మణ సేవాసమితి ఆధ్వర్యంలో స్థానిక గడియారంవారివీధిలోని శ్రీఅనంత కోదండరామస్వామి దేవస్థానం వద్ద సీతారామ కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త గడియారం సుబ్బయ్యశర్మ ఆధ్వర్యంలో చీమకుర్తి రాఘవేంద్రరావు దంపతులు స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ప్రిన్సిపల్ జూనియర్ న్యాయాధికారి రాధిక ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేవస్థాన ధర్మకర్తలు కురవి ఉమామహేశ్వరం, ఘడియారం సుధాకర్‌శర్మ కళ్యాణకర్తలుగా వ్యవహరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. బ్రాహ్మణ సేవాసమితి కార్యవర్గ నాయకులు సీవీఎల్.సుబ్రహ్మణ్యం, మహంకాళి వెంకటశేషయ్య, గంజాం శ్రీరంగనాథ్, సముద్రాల భీమశంకరశాస్త్రి, ఫైనంపాటి సాయికుమార్, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక మంగమూరురోడ్డులోని జడ్పీకాలనీలో భగవాన్ శ్రీసత్యసాయిబాబా మందిరంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీసీతారాముల కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. సేవాసమితి కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇక సీతారాంపురంలోని శ్రీసీతారామస్వామి దేవస్థానంలో వసంత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గత ఐదు రోజులుగా కోలాటం, నాద సంకీర్తోత్సవం, రామనామ సంకీర్తోత్సవం కార్యక్రమాలు నిర్వహించగా బుధవారం శ్రీరామనవమి సందర్భంగా జరిగిన కళ్యాణోత్సవంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈవో రజనీకుమారి పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

అలాగే సంతపేట, బండ్లమిట్ట, మంగమూరురోడ్డులోని అచలానందఆశ్రమం, పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానం, గద్దలగుంట నెహ్రూ బొమ్మ మొదలైన చోట్ల శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి.

మౌర్యహోటల్‌లో...

ఒంగోలు(కలెక్టరేట్): శ్రీరామనవమి పండుగ సందర్భంగా స్థానిక మౌర్యహోటల్‌లో బుధవారం సీతారాముల కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం ఎన్నో త్యాగాలకోర్చిన సీతారాముల పవిత్ర బంధం తరతరాలకు ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో హోటల్ అధినేత, నగర ఆర్‌ఎస్‌ఎస్ సంఘ చాలక్ బత్తిన మహేష్, బీజేపీ ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్, రావులపల్లి నాగేంద్రయాదవ్, సయ్యద్‌సుభాని, కేసిన రమేష్, ప్రసాద్, పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

మండలాల్లో..

మద్దిపాడు: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో శ్రీసీతారాముల కళ్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మారెళ్లగుంటపాలెం, కోవివారిపాలెం సీతారామస్వామిదేవస్థానంలో ప్రధాన అర్చకులు రమేష్ ఆధ్వర్యంలో కళ్యాణక్రతువులు నిర్వహిచారు. సీతారామపురం, మారెళ్లగుంటపాలెం గ్రామాల్లోని రామాలయాల్లో నిర్వహించిన కళ్యాణోత్సవాలలో సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఆయన వెంట మారెళ్ల మారుతీరావు, హరికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు జయంత్‌బాబు, నల్లూరి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. ఇక బసవన్నపాలెం, నందిపాడు, పెదకొత్తపల్లి అంజయ్యనగర్ తదితర ప్రాంతాలలో సీతారాముల కళ్యాణాలు వైభవంగా జరిగాయి.

సంతనూతలపాడు: శ్రీరామనవమి పండగ సందర్భంగా సంతనూతలపాడు ఆర్యవైశ్య కళ్యాణమండపంలో కమిటీ ప్రెసిడెంట్ వేమామల్లేశ్వరరావు ఆధ్వర్యంలో అర్చకులు శివరామక్రిష్ణ ప్రత్యేకపూజలు చేశారు. సాయంత్రం రథోత్సవం నిర్వహించారు. వైస్‌ప్రెసిడెంట్ సత్యనారాయణ, సెక్రటరీ ఆంజనేయులు, కోశాధికారి వెంకటక్రిష్ణారావులు పర్యవేక్షించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ చెంచిరెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. పలువురు నాయకులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: ఉప్పుగుండూరులోని రజక, ఆర్యవైశ్య, శాలివాహన రామ మందిరాల్లో సీతారాముల కళ్యాణం బుధవారం ఘనంగా నిర్వహించారు. కమ్మవారి శ్రీరామ మందిరంలో పూజారి శ్రీనివాసరావు వైభవంగా సీతారాముల కళ్యాణం జరిపించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. చదలవాడలో ప్రసిద్ధిగాంచిన శ్రీరఘునాయక దేవస్థానంలో ఈవో అనీల్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు.

చీమకుర్తి: శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారామ కల్యాణమహోత్సవ కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. చంద్రపాడులో నూతనంగా జీర్ణోద్ధరణగావించిన సీతారామస్వామి దేవాలయంలో జరిగిన కళ్యాణమహోత్సవంలో టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో అడకా స్వాములు, దొడ్డా వెంకట్రావు, తిరగబత్తిన ఈశ్వరుడు, నల్లూరి శ్రీకాంత్, కనపర్తి ఆంజనేయులు, వేముల రంగారావు, ఆంజనేయులు పాల్గొన్నారు. చీమకుర్తి పల్లపోతువారి వీధిలోని సీతారామస్వామి దేవస్థానంలో టీటీడీ అర్చకులు సాయికృష్ణమాచార్య భట్లర్ పర్యవేక్షణలో కళ్యాణమహోత్సవాన్ని జరిపారు. ఊంజల్‌సేవలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. శ్రీరామదండు భక్త బృందం ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు. గాంధీనగర్‌లో కోదండరామస్వామి దేవాలయంలో, తూర్పుబజార్‌లో, పల్లామల్లి తదితర గ్రామాల్లో కళ్యాణమహోత్సవాన్ని ఘనంగా జరిపారు.

నామినేషన్ల ప్రక్రియకు పటిష్ఠ ఏర్పాట్లు

కలెక్టరేట్ ఉద్యోగులు పది గంటలకే విధులకు హాజరుకావాలి

జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ ఆదేశం

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 17: జిల్లాలో గురువారం నుంచి ప్రారంభంకానున్న నామినేషన్ల ప్రక్రియ ఏర్పాట్లను పటిష్ఠంగా చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక కలెక్టర్ కార్యాలయంలో గురువారం నుంచి ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరిస్తామన్నారు. నామినేషన్ల స్వీకరణ కార్యక్రమాన్ని పటిష్ఠంగా, సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా భద్రతా ఏర్పాట్లను చేశామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న సిబ్బంది ఈనెల 18నుంచి 25వతేదీ వరకు ఉదయం పది గంటలలోపు కార్యాలయ విధులకు హాజర్యేలా ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది ఈ సమయాన్ని కచ్చితంగా పాటిస్తూ తమ ఐడీ కార్డులతో కార్యాలయ విధులకు హాజరై యంత్రాంగానికి సహకరించాలన్నారు. రాజకీయ ప్రకటన ప్రసారం నిమిత్తం మీడియా సర్టిఫికేషన్ అండ్ మానటరింగ్ కమిటీ ముందస్తు అనుమతి కోసం వచ్చేవారు నామినేషన్స్ స్వీకరణ రోజుల్లో మధ్యాహ్నం మూడుగంటల తర్వాత రావాలని దినేష్‌కుమార్ సూచించారు.

సంజాయిషీ తీసుకోకుండానే చెక్‌పవర్‌ను ఎలా రద్దు చేస్తారు..?

● డీపీవోపై ముప్పాళ్ల సర్పంచ్ ఫిర్యాదు


నోటీసు చూపుతున్న సర్పంచ్ పద్మశ్రీ

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 17 : గ్రామ పంచాయతీలో బిల్లుల చెల్లింపులకు సంబంధించి తమ నుంచి కనీసం సంజాయిషీ కూడా తీసుకోకుండా చెక్ పవర్ రద్దు ఎలా చేస్తారని ఎం.ముప్పాళ్ల సర్పంచ్ వైకుంఠ పద్మశ్రీ ప్రశ్నించారు. ఈమేరకు ఆమె బుధవారం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో జరిగిన రోడ్డు నిర్మాణ పనుల బిల్లులను చెల్లించాలని సర్పంచ్‌కు మంగళవారం నోటీసులు జారీ చేశారు. మూడు రోజుల్లో దీనిపై వివరణ ఇవ్వాలని కోరారు. అయితే తననుంచి సంజాయిషీ తీసుకోకుండానే తన చెక్‌పవర్‌ను ఎంపీడీవోకు అటాచ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మేరకు తన భర్త వైకుంఠం వీరాంజనేయులతో కలిసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సదరు బిల్లుల విషయమై సర్పంచ్ పద్మశ్రీ మాట్లాడుతూ గ్రామానికి చెందిన జెట్టి శ్రీనివాసరావు చేశానని చెబుతున్న పనులకు రికార్డులు లేవన్నారు. నిబంధనలకు అనుగుణంగా పనులు జరగలేదని, ఇంజనీరింగ్ అధికారులు ధృవీకరించలేదని తెలిపారు. అయితే వీటికి బిల్లులు చెల్లించాలని ఈ నెల 16న నోటీసు వచ్చిందన్నారు. దీనికి మూడు రోజులు గడువు ఇచ్చారని సంజీషి ఇచ్చే లోపు తన చెక్ పవర్‌ను ఎంపీడీవోకు బదిలీ చేశారన్నారు. డీపీవో తీరుపై కలెక్టర్‌కు వివరించినట్లు తెలిపారు. దీనిపై కోర్టును సైతం ఆశ్రయించనున్నట్లు ఆమె తెలిపారు. డీపీవోపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు సర్పంచ్‌ల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీరభద్రాచారి తెలిపారు.

టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే రూ.4 వేల పింఛను : అనిల్

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 17 : తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.4 వేల పింఛను ఇంటి వద్దకు వచ్చి అందిస్తామని టీడీపీ కూటమి ఎస్‌ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ సోదరుడు అనిల్ పేర్కొన్నారు. రాపర్ల పంచాయతీ మెట్టువారిపాలెంలో స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో బీఎన్.విజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. సంతనూతలపాడు నియోజకవర్గంతో బీఎన్‌కు విడదీయలేని అనుబంధం ఉందని, గత తెలుగుదేశం హయాంలో నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి విజయ్‌కుమార్ అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్‌కుమార్, గుమ్మడి విజయ్‌కుమార్, మెట్లు సుబ్బయ్యనాయుడు, గంగి రమణారెడ్డి, దాకా శ్రీనివాసరెడ్డి, ఉపసర్పంచ్ పూలకొండయ్య, కోటిబాబు, నలమలపు సుధాకర్‌రెడ్డి, అన్నపరెడ్డి సుధాకర్, జనసేన నాయకులు కొరగంజి అయ్యప్ప, బండి అశోక్, శెట్టి వీరాంజనేయులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ప్రైవేటు స్కూళ్ల సమస్యల పరిష్కారం

● తెలుగుదేశం కూటమి అభ్యర్థి దామచర్ల



దామచర్ల జనార్దన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు

ఒంగోలు (కార్పొరేషన్), ఏప్రిల్ 17 : తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే ప్రైవేటు స్కూల్స్ అభివృద్ధికి భరోసా లభిస్తుందని టీడీపీ కూటమి ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆస్టోనా హోటల్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో దామచర్ల మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో విద్యాసంస్థల సంక్షేమం కోసం చంద్రబాబు కృషి చేశారన్నారు. ఏరోజు కూడా విద్యాసంస్థలను కక్ష సాధింపులకు గురి చేయలేదని చెప్పారు. ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాగానే రికగ్నిజేషన్ కాలపరిమితి పదేళ్లకు పొడిగిస్తామని తెలిపారు. స్కూల్స్‌కు ఫైర్ సర్టిఫికెట్ పొందే విధానాన్ని సులభతరం చేస్తామన్నారు. ప్రైవేటు స్కూళ్ల విద్యుత్ చార్జీలను తగ్గించి జనరల్ క్యాటగిరీలోకి మార్పు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం తరుపున విద్యార్థులకు అందించే ఫీజు రీయంబర్సుమెంట్‌ను నేరుగా పాఠశాలల ఖాతాలలో జమ చేస్తామని దామచర్ల హామీ ఇచ్చారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయడం కోసం ప్రతి పాఠశాల యాజమాన్యం కృషి చేయాలని కోరారు. అలాగే టీడీపీ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఎమ్మెల్యేగా మరో అవకాశం కల్పించాలని దామచర్ల విజ్ఞప్తి చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేటు పాఠశాలల పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. రికగ్నిజేషన్‌ను మూడు సంవత్సరాలకు కుదించడంతోపాటు, ఫైర్, శానిటేషన్ సర్టిఫికెట్ పొందాలన్నా నానా అవస్థలు పడ్డారని గుర్తు చేశారు. ఫీజులు సక్రమంగా వసూలు కాక మరింత ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. గత తెలుగుదేశం హయాంలో జరిగిన మేలును, వైసీపీ పాలనలో జరిగిన నష్టాలను విద్యావంతులైన యాజమాన్యాలు ఆలోచించాలన్నారు. టీడీపీ గెలుపు కోసం అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేటు స్కూళ్ల యాజమానులు ఏవీ.సుబ్బారావు, కె.మాధవరావు, బి.హనుమంతరావు, శ్రీనివాసులురెడ్డి, సురేష్, అజయ్, రాధాకృష్ణ, వంశీ, మల్లికార్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ దళిత ద్రోహుల పార్టీ..!

● టీడీపీ కూటమి ఎస్‌ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్


మద్దిపాడులో బీఎన్‌కు ఘన స్వాగతం పలుకుతున్న జనసేన శ్రేణులు

సంతనూతలపాడు, ఏప్రిల్ 17: వైసీపీ దళిత ద్రోహుల పార్టీ అని మరోసారి రుజువైందని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఒంగోలులోని తన కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ స్థాపించిన వైసీపీ దళితులకు ద్రోహం చేసేవారికి ఆశ్రయిస్తున్నారని, దానికి ఉదాహరణే తోట త్రిమూర్తులు అని విమర్శించారు. రాజకీయంగా తప్పించుకున్నా, న్యాయవ్యవస్థ నుంచి ఏ దోషి తప్పించుకులేరని, దళితులకు ద్రోహం చేసిన త్రిమూర్తులకు కోర్టు శిక్షవిధించడం తెలిసందేనని పేర్కొన్నారు. తోట త్రిమూర్తులు 1996లో జరిగిన శిరోముండనం కేసులో వైజాగ్ కోర్టు శిక్ష విధించిందన్నారు. దళితులను వ్యతిరేకించే వైసీపీకి రానున్న ఎన్నికల్లో దళితులు తగిన గుణపాఠం చెబుతారన్నారు. నాడు దళితుడిని చంపిన అనంతబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లే చేసి మరలా పార్టీలోకి జగన్ ఆహ్వానించడం చూస్తుంటే ఆయనకు దళితుల పట్ల ఏ మేరకు చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో దళితుడైన డాక్టర్ సుధాకర్ నుంచి డ్రైవర్ సుబ్రహ్మణ్యం వరకు ఎంతోమంది దళితులు అసువులు బాశారన్నారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల గ్రామంలో ఓ దళితుడిని దారుణంగా హింసించారన్నారు. జగన్‌రెడ్డి ఎలాగో ఆయన అనుచరుల తీరు సైతం నియోజకవర్గంలో అలాగే కనిపిస్తోందన్నారు. ఇటువంటి దళిత ద్రోహులకు బుద్ధి చెప్పాలంటే రానున్న ఎన్నికల్లో దళితులందరూ ఏకమై వైసీపీని శాశ్వతంగా ఇంటికి పంపాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి

మద్దిపాడు: మహిళల అభ్యున్నతి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ కూటమి ఎస్‌ఎన్‌పాడు అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడులోని మహాత్మాగాంధీ బీసీకాలనీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ మహిళలకు డ్వాక్రా గ్రూపుల ద్వారా ఎన్నో సంక్షేమ పథకాలను అందించిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందన్నారు. తెలుగుదేశం హయాంలోనే గ్రామాలలో రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చెందాయని, వైసీపీ హయాంలో దోపిడీలు, దౌర్జన్యాలు పెరిగాయని విమర్శించారు. చంద్రబాబు సీఎం కాగానే తొలి సంతకం సూపర్ సిక్స్ పథకాలపై మొదటి సంతకం పెడతారన్నారు. కార్యక్రమంలో అడకా స్వాములు, ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, కడియాల రఘుబాబు, వెంకయ్యనాయుడు, శుద్ధపల్లి అనిల్, ముల్లూరి మురళి, దేవబత్తిన ప్రసాద్, మండవ గోపీనాథ్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేటి నుంచి చీమకుర్తిలో నామినేషన్లు స్వీకరణ

● పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

చీమకుర్తి, ఏప్రిల్17 : ఎన్నికల నిర్వహణలో భాగంగా సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలో ఔత్సాహిక అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణ గురువారం నుంచి చేపట్టటానికి ఆర్వో గోపాలకృష్ణ ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఈ నెల 25వ తేది వరకూ 21వ తేదీ ఆదివారం మినహా ప్రతీరోజు ఉదయం 11 నుంచి సాయంత్రం 3గంటల వరకు నామినేషన్లను చీమకుర్తిలోని నూతన మున్సిపల్ కార్యాలయ ఆవరణలో స్వీకరించనున్నారు. అభ్యర్థుల సందేహనివృత్తి కోసం హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. నామినేషన్ కేంద్రం నుంచి 100 మీటర్లు, 200 మీటర్లకు ఎటువంటి వాహనాలను అనుమతివ్వకుండా బారికేడ్లను, మార్కింగ్‌ను చేశారు. నామినేషన్ కేంద్రంకు అభ్యర్థితో కలిసి ఐదుగురు వ్యక్తులను మాత్రమే అనుమతిస్తారు. నామినేషన్ కేంద్రం వద్ద శాంతిభద్రతల పర్యవేక్షణకు పోలీసులు పక్కా ఏర్పాట్లు చేశారు.


నామినేషన్ కేంద్రం సమీపంలో ఏర్పాటు చేసిన బారిగేడ్లు

అవీ..ఇవీ..

ప్రేరణ ఉత్సవాలు రేపు : డీఈవో

ఒంగోలు(విద్య), ఏప్రిల్ 17: ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఈనెల 19వతేదీన జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీఈవో డి.సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూలు స్థాయిలో విజేతల వివరాలు తప్పనిసరిగా ప్రేరణ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. వారి స్కూల్ డైస్ కోడ్‌తో లాగిన్ అయ్యి, ఆన్‌లైన్ చేయాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. విజేతల వివరాలన్నింటిని సంబంధిత స్కూలు హెచ్‌ఎం ధృవీకరణతో పంపాలని, విద్యార్థులు, ఎస్కార్ట్ టీచర్‌కు గుర్తింపుకార్డుతో సహా ఒంగోలు నవోదయ కేంద్రానికి ఈనెల 19వ తేదీ ఉదయం 9గంటలకు హాజరయ్యే విధంగా చూడాలన్నారు. అలాగే డ్రాయింగ్ పోటీల్లో పాల్గొనే వారు డ్రాయింగ్ కలర్స్, ప్యాడ్ తదితరాలను వారి వెంట తెచ్చుకోవాలని డీఈవో సూచించారు.

నేటి నుంచి ఎంపీ మాగుంట పర్యటన

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 17 : ఒంగోలు పార్లమెంట్ తెలుగుదేశం కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం నుంచి ఈనెల 21వతేదీ వరకు నియోజకవర్గ పరిధిలో పర్యటించనున్నారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. సాయంత్రం పొదిలి మండలం ఉప్పలపాడులో టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డితో కలిసి రోడ్డుషోలో పాల్గొంటారు. శుక్రవారం ఉదయం పదిన్నర గంటలకు ఫైపాలెం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం మార్కాపురంలో జరిగే టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశానికి మాగుంట హాజరవుతారు. శనివారం ఉదయం పదిన్నర గంటలకు మార్కాపురం మండలం, మధ్యాహ్నం 2 గంటలకు తర్లుబాడు మండలంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. ఆదివారం ఒంగోలులో జరిగే పలు కార్యక్రమాలకు హాజరవుతారు.

20న మోడల్ ఈఏపీసెట్ : ఎస్‌ఎఫ్‌ఐ

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 17 : ఎస్‌ఎఫ్‌ఐ, బ్రిలియంట్ కంప్యూటర్స్ ఆధ్వర్యంలో ఈనెల 20వతేదీన ఒంగోలులో జరిగే మోడల్ ఈఏపీసెట్‌ను వినియోగించుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.వినోద్ కోరారు. బుధవారం ఈ మేరకు మోడల్ టెస్ట్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై పోరాటాలు చేస్తూనే మరో వైపు విద్యార్థుల చదువులను ప్రోత్సహిస్తూ చదువులకు సహాయపడాలనే ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి డి.వీరాంజనేయులు, గౌరవాధ్యక్షుడు ఎస్.రవి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కె.విజయ్, నగర కార్యదర్శి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా ప్రసన్నరాజు

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 17: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా మన్నం ప్రసన్నరాజును నియమిస్తూ పీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు బుధవారం ఒంగోలులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకర్‌రెడ్డి నియమకపత్రానిన ప్రసన్నరాజుకు అందజేసారు. పార్టీలో 32 వివిధ పదవులలో సేవలు అందించిన ప్రసన్నరాజుకు అధికార ప్రతినిధిగా నియమించడంపై అభినందనలు తెలిపారు. కాంగ్రెస్‌ని అధికారంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని ప్రసన్నరాజు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉద్దండి మల్లిఖార్జునరావు, నాయకుల ఉంగరాల శ్రీనివాసరావు, తిరుమలశెట్టి సౌమ్య, కరీంబీగం, పి.బ్రహ్మయ్య తదితరలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 17: అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపకశాఖ జిల్లా సహాయ అధికారి పి.శ్రీనివాసులురెడ్డి సూచించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్త గురించి బుధవారం ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో విద్యార్థులకు వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలతో పాటుగా మంటలను ఆర్పే విధానం ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రామశేషయ్య సేవలు ఆదర్శనీయం


నివాళులర్పిస్తున్న విజయ్‌కుమార్

మద్దిపాడు, ఏప్రిల్ 17: దొడ్డవరం టీడీపీ సీనియర్ నాయకులు కాట్రగడ్డ రామశేషయ్య సేవలు ఆదర్శనీయమని కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. అనారోగ్యంతో రామశేషయ్య తుదిశ్వాస విడిచిన విషయం తెలుసుకున్న విజయ్‌కుమార్ బుధవారం ఆయన పార్థివదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. సొసైటీ అధ్యక్షునిగా, ఉపాధ్యాయునిగా, రైతుగా పరిసర ప్రాంతాలలో మంచి పేరుప్రఖ్యాతులు గడించిన వ్యక్తి రామశేషయ్య అని, ఆయన మరణం పార్టీకి తీరనిలోటన్నారు. రాష్ట్ర సెక్రటరీ అడకస్వాములు, కుంచాల రామాంజనేయులు, వడ్డంపూడి శ్రీనివాసరావు, కొండపల్లి పవన్, టి.అనంతమ్మ, మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, పలువురు తెలుగుదేశం నాయకులు రామశేషయ్యకు నివాళులర్పించారు.

పలువురికి బీఎన్ నివాళులు

సంతనూతలపాడు: పి.తక్కెళ్లపాడులో అనారోగ్యంతో మరణించిన ప్రేముల బ్రహ్మయ్య మృతదేహాన్ని బుధవారం టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం గెంటినపల్లి కోటేశ్వరమ్మ పెదకర్మలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అడకాస్వాములు, ఎన్.శ్రీనివాసరావు, టి.నరసింహారావు, రాజు, గోపి, మాధవరావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల ప్రచారం


కరపత్రాలను అందిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 17: టీడీపీ కూటమి సంతనూతలపాడు నియోజకవర్గ అభ్యర్థి బీఎన్.విజయ్‌కుమార్ గెలుపు కోరుతూ ఉప్పుగుండూరులో తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు బుధవారం ప్రచారం నిర్వహించారు. కనగాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బి.సెల్వం, తెలగతోటి జాన్సన్, జంజనం సుబ్బయ్య, శ్రీకాంత్, మసిముక్కు భాస్కర్, రామకృష్ణ, పెంట్యాల కోటి ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. విజయ్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ కరపత్రాలను అందజేశారు.

ప్రత్యేక హోదాతోనే నవ్యాంధ్రకు న్యాయం

నాగులుప్పలపాడు, ఏప్రిల్ 17 : ప్రత్యేక హోదా తోనే నవ్యాంధ్రకు న్యాయం జరుగుతుందని అరుణోదయ సాంస్కృతిక సంఘం గౌరవాధ్యక్షురాలు విమలక్క డిమాండ్ చేశారు. నవ్యాంధ్రకు ప్రత్యేక హోదా కోరుతూ నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్ర బుధవారం ఉప్పుగుండూరు చేరుకుంది. లైబ్రరీ సెంటర్‌లోని మాదాసు కృష్ణమూర్తి విగ్రహానికి కార్మికసంఘాల రాష్ట్ర అధ్యక్షులు కరీం, రైతుకూలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కరణాకుల వీరాంజనేయులుతో కలిసి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాలకులు పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చేసి నవ్యాంధ్రకు ప్రత్యేక హోదాను తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు.

నేటి నుంచి ప్రసన్న చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 17: ఒంగోలు నగరం కేశవస్వామిపేటలోని శ్రీ ప్రసన్నచెన్నకేశవ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతున్నట్లు ఈవో డి.రజనీకుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం అంకురార్పణతో కార్యక్రమాలు ప్రారంభమై ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ప్రతి రోజు రాత్రి 7 గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

అభ్యర్థులు నిబంధనలు పాటించాలి : ఆర్వో

ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 17: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గానికి నామినేషన్లను స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్డీవో, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జీవీ.సుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం విలేఖరులతో మాట్లాడారు. గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల స్వీకరణ జరుగుతుందన్నారు. రిటర్నింగ్ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోనే ఆయా పార్టీల ర్యాలీలను నిలుపుదల చేస్తామని, అక్కడి నుంచి అభ్యర్థితో పాటు మరో నలుగురికి మాత్రమే రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ వేసేందుకు అనుమతి ఉంటుందని చెప్పారు. అభ్యర్థుల కోసం హెల్ప్ డెస్క్(సహాయకేంద్రం)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినేషన్లు ఈనెల 25వతేదీ వరకు స్వీకరిస్తామని, సెలవు రోజుల్లో స్వీకరణ జరగదని వెల్లడించారు. కోడ్ ఉల్లంఘనలు జరగకుండా ఉండేందుకు మహిళా పోలీసులకు, వీఆర్వోలకు అవగాహన కల్పించామని పేర్కొన్నారు. సమతానగర్‌లో జరిగిన ఘటనను దృష్టిలో పెట్టుకొని అటువంటివి పునరావృతం కాకుండా రాజకీయ పార్టీలు కూడా సహకరించాలని కోరారు.

రేపు స్వామి నామినేషన్

టంగుటూరు, ఏప్రిల్ 17 : కొండపి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఈనెల 19న కొండపిలో తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. మండలంలోని తూర్పునాయుడుపాలెంలోని స్వగృహం నుంచి ఉదయం 11గంటలకు స్వామి బయలు దేరుతారు. తూర్పునాయుడుపాలెం నుంచి వల్లూరులోని శ్రీవల్లూరమ్మ దేవస్థానానికి చేరుకుంటారు. అక్కడ ప్రత్యేక పూజలు ముగిశాక కొండపి బయలు దేరుతారు. కొండపిలో నామినేషన్ దాఖలు చేశాక అక్కడి టంగుటూరు రోడ్డులో జరిగే బహిరంగ సభలో పాల్గొని మాట్లాడతారు. స్వామి నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి టీడీపీ కూటమి నాయకులు, ముఖ్యకార్యకర్తలు తరలివచ్చేలా మండల పార్టీ నేతలు బాధ్యతలు స్వీకరించారు. మండల పార్టీల పిలుపుమేరకు నియోజకవర్గం నుంచి భారీగా కూటమి నాయకులు, అభిమానులు తరలివచ్చే అవకాశం ఉంది.



కొండపిలో సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా నవమి వేడుకలు

కొండపి, ఏప్రిల్ 17: శ్రీరామనవమి వేడుకలను కొండపిలోని కోదండ రామస్వామి ఆలయం ఆవరణలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీతారాములకు కల్యాణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు పరాంకుశం శ్రీనివాసాచార్యులు నిర్వహించారు. పలువురు దంపతులు కార్యక్రమంలో పాల్గొని కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు నృత్యాలు చేశారు. అన్నదానతం నిర్వహించారు. మండలంలోని కె.ఉప్పలపాడు, ముప్పవరం, కట్టావారిపాలెం, ముప్పరాజుపాలెం గ్రామాల్లోని రామాలయాల్లో దంపతులు పాల్గొని కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వడపప్పు, పానకం, తీర్థ ప్రసాదాలుగా అందజేశారు.



సింగరాయకొండ శ్రీరామ్‌నగర్ రామాలయంలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సింగరాయకొండలో

సింగరాయకొండ : మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాల్లో బుధవారం శ్రీరామనవమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని శ్రీరామ్‌నగర్, రైల్వేస్టేషన్ రోడ్డు, పాతసింగరాయకొండ రామాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిచారు. స్థానిక సాయిబాబా మందిరంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు రామాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

టీడీపీ కూటమి నేతల ఇంటింటి ప్రచారం

భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాల గురించి వెల్లడి



ఇంటింటి ప్రచారంలో టీడీపీ కూటమి నాయకులు

టంగుటూరు, ఏప్రిల్ 17 : భవిష్యత్‌కు గ్యారెంటీకి తెలుగుదేశం పార్టీ కూటమి మహత్తరమైన పథకాలు అమలు చేస్తుందని, అధికారం చేపట్టగానే ఆ పథకాలు యాథావిధిగా అమలు జరుగుతాయని టీడీపీ కూటమి నాయకులు వెల్లడించారు. కూటమి ఆధ్వర్యాన బుధవారం టంగుటూరు సౌత్ బీసీ కాలనీ, రాజీవ్‌నగర్‌లో ఇంటింటికీ తెలుగుదేశం శంఖారావం జరిగింది. ఇందులో పాల్గొన్న కూటమి నాయకులు ఇంటింటినీ సందర్శించి తాము అధికారం చేపట్టగానే అమలు చేయనున్న భవిష్యత్‌కు గ్యారంటీ పథకాలు గురించి వివరించారు. ఆడపడుచులకు మహాశక్తి పథకం ద్వారా తల్లికి వందనం పేరుతో ప్రతి ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15వేలు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఆడబిడ్డ నిధి నుంచి 18 ఏళ్లు నిండిన ప్రతి స్త్రీకి నెలకు రూ. 1,500 లెక్కన కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి ఇవ్వనున్నట్లు తెలియజేశారు. దీపం పేరుతో ప్రతి ఇంటికి ఉచితంగా 3 గ్యాస్ సిలెండర్లు, మహిళలకు జిల్లా పరిధిలో ఉచిత బస్సు ప్రయాణం, యువగళం పథకం ద్వారా 20 లక్షల మంది యువతకు ఉపాధి కల్పన, నిరుద్యోగులకు యువగళం నిధి నుంచి నెలకు రూ.3వేలు నిరుద్యోగ భృతి, అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు ఏటా రూ.20వేలు, బీసీలకు రక్షణ చట్టం కల్పించనున్నట్లు వారు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు కామని విజయకుమార్, రాంబాబు, బెల్లం కోటేశ్వరరావు, గ్రామ మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, సర్పంచ్ మద్దిరాల మమత, తోకల భారతి, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, పార్టీ సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, భానుచందర్, దయానందం, జక్కుల శ్రీను, కుందేటి వెంకట్రావు, యజమాని, పెద్దోడు, మాజీ ఉపసర్పంచ్ మక్కెన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఊరూరా... ఇంటింటా...

జోరుగా సాగుతున్న బీఎన్ ప్రచారం

సూపర్ సిక్స్ పథకాలు, చంద్రబాబు సమర్థతపై పచ్రారం

కలిసికట్టుగా పార్టీ శ్రేణులు, కలిసివస్తున్న వివిధ వర్గాలు

ఒంగోలు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి):సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్ ఎన్నికల ప్రచార పథంలో జోరుగాసాగుతున్నారు. కలిసికట్టుగా కదులుతున్న పార్టీ శ్రేణులు, కలిసి వస్తున్న వివిధ వర్గాల వారితో ఉత్సాహంగా ఉన్న బీఎన్ నిత్యం ఊరూరా, ఇంటింటా ప్రచార క్యాంపెయిన్ సాగిస్తున్నారు. ప్రధానంగా టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు, రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టే సమర్థత ఒక్క టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుదే నన్న విషయాన్ని ఆ సందర్భంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాలలో విధిగా ప్రతి ఇంటిని సాయంత్రం నుంచి రాత్రి పది వరకు తిరిగి ప్రజలను కలుస్తున్నారు. అలా ఇప్పటికే నియోజకవర్గంలోని ఇంచుమించు సగం గ్రామాలను ఆయన చుట్టేయగా ఎక్కడికక్కడ ప్రజల నుంచి మంచి స్పందన కనిపిస్తున్నది. గతంతో పోల్చితే ప్రతి గ్రామంలోను పార్టీ కార్యకర్తలే కాక సాధారణ ప్రజలు నుంచి కూడా ముఖ్యనేతలు ఆశించిన దానికన్నా అధికంగా సానుకూల వాతావరణం వ్యక్తం అవుతున్నదని చెప్తున్నారు. ఇదే సమయంలో ఆర్భాటాలకు తావులేకుండా క్యాంపెయిన్ సమయంలోనే ఆయా గ్రామాలలో వైసీపీ నుంచి వచ్చే వారిని చేర్చుకుంటూ స్థానిక టీడీపీ నేతలతో సమన్వయంతో సాగేలా బీఎన్ ప్రత్యేక దృష్టితో ముందుకు పోతుండటం మంచి ఫలితాలను ఇస్తున్నట్లు తెలుస్తున్నది. మరోవైపు నియోజకవర్గ, మండల స్థాయి నేతలతో అలాగే కొన్ని ప్రత్యేకమైన గ్రామాల నేతలతో విడివిడిగా ఉమ్మడిగా నిత్యం ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో సమీక్షలు చేసి ఆయా ప్రాంతాలలో తీసుకోవాల్సిన చర్యలుపై బీఎన్ దిశానిర్దేశం చేస్తున్నారు. అలాగే ఆయా ప్రాంతాలకు చెందిన తనకు మద్దతు తెలిపేందుకు వస్తున్న వివిధ వర్గాల వారితోను సమావేశం కావడం, పార్టీలో చేరేందుకు వచ్చే వారిని ఆహ్వానిస్తూ సాగుతున్న ఆయన నిత్యం కనీసం అయిదారు గ్రామాలకు చెందిన వారిని కలిసే ప్రయత్నం విజయవంతంగా చేస్తూ ముందుకు పోతున్నారు.





చీమకుర్తి మండలంలో బీఎన్ ప్రచార క్యాంపెయిన్ (ఇన్‌సెట్లో) ఎస్ఎన్‌పాడులో దళితుల ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

రాష్ట్ర వ్యాప్తంగా కూటమిలో భాగంగా ఉన్న జనసేన పార్టీలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, ఆయా స్థాయి నాయకుల నుంచి సంపూర్ణ మద్దతు బీఎన్ పొందగా ఆ పార్టీ శ్రేణులు ఆయా ప్రాంతాలలో టీడీపీతో కలిసి అలాగే ప్రచారం నిర్వహిస్తుండగా పరిమితంగానే ఉన్నప్పటికి బీజేపీ శ్రేణులు కూడా కలిసి నడుస్తున్నారు. ఇక టీడీపీ కూటమికి ఎంఆర్‌పీఎస్ నేత మందకృష్ణ సంపూర్ణ మద్దతు తెలిపిన నేపథ్యంలో నియోజకవర్గంలోని ఆ సంస్థ నాయకులు బీఎన్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. ఇదిలా ఉండగా మాల సామాజిక వర్గానికి చెందిన బీఎన్ విజయకుమార్‌కు ఆ సామాజిక వర్గంలో రాజకీయ పార్టీలకు అతీతంగా సంబంధాలు ఉన్నాయి. వాటిని మరింత పటిష్ట పరిచి ఓట్ల రూపంలో గతంకన్నా మెరుగైన ఫలితం వచ్చేలా ప్రయత్నిస్తున్న బీఎన్ బీసీవర్గాలపైనా ప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకోసం మూడు, నాలుగు గ్రామాలు ఒక యూనిట్‌గా తీసుకొని బీసీ సదస్సులను నిర్వహించి ఆ వర్గాల కోసం టీడీపీ చేపట్టనున్న కార్యక్రమాలను వివరిస్తున్నారు. అలా సాగుతున్న బీఎన్ ప్రచార కార్యక్రమం వివిధ గ్రామాలలోని స్థానిక టీడీపీ నేతలు మరింత ఉత్సాహంగా పనిచేస్తూ ఆయా వర్గాల ప్రజల మద్దతును పార్టీ అభ్యర్థికి కూడగట్టేందుకు గట్టి కృషిచేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో కుమార్

నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి

కొండపి, ఏప్రిల్17: కొండపిలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని ఆర్వో కార్యాలయంలో గురువారం 11 గంటల నుంచి కొండపి అసెంబ్లీకి పోటీచేసే అభ్యర్థుల నుంచి నామినేషన్లు తీసుకునేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని కొండపి నియోజకవర్గ ఆర్వో ఎ. కుమార్ తెలిపారు. బుధవారం కొండపి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం నోటిఫికేషన్ విడుదల చేస్తామని, నోటిఫికేషన్‌ను నోటీసు బోర్డులో ఉంచుతామన్నారు. పార్టీల తరుపున నామినేషన్‌లు వేసే అభ్యర్థులు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్‌లు దాఖలు చేయాలని కోరారు. ఈసందర్భంగా 144వ సెక్షన్ అమలులో ఉంటున్నందున ప్రజలు గుమికూడవద్దని అన్నారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ వంద మీటర్ల పరిధిలోని దుకాణాలను ఉదయం నుంచి సాయంత్రం వరకు మూసి వేస్తామని తెలిపారు. సమావేశంలో తహసీల్దార్లు బి. కిరణ్‌కుమార్, ఉమాశంకర్, సుధాకర్, వైసీపీ నాయకుడు గొట్టిపాటి మురళి, సీపీఎం నాయకుడు కేజీ మస్తాన్, సీపీఎం మండల కార్యదర్శి ఆర్. లక్ష్మి, టీడీపీ నాయకులు యనమద్ది వెంకటేశ్వర్లు, దర్శాశి బ్రహ్మానందం పాల్గొన్నారు.

అభ్యర్థుల కోసం హెల్ప్‌డెస్క్

నామినేషన్‌లు వేసే అభ్యర్థుల సౌకర్యార్థం కొండపిలోని తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. బుధవారం ఆర్వో ఎ.కుమార్, పార్టీల నాయకులు హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించారు. నామినేషన్ పత్రాలతోపాటు, నామినేషన్ పత్రాలను పూర్తి చేసేందుకు హెల్ప్‌డెస్క్ సహాయకారిగా ఉంటుందని ఆర్వో తెలిపారు. హెల్ప్‌డెస్క్ సేవలను వినియోగించుకోవాలని ఆర్వో సూచించారు.



గ్యాస్ ప్రమాదాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గ్యాస్ ప్రమాదాలపై అవగాహన

టంగుటూరు, ఏప్రిల్ 17 : గ్యాస్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని టంగుటూరు పోతుల చెంచయ్య వెస్ట్ కాలనీ మహిళలకు అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా నాల్గో రోజైన బుధవారం గ్యాస్ సిలెండర్ తీసుకోగానే అందులో తయారీ నుంచి ఎన్నిరోజులు గడచిందనేది ఉంటుందని, ఎక్స్‌పైరీ డేట్ గమనించాలన్నారు. దానిని ముందుగా ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. వంట సమయంలో గ్యాస్ లీకయితే వెంటనే రెగ్యులేటర్ ఆపి గ్యాస్ సరఫరా వారిని సంప్రదించాలన్నారు. అనుకోకుండా గ్యాస్ నుంచి మంట వస్తే వెంటనే రెగ్యులేటర్ ఆపాలని, ఇందుకు వీలు లేకుంటే తడిసిన గట్టి గోనెపట్టను గాని, దుప్పటిని కానీ సిలెండర్‌పై కప్పి రెగ్యులేటర్ ఆపాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎ. రమణారెడ్డి, సిబ్బంది బంగారుబాబు, బి. పాల్‌బర్నబ, డి. వెంకటేశ్వర్లు, పి. నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పులకించిన భద్రగిరి

భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యుటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



స్వామివారి ఊరేగింపు



ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



పార్టీలోకి వచ్చిన వారికి సముచిత స్థానం

కొండపి ఎమ్మెల్యే స్వామి, టీడీపీ ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి సత్య

పర్చూరివారిపాలెంలో 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరిక

పొన్నలూరు (కొండపి), ఏప్రిల్ 17: వైసీపీని వీడి టీడీపీలోకి వస్తున్న వారికి సముచిత స్థానం కల్పిస్తామని కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని పర్చూరివారిపాలెం గ్రామంలో 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఈసందర్భంగా జరిగిన సభలో స్వామి మాట్లాడుతూ కొండపి నియోజవర్గంలోని మారుమూల గ్రామాలను సైతం టీడీపీ హయాంలో అభివృద్ధి పరిచామన్నారు. అంతేకాకుండా గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు టీడీపీ హయాంలోనే జరిగాయన్నారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామన్నారు. దామచర్ల సత్య మాట్లాడుతూ వైసీపీ పాలనలో పేద ఎస్సీ, బీసీలపై దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోయాయని విమర్శించారు. అనేక గ్రామాల నుంచి వైసీపీ పాలనలో రాష్ట్రం వెనుకబడిపోతున్నదని గ్రహించి టీడీపీలోకి భారీగా వలసలు కొనసాగుతుండటం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో జనసేన కొండపి నియోజవర్గ సమన్వయకర్త, టీడీపీ నాయకులు కోటిరెడ్డి, మండవ ప్రసాద్ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీని వీడిన కుటుంబాలు

గ్రామానికి చెందిన పతకమూరి శ్రీనివాసులు, తింటకుర్తి సురేష్, అరటి వేములు, కొలకని బ్రహ్మయ్య, పొతకమూరి అంకయ్య, నేలపాటి రూబేను, నేలపాటి దేవయ్య, దొడ్డియేసురత్నం, నేలపాటి ఏసు, నేలపాటి బోడయ్య, కప్పుల సయేలుతోపాటు మరో 20కుటుంబాలు, అగ్రహారానికి చెందిన షేక్ మహమ్మద్ బాషా, సురేష్‌కుమార్ కూడా పార్టీలో చేరారు.



ఎమ్మెల్యే స్వామి, సత్యల సమక్షంలో పార్టీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు



పుట్టాను తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీడీడీ కూటమి నాయకులు జయంత్‌బాబు, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, మమత, భారతి

టీడీపీలో చేరిన పుట్టా

టంగుటూరు, ఏప్రిల్ 17 : వైసీపీ బీసీ నాయకుడు పుట్టా వెంకట్రావు బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. టంగుటూరు నార్త్ బీసీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో పుట్టాను తెలుగుదేశం కూటమినేతలు బెల్లం జయంత్‌బాబు, చదలవాడ చంద్రశేఖర్, బెజవాడ వెంకటేశ్వర్లు, సర్పంచ్ మద్దిరాల మమత, తోకల భారతి తదితరులు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయనతోపాటుగా నార్త్ బీసీ కాలనీకే చెందిన 20 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారంతా టీడీపీ నాయకులకు పూలమాలలు వేసి సత్కరించారు. ఈసందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగిన సమర్థవంతమైన నాయకుడు చంద్రబాబేనని, అందుకే తాను టీడీపీలో చేరినట్లు వెల్లడించారు.

చలివేంద్రం ప్రారంభం

టంగుటూరు, ఏప్రిల్ 17 : ఏపీ స్ఫూర్తి కుటుంబ ట్రస్ట్ ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, మానవతా ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన న్యాయవాది పంగులూరి గోవిందయ్య, స్టేట్ ఇండస్ట్రీస్ అసోసియేట్ వి. వెంకటభూపాల్ ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కుల, మత ప్రాంతాల కతీతంగా వేసవి తాపాన్ని తీర్చడమే ధ్యేయంగా ఈ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు జి. చంద్రశేఖర్, యశోదకృష్ణ చెప్పారు.

నిందితులను అరెస్టు చేయాలి

మర్రిపూడి, ఏప్రిల్ 17 : మండల కేంద్రమైన మర్రిపూడిలో గత ఆదివారం కోండ్రూ శాంసన్‌పై దాడి చేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఎస్సీ కాలనీవాసులు డిమాండ్ చేశారు. బుధవారం ఆమేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైకి వినతి పత్రం ఇచ్చేందుకు వెళ్లారు. ఆ సమయంలో ఎస్సై శివ బసవరాజు లేకపోవడంతో స్టేషన్ సిబ్బందికి సమస్యను వివరించారు. నిందితుడు సాక్షులను బెదిరిస్తున్నాడని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దాడి కేసుపై నిష్పక్షపాతంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

జన కేతనం
ప్రకాశం జిల్లా వార్తలు
గురువారం 18 ఏప్రిల్ 2024

తొలి ఘనత ఒంగోలుకే సొంతం


ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శాసనసభ్యునిగా గెలుపొందిన టంగుటూరి ప్రకాశం పంతులు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1955లో ద్విసభ్య శాసనసభ్యులు కొనసాగగా ఆ సమయంలో టంగుటూరు ప్రకాశం పంతులు సీపీఐ అభ్యర్థి ఎం. నారాయణస్వామిపై విజయం సాధించారు. 1953 అక్టోబరు 1 నుంచి 1954 నవంబరు 15వ తేదీ వరకు ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా పనిచేశారు. జిల్లా వాసైన ప్రకాశం పంతులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా ఒక ఏడాది 45 రోజుల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసి ఒంగోలుకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారు.

ఒంగోలు వెరీవెరీ స్పెషల్

అసెంబ్లీ నియోజకవర్గ చరిత్ర ఎంతో ఘనం

ఒంగోలు నియోజకవర్గం ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు గెలిచిన అభ్యర్థులు

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
2019	బాలినేని శ్రీనివాసరెడ్డి	వైసీపీ	దామచర్ల జనార్ధన్	టీడీపీ	22,245
2014	దామచర్ల జనార్దన్	టీడీపీ	బాలినేని శ్రీనివాసరెడ్డి	వైసీపీ	12,428
2012(ఉపఎన్నిక)	బాలినేని శ్రీనివాసరెడ్డి	వైసీపీ	దామచర్ల జనార్దన్	టీడీపీ	32,994
2009	బాలినేని శ్రీనివాసరెడ్డి	కాంగ్రెస్	ఈదర హరిబాబు	టీడీపీ	22,986
2004	బాలినేని శ్రీనివాసరెడ్డి	కాంగ్రెస్	శిద్దా రాఘవరావు	టీడీపీ	24,171
1999	బాలినేని శ్రీనివాసరెడ్డి	కాంగ్రెస్	యక్కల తులసీరావు	టీడీపీ	6,222
1994	ఈదర హరిబాబు	టీడీపీ	ఏ వెంకటేశ్వర్లు	కాంగ్రెస్ఐ	19,897
1989	బచ్చల బాలయ్య	కాంగ్రెస్ఐ	కే వెంకటరమణారావు	టీడీపీ	19,490
1985	పీ కోటేశ్వరరావు	టీడీపీ	పీఎంకే నాయుడు	కాంగ్రెస్ఐ	9,024
1983	పీ కోటేశ్వరరావు	టీడీపీ	టీఎస్ రెడ్డి	కాంగ్రెస్ఐ	29,848
1978	జీవరత్నంనాయుడు	కాంగ్రెస్ఐ	బీ వెంకటేశ్వరరెడ్డి	జనతా	5,080
1972	జీవరత్నంనాయుడు	కాంగ్రెస్	ఎస్. అంజయ్య	సీపీఐ	11,233
1967	చింతా రామచంద్రారెడ్డి	కాంగ్రెస్	బీవీ లక్ష్మీనారాయణ	ఇండి	8,012
1962	బీవీ లక్ష్మీనారాయణ	ఇండి	రొండా నారపరెడ్డి	కాంగ్రెస్	6,066
1957ఉపఎన్నిక)	బీవీ లక్ష్మీనారాయణ	ఇండి	జీ ఆదినారాయణ	కాంగ్రెస్	10,800
1955 (ద్వి)	టంగుటూరి ప్రకాశం	కాంగ్రెస్	ఎం నారాయణస్వామి	సీపీఐ	6,030
	టీ జియ్యర్‌దాస్	కాంగ్రెస్	కేఎం కొండయ్య	సీపీఐ	4,951
1952(ద్వి)	కే మాలకొండయ్య	సీపీఐ	కే కోటయ్య	కేఎల్‌పీ	27,088



ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 17 : ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఒంగోలు నగరంతోపాటు ఒంగోలు రూరల్, కొత్తపట్నం మండలాలు ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఒంగోలు ఒక నియోజకవర్గంగా కొనసాగుతూనే ఉంది. 1952, 1955 సంవత్సరాల లో ద్విసభ్య నియోజకవర్గంగా కొనసాగగా, 1957నుంచి ఒక్క అభ్యర్థి మాత్రమే ఎన్నికవుతూ వస్తున్నారు. ఒంగోలు నియోజకవర్గానికి తూర్పున బంగాళాఖాతం, ఉత్తరం మద్దిపాడు మండలం, పశ్చిమాన సంతనూతలపాడు మండలం, దక్షిణం టంగుటూరు మండలాలు హద్దులుగా ఉన్నాయి. ఒంగోలుకు వంగలప్రోలు, వంగవోలు, వంగోలు అనే పేర్లు ఉన్నాయి. అద్దంకి రెడ్డిరాజుల కాలంలో వంగోలు అనే పేరు చరిత్రలో కనిపిస్తున్నది. నగరంలో

ఆంధ్ర రాష్ట్రానికి తొలి సీఎంను అందించిన ఒంగోలు

ఇక్కడ్నుంచి గెలిచి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం బాధ్యతల స్వీకరణ

1952లో అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు

నియోజకవర్గ ఓటర్లు 2,39,372

పోలింగ్ కేంద్రాలు : 231



తొలి మసీదు జామియా మసీదు, సకల దేవతల నిలయంగా సంతపేట వీరాంజనేయస్వామి ఆలయం ఉంది. కాలక్రమేణా ఒంగోలు అని పేరు వచ్చింది. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరగ్గా 1957, 2012లో ఉపఎన్నికలు జరిగాయి.

టీడీపీ ఆవిర్భావంతో....

సినీరంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఎన్టీఆర్ పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1983లో జరిగిన ఎన్నికల్లో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పొనుగుపాటి కోటేశ్వరరావు ఘన విజయం సాధించారు. 1985లో జరిగిన పరిణామాల అనంతరం జరిగిన ఎన్నికల్లో కోటేశ్వరరావు రెండోసారీ గెలిచారు. 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఈదర హరిబాబు విజయం సాధించగా, 2014 ఎన్నికల్లో దామచర్ల జనార్దన్ గెలిచారు.

వైసీపీ ఆవిర్భావంతో....

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న సమయంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి బయటకొచ్చి వైసీపీని ఏర్పాటు చేశారు. ఆ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 17 మంది శాసనసభ్యులు ఆ పార్టీకి రాజీనామాలు చేశారు. 2012లో ఒంగోలు నియోజకవర్గానికి ఉప ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో బాలినేని శ్రీనివాసరెడ్డి వైసీపీ తరఫున ఘన విజయం సాధించారు. 2019 సాధారణ ఎన్నికల్లో మళ్లీ బాలినేని గెలిచారు.



ఒంగోలులో జనార్దన్ తరఫున ప్రచారం చేస్తున్న ఆయన భార్య సత్యలత



దర్శిలో లక్ష్మి భర్త సమక్షంలో పార్టీలో చేరుతున్న వైసీపీ శ్రేణులు



సంతనూతలపాడు అభ్యర్థి విజయ్‌కుమార్ తమ్ముడు నాగులుప్పలపాడులో ప్రచారం



కనిగిరిలో ఉగ్ర తరఫున ప్రచారం చేస్తున్న ఆయన కుమారుడు జయసింహారెడ్డి

అభ్యర్థులకు అండగా బంధుగణం

జిల్లాలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు కొండంత అండగా వారి కుటుంబ సభ్యులు నిలుస్తున్నారు. రాజకీయాలలో బంధువులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కీలక నేతలకు అండగా పనులు చక్కబెడుతుంటారు. సాధారణ సమయంలో అవి పరిమితంగానో లేక ఇళ్ల వద్దనో పరిమితం అవుతుంటాయి. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలలో ఇంచుమించు అందరూ అభ్యర్థుల తరపున వారి కుటుంబసభ్యులు, బంధువులు అలాగే వారికి వెన్నంటి నిలిచి ప్రోత్సహించే ఆత్మీయులు అధికంగా భాగస్వామ్యులు అవుతున్నారు. కొందరు అభ్యర్థికి మద్దతుగా కార్యకర్తలు, ప్రత్యేకించి మహిళలతో ఆత్మీయ సమావేశాలు, ఇంటింటి ప్రచారానికి ప్రాధాన్యత ఇస్తుండగా మరికొందరు క్షేత్రస్థాయి పరిస్థితులు అంచనా, వివిధ వర్గాల వారిని దగ్గరకు చేర్చడం, పార్టీలోని వివిధ స్థాయి నేతల మధ్య సమన్వయంతోపాటు పలు అంతర్గత అంశాలపై దృష్టి సారిస్తున్నారు.

టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్న కుటుంబ సభ్యుల ప్రచారం

ఆత్మీయ సమావేశాలు, ఇంటింటా క్యాంపెయిన్

ఆపై అంతర్గత వ్యవహారాల్లో తలమునకలు

సమన్వయంతో దూసుకెళ్తున్న వైనం

ఒంగోలు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గతానికి భిన్నంగా ప్రతి ఇంటింకీ, ప్రతి ఓటరును విధిగా పలకరించక తప్పని పరిస్థితి ప్రస్తుత ఎన్నికలలో కనిపిస్తోంది. దీంతో తక్కువ వ్యవధే ఉండటంతో పోటీ చేస్తున్న అభ్యర్థి అలా అందరిని పలుకరించే అవకాశం లేదు. దీంతో ఆ ప్రచార కార్యక్రమాల్లో అభ్యర్థుల జీవిత భాగస్వాములు, కుమారులు, కుమార్తెలు, తమ్ముళ్లు, తల్లిదండ్రులు పాల్గొంటుండటంతో వారు పర్యటించే ప్రాంతాల్లోనూ టీడీపీ శ్రేణులు ఉత్సాహంగా క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో జనసేన, బీజేపీ శ్రేణులు కూడా సంపూర్ణ మద్దతు పలికి వారితో నడుస్తున్నాయి. ఒంగోలు ఎంపీ, టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి అండగా కుమారుడు రాఘవరెడ్డి విస్తృతంగా పర్యటిస్తుండగా కోడలు చందనలు ప్రచారంలో పాల్గొంటున్నారు. అలాగే పలువురు ఆయన సమీప బంధువులు వివిధ కీలక పనులు చక్కబెడుతున్నారు. వీరు పార్లమెంట్ పరిధిలో తలా ఒక ప్రాంతానికి వెళ్లి ఆయా నియోజకవర్గ అభ్యర్థితో కలిసి క్యాంపెయిన్‌లో పాల్గొంటున్నారు. ఇక ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ తరపున ఆయన సతీమణి నాగసత్యలతతో పాటు కుమార్తెలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకించి మహిళా ఓటర్ల లక్ష్యంగా వారి కార్యక్రమం సాగుతుండగా జనార్దన్ తండ్రి కృష్ణారావు, సోదరుడు డాక్టర్ శివన్నారాయణలు పలు అంశాలలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. కొండపి అభ్యర్థి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి కుటుంబసభ్యులు ఉద్యోగులు కావడంతో ప్రత్యక్ష ప్రచారానికి దూరంగా ఉన్నా.. రాజకీయంగా ఆ కుటుంబానికి సంపూర్ణ అండదండలు ఇస్తున్న పార్టీ యువనేత దామచర్ల సత్య, సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావులు అన్నీ తామై నడిపిస్తున్నారు. సంతనూతలపాడు అభ్యర్థి బీఎన్ విజయకుమార్ తరపున ఆయన సోదరుడు అనిల్‌కుమార్ క్రియాశీలకంగా వ్యవహరిస్తూ నియోజకవర్గాన్ని చుట్టివస్తున్నారు. దర్శి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తరపున ఆమె భర్త డాక్టర్ కడియాల లలిత్ మొత్తం వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. కనిగిరి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి మద్దతుగా ఆయన కుమారుడు జయసింహారెడ్డి విస్తృతంగా పర్యటిస్తూ యువతను ఆకర్షిస్తున్నాడు. గిద్దలూరు అభ్యర్థి అశోక్‌రెడ్డి తరపున ఆయన సతీమణి పుష్పలీల, కుమారుడు కావ్యేష్, సోదరి గీతలు క్యాంపెయిన్‌లో విస్తృతంగా తిరుగుతుండగా సోదరుడు కిషోర్‌రెడ్డి పలు అంశాలలో కీలకంగా పనిచేస్తున్నారు. వైపాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబుకు మద్దతుగా కుమార్తె డాక్టర్ బెల్సియా, కుమారుడు అజిత్‌లు విస్తృతంగా పర్యటిస్తున్నారు.



దర్శిలో మాగుంట తరఫున ఆయన కుమారుడు రాఘవరెడ్డి ప్రచారం

మార్కాపురం టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డికి అండగా ఆయన సోదరుడు రామిరెడ్డి నిత్యం రాజకీయ వ్యవహారాలను చక్కబెడుతుంటారు. ఇప్పుడు అన్నితానై వస్తుండగా నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి, కుమారుడు విఘ్నేష్‌రెడ్డిలు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు.



మార్కాపురంలో కందులతరఫున ఆయన సతీమణి ప్రచారం



దోర్నాల మండలంలో ఎరిక్షన్‌బాబు తరఫున కుమార్తె,కొడుకు ప్రచారం



గిద్దలూరులో అశోక్‌రెడ్డి తరఫున ప్రచారం చేస్తున్న ఆయన భార్య పుష్పలీల



కొండపిలో ఎమ్మెల్యే స్వామి, సత్యల సమక్షంలో టీడీపీలో చేరుతున్న యువత

దేగరమూడి గ్రామంలో నేత నిర్వాకం

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన.. పట్టించుకోని అధికారులు

ఇంటిపై వైసీపీ రంగుల బల్బులు



వైసీపీ నేత ఇంటికి వైసీపీ రంగులతో వెలుగుతున్న బల్బులు

మార్టూరు, ఏప్రిల్ 17 : ఎన్నికల కోడ్ ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకు నిదర్శనమే మండలంలోని దేగరమూడి గ్రామంలో గత 10 రోజుల నుంచి వైసీపీ నేత తన ఇంటికి ఏకంగా వైసీపీ రంగుల విద్యుత్ బల్బులు ధగధగమంటున్నాయి. రాత్రి సమయంలో పరోక్షంగా పార్టీ ప్రచారానికి ఇది ఊతమిస్తోంది. అయినా అధికారులు పట్టించుకోలేదు. రాత్రి పూట కోడ్ ఉల్లంఘనకు రాదేమోనని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. ఇదిలా ఉండగా టీడీపీ వారు చేసే చిన్న చిన్న విషయాలను భూతద్దంలో చూపిస్తూ కోడ్ ఉల్లంఘించారంటూ అధికారులు పదేపదే వేధిస్తూ కేసులు నమోదు చేస్తున్నా.. వైసీపీ వారి జోలికి పోవడం లేదని పలువురు అంటున్నారు.

నామినేషన్‌లకు పటిష్ట భద్రత

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి

పోలీసు అధికారులకు గుంటూరు రేంజ్ ఐజీ త్రిపాఠి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ త్రిపాఠి,హాజరైన పోలీస్ అధికారులు

ఒంగోలు (క్రైం), ఏప్రిల్ 17 : సార్వత్రిక ఎన్నికల నామినేషన్‌ల పర్వం గురువారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్టి త్రిపాఠి ఆదేశించారు. స్థానిక డీపీవోలో ఆయన బుధవారం ఎస్పీ సుమిత్‌సునీల్‌తో కలిసి పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఐజీ మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 25వరకు నామినేషన్‌ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అందుకు అనుగుణంగా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగి, ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండి మద్యం, నగదు, ప్రజలను ప్రలోభాలకు గురిచేసే వస్తువుల సరఫరాకు అడ్డుకట్టవేయాలన్నారు. ఎక్కడికక్కడ నిరంతర తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా రాజకీయ పార్టీల ముఖ్యనాయకుల పర్యటనలలో పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు స్టేషన్ పరిధిలో ముఖ్యమైన ప్రాంతాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈసందర్భంగా జిల్లాలోని పోలింగ్ స్టేషన్‌లు, చెక్‌పోస్టుల వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్పీ వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు కె.నాగేశ్వరావు, ఎస్.వి.శ్రీధర్‌రావు, అశోక్‌బాబు, డీఎస్పీలు కిషోర్‌బాబు, రామరాజు, అశోక్‌వర్ధన్, సిహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజయ నవమి

తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం, అమలుచేయనున్న సూపర్‌సిక్స్ ప్రచార వాహనానికి తెలుగు మహిళలు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి, వాహనాన్ని ప్రారంభించగా, టీడీపీ మహిళలు, యువత, ప్రజల కోసం అమలు చేసే పథకాల గురించి వివరించేందుకు ఈ వాహనం ప్రజల్లోకి వెళ్లనుంది. పథకాల ప్రచారం రథం ఆలోచింపజేస్తోంది.

- ఒంగోలు



భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు

- రామమందిరాల్లో కనుల పండువగా సీతారాముల కల్యాణం
- గిద్దలూరులో కల్యాణంలో పాల్గొన్న రాఘవరెడ్డి, అశోక్‌రెడ్డి


కళ్యాణంలో లక్ష్మణ సహిత సీతారాములు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 17: పట్టణంలోని శ్రీరామనవమి వేడుకలు వాడవాడలా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం పట్టాభి ప్రసన్న రామాలయాలలో ప్రత్యేక పూజలు, సీతారాముల కల్యాణాలు నిర్వహించారు. జవహర్‌నగర్‌లోని లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణమహోత్సవం కమిటీ అధ్యక్షులు డాక్టర్ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలెం చెంచయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. నెహ్రూబజార్‌లోని శ్రీ షిరిడీసాయిబాబా మందిరంలో వసంత నవ రాత్రులు, శ్రీరామనవమి చందనోత్సవం నిర్వహించారు.

పెద్దదోర్నాల : శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా తిమ్మాపురంలోని సీతారామస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు రామయ్య స్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఐనముక్కల గ్రామంలోని శ్రీ పట్టాభిసీతారామ స్వామి దేవాలయంలో గ్రామకమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు కాకర్ల ప్రసాద్ పర్యవేక్షణలో వేదపండితుల మంత్రాల మధ్య మంగళ వాయిద్యాలతో నిర్వహించిన జానకిరాముల కళ్యాణ వేడుకల్లో భక్తులు విశేషంగా పాల్గొని తిలకించారు. అనంతరం వడపప్పు, పానకం ప్రసాదంగా పంపిణీ చేశారు. కార్యక్రమాలలో కమిటీ పెద్దలు బొగ్గరపు రమేష్, ఆర్ పుల్లారావు, పి.సుబ్బారావు, పెరుమాళ్ల నాగేంద్రబాబు, దొడ్డా వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, మండ్లా లక్ష్మయ్య, వెంకటసుబ్బయ్య, యక్కంటి వీరారెడ్డి, గొల్మారు శేఖర్‌రెడ్డి, చిట్యాల రామకృష్ణారెడ్డి, కోటిరెడ్డి, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, జంగిలి పిచ్చయ్య, లింగారెడ్డి పాల్గొన్నారు.

త్రిపురాంతకం : శ్రీరామ నవమి వేడుకల్లో భాగంగా మండల కేంద్రంలోని పాతరామాలయం, కోదండ రామాలయం, టి.చెర్లోపల్లిలోని వెంకటేశ్వరాలయాలతోపాటు అన్ని గ్రామాలలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి సీతారాముల కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం పానకం, వడపప్పు పంపిణీ చేశారు. అన్నసముద్రం మెట్ట అంజనేయస్వామి ఆలయం, త్రిపురాంతకంలోని వై.పాలెం కూడలి వద్ద ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయం, వెల్లంపల్లిలో వీరాంజనేయ స్వామి ఆలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి పొంగళ్లు వండి స్వామివారికి నైవేద్యం సమర్పించారు.



త్రిపురాంతకం, పొదిలిలో సీతారాముల కల్యాణం



గిద్దలూరులో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో శోభయాత్ర, కల్యాణంలో సతీసమేతంగా పాల్గొన్న రాఘవరెడ్డి, అశోక్‌రెడ్డిలు

పొదిలి : పట్టణంలో జూనియర్ కళాశాల వీధిలో నూతనంగా ప్రతిష్టించిన రామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేకపూజలు చేశారు. వివిధ గ్రామాల్లో అంగరంగవైభవంగా రాములవారి కల్యాణం, పట్టాభిషేకం నిర్వహించారు. అనంతరం పానకం, వడపప్పు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

గిద్దలూరు : శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా గిద్దలూరులోని నరవరోడ్డులోని సీతారామ కల్యాణ మండపంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జె.వి.నారాయణ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, మాజీ ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి కుమారుడైన రాఘవరెడ్డిలు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. కల్యాణ మహోత్సవంలో కూర్చుని పూజలు నిర్వహించారు. దేవాలయాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరామశోభ యాత్ర నిర్వహించారు. వీహెచ్‌పీ, బీజేపీ ప్రతినిధులు మోటార్ సైకిళ్లపై జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. పట్టణంలోని రామాలయం, పట్టాభిరామస్వామి దేవాలయం, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం, సాయిబాబా దేవాలయాలలో అత్యంత వైభవంగా రాముల వారికి కళ్యాణ మహోత్సవం, పట్టాభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. వేణుగోపాలస్వామి దేవాలయం, పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు, సామూహిక పూజలను ఏర్పాటు చేశారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

కంభం : కంభం, అర్ధవీడు మండలాల్లోని గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కంభం పట్టణంలోని పట్టాభి రామస్వామి దేవాలయం, కందులాపురం పంచాయతీ నెహ్రూనగర్‌లోని రామాలయం, లింగోజీపల్లి గ్రామంలోని ఉపదేశ రామస్వామి దేవాలయాల్లో సీతారాముల కళ్యాణ వేడుకలు జరిగాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి అంకురార్పణ, సహస్ర నామపూజ, మంత్రపుష్పం అనంతరం స్వామి వారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణం అనంతరం ఆయా దేవాలయాల్లో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అవీ..ఇవీ..

నామినేషన్ల స్వీకరణకు సర్వంసిద్ధం


డీఎస్పీకి మార్గనిర్దేశం చేస్తున్న జేసీ

మార్కాపురం, ఏప్రిల్ 17: జాతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో 4వ విడత ఎన్నిక నిర్వహించనున్నారు. ఈ మేరకు మార్కాపురం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల ప్రక్రియకు రిటర్నింగ్ అధికారి, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్ మీనా ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఈ నెల 18 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమౌతుంది. నామినేషన్లకు 25వ తేదీ తుది గడువుగా నిర్ణయించారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణగా ప్రకటించారు. మే 13న ఎన్నికలు నిర్వహిస్తారు. జూన్ 4న ఒంగోలులో కౌటింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు నిబంధనలను పాటించాలన్నారు. నిర్ధేశించిన దరఖాస్తు ఫారాలు, ధ్రువీకరణ పత్రాలను జతచేయాలన్నారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠినచర్యలు తప్పవన్నారు.

వేసవి సెలవుల దృష్ట్యా ప్రత్యేక రైలు

గిద్దలూరు, ఏప్రిల్ 17 : వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకుని హౌరా నుంచి గిద్దలూరు మీదుగా యశ్వంత్‌పూర్‌కు వారానికి ఒక పర్యాయం ప్రత్యేక రైలు నడుస్తోందని స్థానిక చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, రైల్వే కమిటీ సభ్యుడు నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. 02863 నంబరులోని ఈ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 18 నుంచి జూన్ 27వ తేదీ వరకు వారానికి ఒక రోజు హౌరాలో గురువారం మధ్యాహ్నం 12.40 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 11.35 గంటలకు గిద్దలూరు చేరి అదేరోజు అర్ధరాత్రి 12.15 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుతుంది. శనివారం తెల్లవారుజామున 5గంటలకు ఇదే రైలు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.20 గంటలకు గిద్దలూరు చేరి ఆదివారం మధ్యాహ్నం 1.25 గంటలకు హౌరా చేరుతుందని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు ఈ రెండు నెలలపాటు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

విద్యార్థి ఉసురు తీసిన వాటర్ ట్యాంకర్


బోల్తాపడిన వాటర్ ట్యాంకర్

గిద్దలూరు, ఏప్రిల్ 17 : రాచర్ల మండలం చినగానిపల్లి ఎస్సీకాలనీకి చెందిన పెనమలూరి చరణ్ (11) వాటర్ ట్యాంకర్ బోల్తాపడిన ఘటనలో మృతి చెందాడు. ఎస్సీ కాలనీకి చెందిన 6వ తరగతి విద్యార్థి చరణ్, 10వ తరగతి విద్యార్థి శ్రీహరి సెలవు కావడంతో ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో గ్రామానికి నీటిని తెచ్చే పంచాయతీ వాటర్ ట్యాంకర్ నీరు పట్టుకునేందుకు సమీప జేపీ చెరువు పొలాల వద్దకు వెళ్లారు. అక్కడి నుంచి నీటిని నింపుకొని తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ఓ మలుపు వద్ద అదుపుతప్పి ట్యాంకర్ బోల్తాపడింది. దీంతో చరణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీహరి తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం శ్రీహరిని నంద్యాలకు తరలించారు. చరణ్ మృత్యువాత పడడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. వాటర్ ట్యాంకర్ డ్రైవర్ అజాగ్రత్తగా వాహనం నడపంతోనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు.

విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో గృహం దగ్ధం

- మంటల్లో చిక్కుకున్న వ్యక్తిని కాపాడిన స్థానికులు

కొమరోలు, ఏప్రిల్17 : స్థానిక ఎస్‌బీఐ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహం దగ్ధమైన ఘటన స్థానిక ఎస్‌బీఐ వీధిలో చోటుచేసుకొంది. ఈ ఘటనలో వ్యక్తిని ప్రమాదం నుంచి స్థానికులు కాపాడారు. వారి వివరాల మేరకు స్థానిక ఎస్‌బీఐ వీధిలో పోలెపల్లి పెద్దరంగయ్య నివాసం ఉంటున్నారు. ఇటీవలె పెద్ద రంగయ్య భార్య మృతి చెందింది. కర్మకాండలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్ షాట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే ఇంట్లోని వారందరూ బయటకు పరిగెత్తారు, పెద్దరంగయ్య మరుగుదొడ్డిలో ఉండడంతో మంటల్లో చిక్కుకున్నారు. మంటలు వ్యాపించడంతో స్థానికులు స్పందించి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. పెద్ద రంగయ్య లోపల ఉన్నారని సమాచారం తెలుసుకొని స్థానికులు ఇంటి వెనుక వైపు ఉన్న గ్రిల్స్‌ను పగలగొట్టి ప్రాణాల నుంచి కాపాడారు. మట్టలను స్థానికులు అప్రమత్తమై ఆర్పివేయడంతో చుట్టుపక్కల దుకాణాలకు మంటలు విస్తరించలేదు.

టీడీపీలోకి జడ్పీటీసీ మాజీ సభ్యురాలు


టీడీపీలో చేరిన వెంకటలక్ష్మి, కార్యకర్తలు

కంభం (అర్ధ వీడు), ఏప్రిల్ 17 : అర్ధవీడు మండలం పెద్ద కందు కూరు గ్రా మానికి చెందిన జడ్పీ టీసీ మాజీ సభ్యురాలు వెంకటలక్ష్మి వైసీపీని వీడి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. అర్ధవీడు మండలంలో పర్యటిస్తున్న అశోక్‌రెడ్డిని ఆమె వెంకటలక్ష్మి తన అనుచరగలంతో కలిశారు. రానున్న ఎన్నికల్లో అశోక్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ... నియోజకవర్గంలో టీడీపీపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. కార్యకర్తల ఆశలకు అనుగుణంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై తాను ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

టీడీపీతోనే ఎస్సీల అభివృద్ధి సాధ్యం

పచ్చకండువా కప్పుకున్న ఎస్సీ కుటుంబాలు


నారాయణరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన నేతలు

తర్లుపాడు, ఏప్రిల్ 17: టీడీపీతోనే ఎస్సీల అభివృద్ధి సాధ్యమనే నమ్మకంతో వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు ఎంపీటీసీ మాజీ సభ్యుడు మేకల అచ్చయ్య పలువురు కార్యకర్తలు పేర్కొన్నారు. మార్కాపురం నియోజకవర్గం తర్లుపాడు మండలంలోని జంగంరెడ్డిపల్లి, లింగారెడ్డి కాలనీలకు చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి సమక్షంలో బుధవారం టీడీపీలో చేరాయి. నారాయణరెడ్డి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన మాజీ ఎంపీపీ పులి వేముల ఏసుదాసు, ఎంపీటీసీ సభ్యుడు అచ్చయ్య, మాజీ సర్పంచి యక్కంటి సుబ్బారెడ్డి తదితరులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేసిన పాపానికి ఎస్సీలకు ఎలాంటి మేళ్లు జరగలేదన్నారు. గత టీడీపీలోనే రాయితీ రుణాలు ఇచ్చారని, సబ్ ప్లాన్ నిధులతో అంతర్గత రహదారులు, మురికి కాలువలు నిర్మించారన్నారు. ఈ ప్రభుత్వంలో ఒక్క తట్ట మట్టి పోయలేదన్నారు. టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. నారాయణ రెడ్డి తమకు అండగా ఉంటాడనే భరోసాతో పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నరసింహారావు, వేశపోగు జాను, అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తమ ఓటుతో గద్దె దింపాలని మార్కాపురం ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి తనయుడు కందుల విఘ్నేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని సిద్ధవరం గ్రామంలోని ఎస్సీకాలనీలో రెండవ రోజు ఇంటింటికి మనకందుల, ప్రజాగళం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. సిద్ధవరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు ఆరు గ్యారంటీల గురించి వివరిం చారు. ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులైన కందుల నారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డిలను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పులకించిన భద్రగిరి



భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయ మూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక


కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి


పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం




స్వామివారి ఊరేగింపు


ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు


గౌతమీ నదిలో పుణ్య స్నానాలు

50 సీసాల అక్రమ మద్యం పట్టివేత

పొదిలి, ఏప్రిల్ 17 : ఒకవ్యక్తి మోటార్‌బైక్‌పై తరలిస్తున్న 50 సీసాల అక్రమ మద్యాన్ని పొదిలి ఎస్ఈబీ పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. ఎస్ఈబీ సీఐ బి.ఈశ్వరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఈగలపాడు గ్రామానికి చెందిన శెట్టి పూర్ణ చంద్రరావు అనే వ్యక్తి బైక్‌పై రాజంపల్లి నుండి మద్యం అక్రమంగా తీసుకుపోతున్నారు. తనిఖీలో భాగంగా విచారించగా రాజంపల్లి ప్రభుత్వ మద్యం దుకాణం(జీఆర్‌ఓ కోడ్ 08122)లో పనిచేస్తున్న దద్దాల గాలెయ్య అనే సూపర్‌వైజర్ క్వార్టర్ బాటిల్‌పై రూ.10 అదనంగా తీసుకొని మద్యం సరఫరా చేశాడని తెలిపినట్లు ఆవులయ్య చెప్పారు. వారి ఇరువురిని అదుపులోకి మద్యాన్ని మోటారు సైకిల్‌ను సీజ్ చేశారు. అక్రమంగా మద్యం అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం టీడీపీలోకి జోరుగా వలసలు


టీడీపీలో చేరిన కార్యకర్తలతో ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు, ఏప్రిల్ 17:ఎర్రగొండపాలెంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడూరి ఎరిక్షన్ బాబు పార్టీ కార్యక్రమాల్లో దూసుకుపోతున్నాడు. దీంతో నియోజవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల జోరుగా సాగుతున్నాయి. మరోవైపు కేడర్ కూడా కసితో పనిచేస్తోంది. ఇటు అభ్యర్థి ఎరిక్షన్‌బాబు ప్రచారంతో పాటు పార్టీలోకి వచ్చే నాయకులకు గుర్తించి వారిని పార్టీలోకి తీసుకొచ్చే ప్రణాళికను అమలు చేస్తున్నారు. దీంతో వైసీపీ కేడరు నిరుత్సాహంతో ఉంది. టీడీపీ కేడర్ ఫుల్ జోష్ మీద వుంది.

95 కుంటుంబాలు టీడీపీలో చేరిక

వై.పాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు ఆధ్వర్యంలో ఎర్రగొండపాలెం టీడీపీ కార్యాలయంలో ఎర్రగొండపాలెం మండలంలోని వీరభ్రదాపురం నుంచి 50 కుటుంబాలు, గురిజేపల్లి నుంచి 30 కుటుంబాలు, పెద్దారవీడు మండలం ఎనుగులదిన్నెపాడు నుంచి 15 కుటుంబాలు వైసీపీని టీడీపీలో చేరాయి. వీరికి ఎరిక్షన్ బాబు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో వైసీపీ దాచుకోవడం దోచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీలేదన్నారు. వెలిగొండ ప్రాజెక్టును వైసీపీ పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. మంచి నీటి సమస్య తీవ్రంగా ఉన్నా, ప్రభుత్వం కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాసు సిలిండర్లు, మహిళలకు నెలకు రూ.1500 ఆర్థిక సాయం, రైతులకు ఏడాదికి 20 వేలు సహాయం, నిరుద్యోగులకు నెలకు 3 వేల భృతి, వృద్ధులకు రూ.4 వేల పింఛన్ అందజేసారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు చేకూరి సుబ్బయ్య, టీడీపీ మండల నాయకులు వేగినాటి శ్రీనివాస్, వెంగల్‌రెడ్డి, మంత్రునాయక్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పామూరుపల్లి ఎస్సీ కాలనీలో తాగునీటికి ఇక్కట్లు

- పట్టించుకోని పంచాయతీ అధికారులు
- నిధులు లేవంటూ సమస్యలు దాటవేత
- సమగ్రంగా విచారించాలంటున్న ప్రజలు


నిరసన తెలుపుతున్న మహిళలు

కొమరోలు, ఏప్రిల్ 17 : ఎస్సీ కాలనీలకు అన్ని వసతులు కల్పిస్తున్నామని ప్రభుత్వాలు గొప్పలు చెబుతున్నా కనీసం తాగేందుకు నీరు లేని దుస్థితి పలుచోట్ల దర్శనమిస్తోంది. మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీలోని పామూరుపల్లి ఎస్సీ కాలనీలో సుమారు 60 కుటుంబాలు, బీసీ కాలనీలో మరో 60 కుటుంబాల ఉన్నాయి. ఈ కాలనీలు కడప- అమరావతి రాష్ట్రీయ రహదారి పక్కనే ఉన్నాయి. గతంలో ఎస్సీ సబ్‌ప్లాన్ కింద ఎస్సీ కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంకును ఏర్పాటుచేసి అక్కడి నుంచి ఎస్సీకాలనీ, బీసీ కాలనీ, పాత ఊరుకు నీరు సరఫరా చేసేవారు. గత టీడీపీ హయాంలో పాత ఊరుకు, బీసీ కాలనీలకు ప్రత్యేకంగా బోరు వేసి ఆప్రాంతం వారికే కేటాయించారు. కానీ ఎస్సీకాలనీ, బీసీ కాలనీ ప్రజలకు మాత్రం ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారానే నీరు సరఫరా చేస్తున్నారు. ఈ ట్యాంకు వాల్ సంవత్సరకిత్రం పాడైపోయింది దాన్ని మరమ్మత్తు చేసేందుకు పలుమార్లు గ్రామస్థులు సర్పంచిని, అధికారులను వేడుకున్నా. పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రజలు గట్టిగా ప్రశ్నిస్తే పంచాయతీలో నిధులు లేవని ప్రజలు తప్పుకుంటున్నారు. ప్రభుత్వం బ్రాహ్మణపల్లికి కేటాయించిన నిధులు ఎమయ్యాయి, ఎక్కడకు పోయాయి అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎస్సీలైన తాము కూలీనాలీ చేసుకుని బతికేవాళ్లమని నీటి కోసం కరెంటు వచ్చేంత వరకు వేచి చూడాల్సి వస్తుందన్నారు. గ్రామ పంచాయతీలో బ్రాహ్మణపల్లి, యర్రపల్లి, మిట్టమీదిపల్లి, గోనేపల్లి, మదవపల్లి గ్రామాల్లో కూడా తాగునీటి సమస్య ఉందన్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ నిధులపై కూడా సమగ్రంగా విచారించాలని కోరారు.


లక్కవరం గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

తాళ్లూరు, ఏప్రిల్ 17: ప్రతి ఓటరు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ అన్నారు. ఓటరును భయపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని లక్కవరం గ్రామంలో బుధవారంరాత్రి జరిగిన ఎన్నికల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా, ఎన్నికల సందర్భంగా అవాంచనీయ సంఘటనలు సృష్టించేందుకు యత్నించినా పోలీస్ శాఖ తగు చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలన్నారు. కార్యక్రమంలో దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్, సీఐ సమీముల్లా, ఎస్సై వైవర మణయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజంపల్లిలో నేడు ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల


ప్రసన్నాంజనేయస్వామి

దర్శి, ఏప్రిల్ 17: మండలంలోని రాజంపల్లి పంచాయతీ మునీ నది తీరాన సువచ్చలా సమేతా శ్రీప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల గురువారం వైభవంగా జరగనుంది. ప్రతి ఏడాది చైత్రశుద్ధ దశమి నాడు ఈతిరునాళ్ల నిర్వహించటం ఆనవాయితీ. తిరునాళ్ల సందర్భంగా ఆలయ పూజారులు స్వామి వారికి గణపతిపూజ, అభిషేకం, లక్ష్మతమలార్చన తదితర పూజలు నిర్వహిస్తారు. పలుగ్రామాల ప్రజలు ఈఉత్సవాల్లో పాల్గొంటారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

వైసీపీని ఓడించేందుకు వడ్డెర్లు ఐక్యం కావాలి


మాట్లాడుతున్న దేవేండ్ల తిరుపతయ్య

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 17: రానున్న ఎన్నికల్లో వడ్డెర్లు ఐక్యంగా ఉండి వైసీపీని ఓడించాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి దేవేండ్ల తిరుపతయ్య పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం నిత్యం వడ్డెర్లపై దాడులు నిర్వహిస్తూ పలువిధాలుగా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. జగన్ విజయవాడ పర్యాటనలో వడ్డెర సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు గులకరాయితో దాడి చేశారని, ఎలాంటి ఆధారాలు చూపించకుండా అక్రమంగా నిర్బంధించడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. వడ్డెర యువకులను అక్రమంగా నిర్బంధించడం పిరికిపంద చర్య అని అన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు, బత్తుల వెంకటాద్రి, చావా శేఖర్, కేవీ కొండయ్య, ధనికుల నాగరాజు, తోట చిన్న పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రం సుభిక్షం

పీసీపల్లి, ఏప్రిల్ 17: తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడే రాష్ట్రం సుభిక్షంగా ఉందని ఆపార్టీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని పీసీపల్లి, పెద అలవలపాడు, పెదయిర్లపాడు గ్రామాల్లో బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం తప్పకుండా అధికారంలోకి వస్తుందన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను అమలుచేస్తారని చెప్పారు. కార్యక్రమంలో వీరపనేని పెద్దన్న, కసిరెడ్డి ఓబుల్‌రెడ్డి, పువ్వాడి నాగరాజు, కోమటిగుంట్ల వీరయ్య, దేవరపు కొండపనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్‌లోనే కుటుంబ సంక్షేమ పథకం

దొనకొండ, ఏప్రిల్ 17: రాష్ట్రంలో ఒక్క యూటీఎఫ్ సంఘంలోనే కుటుంబ సంక్షేమ పథకం అమలు చేస్తున్నట్టు ఆసంఘం జిల్లా అధ్యక్షుడు వి.వీరారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చందవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు జి.జానకమ్మ మార్చి 13న అనారోగ్యంతో మృతిచెందారు. యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం కింద మంజూరైన లక్షా యాభై వేల రూపాయల చెక్కును బుధవారం కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు సాంబశివరావు, అమీర్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టి.రాజశేఖర్, హెచ్ఎం రామాంజనేయులు, మండల గౌరవాధ్యక్షుడు ఏ.ప్రభుదాస్, అధ్యక్షుడు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వ్యక్తి అగ్నికి ఆహుతి

తాళ్లూరు, ఏప్రిల్ 17: పొలంలో ఎండు గడ్డిని తగులబెడుతూ ప్రమాదవశాత్తు నిప్పంటుకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం తాళ్లూరులో చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన కోటసుబ్బారెడ్డి(65) మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పొలంలో ఉన్న మొక్కజొన్న ఎండుగడ్డికి నిప్పటించాడు. ఒక్కసారి మంటలు దావానంలా వ్యాప్తిచెందడంతో, అందులో చిక్కుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. రాత్రి 8 గంటల వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనతో బంధువులకు చెప్పారు. పొలంలో వెతుకుతుండగా రాత్రి 12 సమయంలో అగ్నికి ఆహుతై కమిలిపోయిన సుబ్బారెడ్డి మృతదేహం కన్పించింది. మృతదేహాన్ని ఇంటికి తీసుకువచ్చారు. ఈ విషాదఘటనతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

'మహిళా శక్తి'తో ఆర్థిక ప్రయోజనం

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 17: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన మహిళాశక్తి పథకాలతో నిరుపేద మహిళలందరూ ఆర్థిక ప్రయోజనాలు పొందుతారని ఆపార్టీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య తెలిపారు. బుధవారం సీఎస్‌పురంలో జరిగిన బాబు ష్యూరిటీ - భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలనలో సర్వనాశనమైన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పడాలంటే టీడీపీతోనే సాధ్యం అవుతుందన్నారు. కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని ఈప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నేపల్లి శ్రీనివాసులు, బత్తుల వెంకటాద్రి, షేక్ నాయబ్‌రసూల్, జగన్నాధం లక్ష్మి పాల్గొన్నారు.

దర్శిలో సాయుధ బలగాల విన్యాసాలు


విన్యాసాలు చేస్తున్న సాయుధ బలగాలు

దర్శి, ఏప్రిల్ 17: ఎన్నికల సందర్భంగా ప్రజల్లో ధైర్యాన్ని నింపేందుకు పోలీసు అధికారులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా దర్శికి వచ్చిన సాయుధ బలగాలు స్థానిక గడియారస్తంభం సెంటర్‌లో సాహసోపేతమైన విన్యాసాలు చేశారు. డీఎస్పీ అశోక్ వర్ధన్‌రెడ్డి నేతృత్వంలో సాయుధ బలగాలు శత్రువులను ఎలా మట్టుబెట్టాలి, ఆయుధాలతో ఉన్న శత్రువులను ఎలా ఎదుర్కోవాలనే విషయాలను తమ ప్రదర్శన ద్వారా అద్భుతంగా వివరించారు. సాయుధ బలగాల విన్యాసాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో సీఐ షేక్ షమీముల్లా, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

దర్శి, ఏప్రిల్ 17: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు సూచించారు. బుధవారం స్థానిక ఈఆర్వో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. అభ్యర్థులు, రాజకీయ పార్టీలు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలుచేయాలన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీ టి.అశోక్ వర్ధన్‌రెడ్డి, సీఐ షమీముల్లా, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ దేవప్రసాద్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనతో వలసల నివారణకు కృషి

» 93 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరిక

» కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి


పామూరు: ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన కోడిగుడ్లపాడు పంచాయతి ప్రజలు


ఉగ్ర సమక్షంలో టీడీపిలో చేరిన కనిగిరి మండలం తుమ్మకుంట గ్రామస్థులు

కనిగిరి, ఏప్రిల్ 17: కనిగిరి ప్రాంతంలోనే ఉపాధి కల్పించి వలసల నివారణకు కృషి చేస్తానని కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. బుధవారం కనిగిరి, పామూరు మండలాలకు చెందిన 93 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పామూరు మండలానికి చెందిన కట్టకిందపల్లి, కోడిగుడ్లపాడు గ్రామాలకు చెందిన 69 కుటుంబాలు, కనిగిరి మండలానికి చెందిన బూతంవారిపల్లి, తుమ్మకుంట గ్రామాలకు చెందిన 24 కుటుంబాలు చేరారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జరిగిన ఈకార్యక్రమంలో డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు అండగా ఉంటానన్నారు. కనిగిరి ప్రాంతం అభివృద్ధికి కులమతాలకు అతీతంగా తనకు సహకరించాలని కోరారు. వలసల కారణంగా గ్రామాల్లోని ఇళ్లన్నీ ఖాళీగా ఉన్నాయన్నారు. గ్రామాల్లో ప్రచారాలకు వెళ్ళినప్పుడు ముసలి, ముతక తప్ప ఎవరూ లేకపోవటం ఎంతో బాధగా ఉందన్నారు. కనిగిరి ప్రాంతంలోని గ్రామాలన్నీ ప్రజలతో కళకళ లాడాలనేది నా తపన అని అన్నారు. ప్రతి మండలానికి తాగునీటితో పాటు బీడువారిన పొలాలకు సాగునీటిని కూడా తెప్పిస్తానని చెప్పారు. వెలుగొండ జలా లు కనిగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. వైసీపీని నమ్మి ఓట్లేస్తే ఇక కనిగిరి నామరూపాలు కూడా ఉండవన్నారు. ప్రతి గ్రామాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. టీడీపీ గెలుపుతోనే కనిగిరితో పాటు రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. పార్టీలో చేరిన వారు టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీడిపి నాయకులు కుందురు తిరుపతిరెడ్డి, నారపరెడ్డి(యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, దారపనేని చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిన 48 కుటుంబాలు

పామూరు, ఏప్రిల్ 17: మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడు పంచాయతి పరిధిలోని పోతవరం, జంగాలపల్లె గ్రామాల్లోని వివిధ సామాజిక వర్గాలకు చెందిన 48 కుటుంబాలు వైసీపీ వీడి టీడీపీలో చేరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కనిగిరిలోని ఉగ్ర క్యాంపు కార్యాలయంలో బుధవారం వారి పార్టీలో చేరారు. వారందరికీ కూటమి అభ్యర్థి ఉగ్రనరసింహారెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ ఎంపీటీసీ మాల కొండయ్య యాదవ్, మాజీ సర్పంచ్ గురవయ్యయాదవ్, అద్దంకి బాలనాగయ్య, నాగినేని రమేష్‌బాబు, తిరివీధి కేశవరావు, గడిపూడి వెంకటేశ్వర్లు, దారపనేని చెన్నయ్య, మానం మల్లికార్జునరావు, బొడ్డు సుధాకర్, తాళ్ళూరి కృపయ్య, తాళ్ళూరి పావులయ్య, ఇండ్ల చెరువు లక్ష్మయ్య, ఆలూరి రామయ్య ఏసు పోగు నగేష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎం.గంగరాజుయాదవ్, భైరెడ్డి జయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


రజకుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న డాక్టర్ ఉగ్ర

రజకుల సంక్షేమానికి సహకారం

కనిగిరి, ఏప్రిల్ 17: రజకుల సహకారం తానెప్పుడూ మరవలేనని కూటమి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక శివనగర్ కాలనీలో బుధవారం రాత్రి జరిగిన రజకుల ఆత్మీయ సమావేశానికి డి.శివకాశయ్య అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ రజకుల సంక్షేమానికి తన సహకారం అందిస్తామన్నారు. టీడీపీ హయాంలోనే రజకులకు అన్నివిధాల మేలు జరిగిందన్నారు. రజకుల సంక్షేమం కోసం దోబీఘాట్‌లతో పాటు, వివిధ రకాల పనిముట్లను అందించి వారి ఆర్థిక పురోగతికి బాటలు వేసినట్టు చెప్పారు. రజకుల కార్పొరేషన్ ద్వారా ఎన్నో సంక్షేమ పథకాలు అందించి కోట్లాది రూపాయలు అందించిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రజకుల సంక్షేమ భవనం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి వచ్చే నిధులలో జాప్యం జరిగినట్లయితే తన సొంత నిధుల ద్వారా స్థలంతోపాటు భవన నిర్మాణానికి తన పూర్తి సహకారం ఉంటుందని చెప్పారు. రజకుల కుటుంబాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధితోపాటు ఉద్యోగావకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈసందర్భంగా వచ్చే ఎన్నికల్లో ఉగ్ర గెలుపునకు శక్తి వంచన లేకుండా కృష చేస్తామని రజకులు ముక్త కంఠంతో నినదించారు. ఉగ్రను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రజకసంఘం నాయకులు చెలికచర్ల శ్రీనివాసులు(పండు), చిలకపాటి లక్ష్మయ్య, ఉదయగిరి బానుచంద్ర, దేవాదుల మూర్తయ్య మాచర్ల వెంకటేశ్వర్లు, కోమటికుంట్ల వీరయ్య, వేంపాటి కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.


రజానగరంలో భారీ ర్యాలీగా రోడ్‌షో నిర్వహిస్తున్న డాక్టర్ లక్ష్మి

గొట్టిపాటి వారసురాలిగా అండగా ఉంటా.. ఆదరించండి

» కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మి

తాళ్లూరు, ఏప్రిల్ 17: దివంగత మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు, దివంగత మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి నరసయ్య వారసురాలిగా మీ ముందుకు వచ్చా.. ఆదరించండి.. అండగా ఉంటానని కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటిలక్ష్మి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని మల్కాపురం, రజానగరం గ్రామాల్లో బుధవారం సాయంత్రం టీడీపీ దర్శి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ పమిడి రమేష్‌తో కలిసి ఆమె పర్యటించారు. ఈసందర్భంగా ప్రజల నుద్దేశించి మాట్లాడుతూ తాళ్లూరు మండలానికి గొట్టిపాటి కుటుంబంతో విడదీయరాని బంధం ఉందన్నారు. మా తాత హనుమంతరావు గ్రామంలోని ముస్లింపట్ల ప్రత్యేక అభిమానంతో 150 గృహాలు నిర్మించారని చెప్పారు. మా తండ్రి నరసయ్య గ్రామంలో రైతాంగ సంక్షేమం కోసం ఎత్తిపోతల పథకాలను నిర్మింప జేశారన్నారు. మా బాబాయి గొట్టిపాటి రవికుమార్ కృషితో రోడ్ల నిర్మాణం, పలు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గ్రామ అభివృద్ధిలో గొట్టిపాటి కుటుంబం మీకు పూర్తిగా సహాయ సహకారాలు అందించిన విషయాన్ని ప్రజల హృదయాల్లో స్థిరస్థాయిగా ఉందన్నారు. గొట్టిపాటి వారసురాలిగా తాను ప్రజలకు అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు.

రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెంది అగ్రగామిగా నిలవాలంటే దార్శనికుడు చంద్రబాబుకే సాధ్యమని గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. గత ఐదేళ్ల పాలనలో జరిగిన కష్టనష్టాలను గుర్తించి రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నన్ను, ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డిలను గెలిపించాలని కోరారు. టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ పమిడి రమేష్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. చంద్రబాబు వంటి నేత సీఎంగా వుంటే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయన్నారు. రెట్టింపు ఉత్సాహంతో ముందుకుసాగి టీడీపీ అభ్యర్థులను గెలిపించి రాష్ట్ర భవిష్యత్తు మార్పునకు తోడ్పాటు నందించాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ముందుగా గ్రామశివారున ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద, మల్కాపురం రాములవారిగుడి వద్ద గొట్టిపాటి లక్ష్మి, పమిడి రమేష్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, షేక్ కాశీం సైదా, ఆగోలు సుబ్బారావు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, షేక్ కాలేషావలి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలప్రచారంలో భాగంగా రజానగరం, మల్కాపురం గ్రామాలకు వచ్చిన కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటిలక్ష్మి, పమిడి రమేష్‌లకు టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికారు. మహిళలు గుమ్మడి కాయలతో దిష్టితీసి హారతులు ఇచ్చారు. గజమాలతో ఘనస్వాగతం పలికారు.


డాక్టర్ లక్ష్మికి గుమ్మడికాయతో దిష్టితీస్తున్న రజానగరం మహిళలు

వైసీపీ సానుభూతిపరులు టీడీపీలో చేరిక

దొనకొండ, ఏప్రిల్ 17: దొనకొండలోని ఒబ్బాపురం ఎస్సీ కాలనీకి చెందిన పలువురు వైసీపీ సానుభూతిపరులు టీడీపీలో చేరారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు, మోడి వెంకటేశ్వర్లు, కొమ్మతోటి సుబ్బారావు, కుందుర్తి లక్ష్మణ్ ఆధ్వర్యంలో తాటగిరి జాన్‌బాబు, గోపాజి స్టీవెన్ మరో 20 మంది పార్టీలో చేరారు. కూటమి అభ్యర్థి డాక్టర్ లక్ష్మి పార్టీ కండవాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, టీడీపీ నాయకులు షేక్ తోహీద్, సద్దాం, తదితరులు పాల్గొన్నారు.

అంతా రామమయం..

» భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం

కనిగిరి, ఏప్రిల్ 17: కనిగిరిలో బుధవారం శ్రీరామనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక రామాలయం వీధిలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. యువజంటలు ప్రత్యేకంగా కల్యాణాల్లో పాల్గొని సీతారాములకు పట్టువస్త్రాలు సమరించి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని దుర్గాప్యాలెస్ దుకాణ దంపతులు స్వామివారికి కల్యాణాన్ని జరిపించారు. అమ్మవారి మంగళసూత్రాన్ని పురప్రజలకు చూసి తరించారు. భక్తులు పెద్ద సంఖ్యంలో పాల్గొని సీతారాములకు అభిషేకాలు చేసారు. అనంతరం ఆలయ కమిటీ భక్తులకు పానకం, వడపప్పు, ప్రసాదాలను అందించారు. అదేవిధంగా పట్టణంలోని కోదండరామస్వామి ఆలయం, కూచిపూడిపల్లిలోని రామాలయం, కొత్తూరు రామాలయంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

దర్శిలో.. దర్శి, ఏప్రిల్ 17: మండలంలో శ్రీరామనవమి వేడుకలను బుధవారం వైభవంగా జరిగాయి. ఈసందర్భంగా రామాలయాల్లో సీతారాముల కల్యాణాలు నిర్వహించారు. కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, నగర పంచాయతీ చైర్మెన్ నారపుశెట్టి పిచ్చయ్య తదితరులు దర్శి పట్టణంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తులకు తీర్థప్రసాదాలు అందించటంతో పాటు అన్నదానం చేశారు.

పీసీపల్లిలో.. పీసీపల్లి, ఏప్రిల్ 17: శ్రీరామనవమిని బుధవారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.గ్రామాల్లోని ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేసి సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపారు. ఆయా గ్రామాల్లో ఆలయాల వద్ద కల్యాణాన్ని వీక్షించి సీతారాముల వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా పలువురు భక్తులు రామదాసు కీర్తనలను పాడి ఆలయాల్లో భజనలు చేశారు. సీతారాములకు ప్రీతిపాత్రమైన వడపప్పు, పానకాలను భక్తులకు పంచిపెట్టారు. రాత్రికి సీతారాముల విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు.

దొనకొండలో.. దొనకొండ, ఏప్రిల్ 17: మండలంలోని అన్నిగ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాల్లో సీతారాముల వారి కల్యాణ వేడుకలు కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయాలు శ్రీరామ నామంతో మార్మోగాయి. దొనకొండ సమీపంలోని ఆనంద ఆశ్రమంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి నేతృత్వంలో ప్రత్యేక అభిషేకాలు, సీతారామ అష్టోత్తర శతనామావళి తదితర పూజలు నిర్వహించారు. నగర సంకీర్తన శోభాయాత్ర నిర్వహించారు.


దొనకొండ: ఆనంద ఆశ్రమంలో నగర సంకీర్తన శోభాయాత్ర చేస్తున్న భక్తులు

తాళ్లూరులో.. తాళ్లూరు, ఏప్రిల్ 17: మండలంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాళ్లూరులోని రామాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయాలవద్ద గత 9 రోజులుగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. మండంలోని రామాలయాలు రామనామస్మరణతో మారుమ్రోగాయి. తాళ్లూరులోని రామాలయం, కన్యకాపరమేశ్వరి ఆలయాలవద్ద, నాగంబొట్లపాలెం, శివరాంపురం, తూర్పుగంగవరం, విఠలాపురం, బొద్దికూరపాడు, మాధవరం, లక్కవరం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో సీతారాముల కల్యాణవేడుకలు కన్నుల పండువగా జరిగాయి. రాత్రి స్వాములను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.


దర్శి: రామాలయంలో పూజలు చేస్తున్న కూటమి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, ఆమె భర్త డాక్టర్ లలిత్‌సాగర్ తదితరులు

పామూరులో.. పామూరు, ఏప్రిల్ 17: మండలంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. పామూరు పట్టణంలోని ఆలయాల్లో కల్యాణ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామి వార్ల గ్రామోత్సవం నిర్వహించారు. కాగా మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా జరపుకొన్నారు. పలుచోట్ల అన్నదానం చేశారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, ఏప్రిల్ 17: మండలంలో శ్రీరామనవమి వేడుకలను బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేకపూజలు చేసి, స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు. ముండ్లమూరు, భీమవరం, వేంపాడు, ఈదర, మారెళ్ళ, పసుపుగల్లు, ఉల్లగల్లు, వేముల, శ్రీనివాస నగర్, కెల్లంపల్లి, ఉమామహేశ్వర అగ్రహారం గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మండలంలోని జమ్మలమడక గ్రామంలో వేంచేసి ఉన్న సీతారామ చంద్ర స్వామి ఆలయంలో బుధవారం శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సీతారామ కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అర్చకులు క్రిష్ణ ప్రసాదాచార్యులు, తెనాలికి చెందిన పిల్లలమర్రి దక్షిణామూర్తి శర్మల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం జరిగింది. కార్యక్రమంలో జమ్మలమడక హనుమంతరావు, జమ్మలమడక బుచ్చిరామారావు, కాపా రమణారెడ్డి దంపతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


కనిగిరి: కూచిపూడిపల్లి రామాలయంలో జరిగిన కల్యాణంలో పాల్గొన్న దంపతులు

కురిచేడులో.. కురిచేడు, ఏప్రిల్ 17: మండలంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. కురిచేడు ప్రధాన కూడలిలోని కోదండ రామాలయంలో మధ్యాహ్నం కన్నుల పండువగా సీతారామ కల్యాణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. పాకనాటి రెడ్ల బజారులో ఉదయం కల్యాణం నిర్వహించి రాత్రికి భక్తులకు అన్నదానం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలలోని రామాలయాలలో కల్యాణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పడకేసిన పారిశుధ్యం

» కంపుకొడుతున్న కనిగిరి

» మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం

» ఇబ్బందులు పడుతున్న ప్రజలు


మురుగు కాల్వలో పేరుకుపోయిన చెత్త

కనిగిరి, ఏప్రిల్ 17: ఎన్నికల పనుల సాకుతో మున్సిపల్ అధికారులు పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది సమయపాలన పాటించడంలేదు. హడావిడిగా పైపై పనులు చేస్తూ సాయంత్రానికి కాలం గడిపేస్తున్నారు. నగరంలో నిత్యం ప్రతి ఇంటి నుంచి వచ్చే చెత్త సేకరణ కూడా సక్రమంగా చేయటం లేదని విమర్శలు వస్తున్నాయి.

కనిగిరి మున్సిపాల్టీ పరిధిలో 20 వార్డులు ఉన్నాయి. అందుకుతగ్గట్టు పారిశుధ్య సిబ్బంది లేదు. దీంతో ప్రజలకు సక్రమంగా సేవలు అందడ లేదు. సిబ్బంది కొరత వేధిస్తున్నది. దీనికితోడు ఉన్న సిబ్బంది కూడా సక్రమంగా విధులు నిర్వహించడంలేదు. దీంతో మురుగు కాల్వల్లో చెత్త, ఎక్కడిపడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య పనులను అధికారులు పర్యవేక్షించడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. రెండు రోజులకోమారు మురుగు కాల్వలు శుభ్రం చేయాలి. పది రోజులు దాటినా శుభ్రం చేయటం లేదు. దీంతో మురుగు నిలిచిపోయి వీధులన్నీ దుర్వాసన వెదజల్లుతున్నాయి. ప్రధాన డ్రైనేజీల్లో కూడా చెత్త పేరుకుపోవడంతో దోమలు ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నగరంలో నాయకులు వచ్చినప్పుడు తప్ప గత మూడు నెలలుగా వీధుల్లో బ్లీచింగ్ చల్లిన పాపాన పోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మంగళ సూత్రాలను భక్తులకు చూపుతున్న అర్చకులు



- అంగన్వాడీల్లో పౌష్టికాహారం అంతంతే
- సాంకేతిక సమస్యలతో పోషణకు దూరం
- నాలుగు రకాల యాప్‌ల్లో నమోదైతేనే ఇండెంట్
- ప్రతి నెలా 30శాతం మందికి అందని పోషకాహారం
- వచ్చిన సరుకుల పంపిణీతో సరిపుచ్చుతున్న సిబ్బంది

పోషణ అసంపూర్ణం

గుంటూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ సంపూర్ణ పోషణ అంతంతగానే ఉంది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అంగన్వాడీ వ్యవస్థ అంతకంతకూ అధ్వానంగా మారిపోతోంది. పోషకాహార లోపంతో బాధపడే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు తగిన పోషణ అందకుండానే పోతోంది. సాంకేతికంగా మరింత మెరుగుపడాల్సిన వ్యవస్థ అంతకంతకూ దిగజారిపోతోంది. నూతనంగా రూపొందించిన యాప్‌ల కారణంగా సక్రమంగా సరుకులు అందడం లేదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలో మొత్తం 5,399 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా 3 లక్షల 83 వేల మందికి పోషణ పొందుతున్నారు. గుంటూరు జిల్లాలోని 1,480 అంగన్వాడీ కేంద్రాల్లో 10140 మంది గర్భిణులు, 7,804 మంది బాలింతలు, పల్నాడు జిల్లాలోని 1888 అంగన్వాడీ కేంద్రాల్లో 12,348 మంది గర్భిణులు, 9,289 మంది బాలింతలు, బాపట్ల జిల్లాలో 2,031 అంగన్వాడీ కేంద్రాల్లో 7,738 మంది గర్భిణులు, 6,147 మంది బాలింతలు పోషణ పొందుతున్నారు. కాగా మూడు జిల్లాల్లో 2లక్షల 70వేల 950 మంది మూడేళ్లలోపు చిన్నారులు, 59 వేల 389 మంది మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలకు అంగన్వాడీల ద్వారా పౌష్టికాహారం అందజేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్‌ల కారణంగా వీరిలో మూడో వంతు మందికి పోషణ లభించడం లేదని తెలుస్తోంది.

పోషణ ఇలా..

గర్భిణులు, బాలింతలకు ప్రతి నెలా 25 కోడి గుడ్లు, 5 లీటర్ల పాలు, 3 కిలోల బియ్యం, కేజీ కంది పప్పు, అర లీటరు నూనె, 2 కేజీల రాగిపిండి, ఒక కేజీ అటుకులు, వేరుశనగ చిక్కీలు, ఎండు కర్జూరం, బెల్లం పావు కిలో చొప్పున పోషకాహారం కింద అందిస్తారు. మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు ప్రతి నెలా 25 గుడ్లు, రెండున్నర లీటర్లు పాలు, రెండున్నర కిలోల బాలామృతం అందిస్తారు. ప్రీ స్కూల్ పిల్లలకు భోజనం అక్కడే వండి పెట్టాలి. బియ్యం 75 గ్రాములు, కందిపప్పు 15 గ్రాములు, నూనె 5 గ్రాములు మాత్రమే వారికి భోజనానికి ఇస్తారు. దాంతో పాటు రోజుకు ఒక గుడ్డు, 100 మి.లీ.ల పాలు పిల్లలకు ఇవ్వాలి. నామమాత్రంగా కేటాయించే బియ్యం, కందిపప్పు, నూనెతో పిల్లలకు సరైన భోజనం లభించడం లేదు. దీంతో ప్రీ స్కూల్ పిల్లలు పోషణకు దూరమైపోతున్నారు. కాగా మిగిలిన వారికి ఇండెంట్ సరిగా రాకపోవడంతో వచ్చినవాటితో అంగన్వాడీ సిబ్బంది సరిపుచ్చుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన సంపూర్ణపోషణ

పోషకాహారలోపంతో బాధపడే చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు అంగన్వాడీల్లో పౌష్టికాహారం అందించాలి. అయితే ఏటా పాలు, కోడిగుడ్ల సరఫరా సక్రమంగా జరగక ఇబ్బందులు పడిన లబ్ధిదారులు ఇప్పుడు యాప్‌ల పుణ్యాన పోషణకు దూరమై పోతున్నారు. నాలుగు రకాల యాప్‌ల్లో తలెత్తే సాంకేతిక సమస్యల కారణంగా అనేకమందికి సక్రమంగా సరుకులు అందడంలేదు. ఒక రకంగా చెప్పాలంటే పోషణ కార్యక్రమానికే ఈ యాప్‌లు అడ్డంకిగా మారాయని ఉద్యోగులు, లబ్ధిదారులు చెబుతున్నారు. యాప్‌లన్నింట్లోనూ నమోదైతేనే ఇండెంట్ వస్తుంది లేదంటే ఆ అంగన్వాడీ కేంద్రానికి సరుకులు కేటాయింపు జరగదు. దీంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు పోషణ అందక అల్లాడుతున్నారు.

యాప్‌లో లబ్ధిదారుల పేర్లు నమోదైనా, ఎఫ్ఆర్‌సీలో నమోదైనా లబ్ధిదారులకు మాత్రం ప్రభుత్వం ఇండెంట్ ఇవ్వడం లేదని అంగన్వాడీ సిబ్బంది చెబుతున్నారు. దీనిపై అధికారులను ప్రశ్నించగా అన్ని యాప్‌ల్లో లబ్ధిదారులు నమోదు కావాల్సిందేనని, ప్రత్యేకంగా పోషణ ట్రాకర్ యాప్‌లో నమోదైతేనే ఇండెంట్ వస్తుందని చెబుతున్నారని అంటున్నారు. దీనిపై రెండు రోజుల క్రితం ప్రత్యేక సమావేశం నిర్వహించి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారని కూడా తెలుస్తోంది. దీంతో సిబ్బంది పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి చందంగా మారింది. ఇండెట్ ఇవ్వడానికి అధికారులు ఇబ్బంది పెడుతుంటే, పోషణ రాక లబ్ధిదారులు ఒత్తిడి పెడుతున్నా రు. దీంతో వారు నలిగిపోతున్నారు. అయితే ప్రభుత్వ నిర్వాకం కారణంగా లబ్ధిదారులు క్రమంగా పోషణ కార్యక్రమానికి దూరమయ్యే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది.

యాప్‌లు తెచ్చిన తంటా

గతంలో అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల హాజరు నమోదు చేసేవారు. దాని ఆధారంగా వారికి పోషణ ఖరారయ్యేది. కానీ ప్రభుత్వం తాజాగా అనేక యాప్‌లు రూపొందించింది. ప్రతిరోజూ మొత్తం నాలుగు రకాల యాప్‌ల్లో లబ్ధిదారులను నమోదు చేయాలి. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పోషణ ట్రాకర్ యాప్‌లో ప్రతి రోజూ ఆధార్ వెరిఫికేషన్ చేయించాలి. ఫేస్ రికగ్నిజేషన్ సిస్టమ్(ఎఫ్ఆర్ఎస్) యాప్‌లో ప్రతి రోజూ లబ్ధిదారుల ముఖ హాజరు నమోదు చేయాలి. వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో పేర్లు నమోదు చేయాలి. మిల్క్ యాప్‌లో నమోదు చేయాలి. ఈ యాప్‌లలో నమోదు చేసేటప్పుడు అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. యాప్‌లో నమోదు చేసే సమయంలో ఏరోజు కారోజు అవి ఎగ్జిస్టింగ్ అని వస్తున్నాయి. దీంతో పేర్లు నమోదు కావడం లేదు. లేదంటే నేరుగా డస్టుబిన్‌లోకి పేర్లు వెళ్లిపోయి, నమోదైనది లేనిదీ తెలియడం లేదని అంగన్వాడీ సిబ్బంది చెబుతున్నారు. ఇలా అన్ని యాప్‌లలో పేర్లు సక్రమంగా నమోదైనదీ లేనిది తెలియడం లేదు. ఇండెంట్ వచ్చిన తరువాత చూసుకుంటే సగం మందికి ఇండెంట్ రావడం లేదని, దీంతో తాము కేంద్రాలను నడపడం కష్టమైపోయి, లబ్ధిదారులతో మాటలు పడాల్సి వస్తోందని సిబ్బంది వాపోతున్నారు.



- వాడవాడలా శ్రీరామనవమి వేడుకలు
- రామ నామస్మరణలతో తరించిన భక్తజనం
- అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణోత్సవాలు
- భక్తులతో కిక్కిరిసిన శ్రీరామ, ఆంజనేయస్వామి దేవాలయాలు

కల్యాణం కమనీయం

బాపట్ల, తెనాలి, ఏప్రిల్ 17: శ్రీరామనవమి వేడుకలు వాడవాడలా బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా రామ నామస్మరణలతో తరించారు. జిల్లాలోని రామాలయాలు, ఆంజనేయస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణాలు, పల్లెల్లో జరిగిన శ్రీసీతారాముల కల్యాణోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై తిలకించి పులకించిపోయారు. వాడవాడలా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఆలయాల్లో వేకువ జాము నుంచే స్వామి మూలవిరాట్‌కు అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ, వడపప్పు, పానకం అందజేశారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు కల్యాణంలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు.

- బాపట్ల పట్టణం, మండలంలో శ్రీరామనవమి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. బాపట్లలోని రథం బజారులో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి నవమి వేడుక, శ్రీసీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించారు. భీమావారిపాలెంలో వేంచేసి ఉన్న శ్రీకోదండరామస్వామి దేవాలయంలో నిర్వహించిన నవమి ఉత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రేపల్లె పట్టణం, గ్రామాల్లో సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి అన్నదానాలు చేశారు. పాత స్టేట్ బ్యాంక్ వద్ద బాలభక్త బృందం వారిచే 58వ సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. వేమూరు, అబ్బనగూడవల్లి, కుచ్చెళ్ళపాడు, చావలి కొత్తపాలెం, జంపని, వరహాపురం, పెనుమర్రు గ్రామాల్లోని పురాతన రామాలయాల్లో ఆగమశాస్త్ర ప్రకారం మూడు రోజుల దీక్షతో వార్షిక నవమి ఉత్సవాలు నిర్వహించారు. చావలిలోని ఎనిమిది దిక్కుల ఉన్న రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండుగగా జరిపారు. భద్రాద్రి రాముని కల్యాణం నిర్వహించే సమయంలోనే చుండూరు, ఆలపాడు, మండూరు, మోదుకూరు, నడిగడ్డపాలెం గ్రామాల్లో పూర్వకాలం నుంచి సంప్రదాయ బద్ధంగా జరుగుతున్న వేడుకలు ఈ ఏడాది కూడా కొనసాగాయి.



తెనాలిలో కల్యాణాన్ని తిలకిస్తున్న భక్త జనం



గాడిబావి సెంటర్‌లో కళ్యాణ శోభలో శ్రీసీతారాములు

జాతరను తలపించిన తెనాలి

శ్రీసీతారాముల కల్యాణోత్సవంతో తెనాలి మెయిన్ రోడ్డు, బోసురోడ్డు జాతరను తలపించాయి. విశాలమైన చలువ పందిళ్లలో అందమైన వేదికలు సిద్ధం చేసి స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ స్వామి వారిని దర్శించుకున్నారు. గాడిబావి సెంటర్‌లోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయం ముంగిట కన్నుల పండువగా కల్యాణం జరిపించారు. మెయిన్ రోడ్డులో పలు చోట్ల వ్యాపారులు వేదికలు ఏర్పాటు చేసి రాముల వారి కల్యాణాలను జరిపించారు.

శోభాయమానంగా శోభాయాత్ర



గుంటూరు గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి గుడి వద్ద నుంచి ప్రారంభమైన శోభాయాత్ర

గుంటూరు(తూర్పు): శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా గుంటూరులో శ్రీరామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శోభాయాత్ర అట్టహాసంగా జరిగింది. స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద శోభాయాత్రను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ దంపతులు ప్రారంభించారు. సీతారాములు ఉత్సవ విగ్రహాలతో పాటు ఆంజనేయస్వామి విగ్రహాలను రథోత్సవంలో ఏర్పాటు చేశారు. జై శ్రీరామ్, జైజై శ్రీరామ్ నినాదాలతో భక్తులు యాత్రలో పాల్గొ న్నా రు. ఈ సందర్భంగా యాత్రలో పాల్గొన్న భక్తులకు పలు స్వచ్ఛంద సంస్థలతో పాటు కొన్ని ప్రాంతా ల్లో ముస్లిం మహిళలు తాగునీరు, మజ్జిగ తదితరాలను పంపిణీ చేశారు.



నేటి నుంచి నామినేషన్లు

ఈ నెల 25 వరకు అవకాశం • ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం • ఆర్‌వో కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు

బాపట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు ఒక లోక్‌సభ స్థానానికి నామినేషన్ల ఘట్టం గురువారం నుంచి ప్రారంభం కానుంది. గురువారం ఎన్నికల గెజిట్ నోటిఫికేషన్ జారీతో పాటు నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభిస్తారు. ఈ నెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ జరగనుంది. నామినేషన్ల స్వీకరణ కోసం ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో నామినేషన్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను, పత్రాలు అందించే విభాగం, డిపాజిట్ కేంద్రాలను సిద్ధం చేశారు. నామినేషన్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతం మొత్తాన్ని సీసీ కెమెరాల నిఘాలో భద్రతను పర్యవేక్షించనున్నారు. బరిలో ఉండే అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో అందించాలి. సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ దరఖాస్తు సక్సెస్ అయిన తర్వాత వచ్చే పత్రాలపై అభ్యర్థి స్వయంగా సంతకం చేసి ఆ కాపీలను ఆర్‌వోలకు సమర్పించాలి.

ఊపందుకోనున్న ప్రచారాలు

ఇప్పటికే ఇంటింటి ప్రచారంతో దూకుడు మీదున్న రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్ల అనంతరం మరింత జోరు పెంచనున్నారు. పాలకపార్టీ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు ఐదేళ్లలో వైసీపీ చేసిన విధ్వంసాన్ని ప్రజలకు వివరిస్తూ ప్రచారంలో టీడీపీ నేతలు ముందువరుసలో ఉన్నారు. ఆయా నియోజక వర్గాల్లో అభ్యర్థులు వారి సెంటిమెంట్ ఆధారంగా నామినేషన్లు వేయడానికి ముహూర్తం నిర్ణయించుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు.

పటిష్ట బందోబస్తు ఏర్పాటు : ఎస్పీ వకుల్‌జిందాల్

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించుకునే అభ్యర్థులు పోలీస్ శాఖకు ముందస్తుగా సమాచారం అందించాలన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగానే ప్రచారం సాగాలని వాటిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ఊరేగింపులో పది వాహనాలకు మించి ఉపయోగించరాదన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో రిటర్నింగ్ అధికారి వద్దకు అభ్యర్థితో పాటు మరో నలుగురు వ్యక్తులను మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు. ఆర్‌వో కార్యాలయ పరిధిలోని వందమీటర్ల లోపులో అభ్యర్థికి చెందిన మూడు వాహనాలను మాత్రమే అనుమతించడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

- అమలుకు నోచుకోని జగన్ వాగ్దానాలు
- శంకుస్థాపనలకే పరిమితమైన ప్రాజెక్టులు
- సీఎం హోదాలో ఇచ్చిన వరాలూ ఉత్తమాటలే

హామీలన్నీ.. నీటి మూటలే..



గుంటూరు ఛానల్ దుస్థితి

బాపట్ల, ఏప్రిల్ 17 (ఆంధ్ర జ్యోతి): ప్రతిపక్ష నేతగా పాదయాత్రలోనూ, ముఖ్య మంత్రి పదవి చేపట్టిన తర్వాత జిల్లా పర్యటనలో జగన్ హామీల జల్లులు కురిపించారు. అయితే ఐదేళ్లలో ఒక్కటంటే ఒక్క హామీని కూడా జగన్ నెరవేర్చలేకపోయారు. పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు చేశారు కానీ.. పైసా నిధులు విడుదల చేయలేదు. బాపట్లలోని మెడికల్ కళాశాల నిర్మాణం మొదలు గుంటూరు చానల్ పొడిగింపు వరకు వైసీపీ ప్రభుత్వం పట్టాలెక్కించలేకపోయింది. సీఎం హోదాలో ఇచ్చిన హామీలలో దాదాపు 90 శాతం అటకెక్కించారు. ఇక మిచౌంగ్ తుఫాన్ బాధిత రైతుల్ని ఆదుకోవడంలో కూడా శీతకన్నేశారు. బాపట్ల జిల్లాగా ఆవిర్భవించాక 2022 ఆగస్టు 11న తొలిసారి బాపట్లకు వచ్చారు. రెండోసారి డిసెంబరు 21న చుండూరు మండలం యడ్లపల్లిలో పర్యటించారు. గడచిన ఏడాది నిజాంపట్నంలో పర్యటనకు వచ్చారు. సీఎం హోదాలో పలు వరాల ను ఆయ వేదికలమీద జగన్ ఇచ్చారు. ఒక్కటంటే ఒక్క హామీ కూడా ఇంత వరకు అమలుకు నోచు కోలేదు. ప్రతిపక్ష నేత, సీఎం హోదాల్లో జగన్ ఇచ్చిన వరాలను పరిశీలిస్తే.. అద్దంకి మండలం శింగరకొండ సమీపంలోని భవనాశి చెరు వును రిజర్వాయరుగా మారుస్తానని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదు. నామ్ రహదారి పనుల ఊసేలేదు. కొరిశపాడు మండల పరిధిలోని ఎర్రం చినపోలిరెడ్డి, తమ్మవరం -2 ఎత్తిపోతల పథకాలు పూర్తి చేస్తానన్న హామీ ఉత్తమాటలుగానే మిగిలాయి. అద్దంకి బ్రాంచ్ కాలువపై వంతె నకు మోక్షం కలగలేదు.

- గుంటూరు చానల్‌ను పెదనందిపాడు నుంచి పర్చూరు వరకు పొడిగింపునకు మోక్షం కలగలేదు. కొల్లూరు మండలం తాడిగిరిపాడు వద్ద ఎత్తిపోతల పథకం పూర్తి ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. జంపని చక్కెర కర్మాగారం ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదు. బాపట్లలో ఆర్భాటంగా ప్రారంభించిన మెడికల్ కళాశాల పునాదుల దశ దాటలేదు. పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టిసారిస్తానన్న జగన్ మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి. ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. చీరాల ఫిషింగ్ హార్బర్ పనులకు మోక్షం లభించలేదు. నిజాంపట్నం హార్బర్ అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి.
- కృష్ణానదిపై రెండు చోట్ల నిల్వ చేసేలా చెక్ డ్యాంల కోసం దాదాపు రూ.2,000 కోట్లతో ప్రతిపాదనలతో సరిపెట్టారే తప్ప అడుగుముందుకు పడిన పాపానపోలేదు. బాపట్ల ప్రజల దాహార్తి తీర్చడానికి అదనపు రక్షిత నీటి పథ కం చెరువు తవ్వకానికి భూసేకరణ కోసం రూ.18 కోట్లు, రహదారుల నిర్మాణానికి పది కోట్లు, మంజూరు చేస్తున్నట్లు బాపట్ల సభలో ప్రకటించగా ఇంతవరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. సముద్ర జలాలు వేమూరు నియోజకవర్గ గ్రామాల్లోకి రాకుండా కృష్ణానదిలో 4.90 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో బ్యారేజీ నిర్మిస్తానని చుండూరు మండలం యడ్లపల్లి సభలో వాగ్దానం చేశారు. అది మాటలకే పరి మితమైంది. వేమూరు నియోజకవర్గంలో పీఎంజీఎస్ కింద రహదారుల నిర్మాణానికి రూ.15.60 కోట్లు మంజూరు చేస్తానని ఇచ్చిన హామీ ఉత్తమాటలుగానే మిగిలాయి. దిండిలో రూ.185 కోట్లతో ఆక్వా పార్కు, వాడరేవులో రూ.417 కోట్లతో ఫిషింగ్ హార్బర్ హామీలు పట్టా లెక్కలేదు.



శిథిలావస్థకు చేరిన రేపల్లెలోని టిడ్కో గృహాలు



కొల్లూరు: తాడిగిరిపాడు ఎత్తిపోతల పథకం దుస్థితి

మొక్కజొన్న గింజలు ఎండబెడుతున్న రైతు



మొక్కజొన్న అంతంతే

- తెగుళ్లు, నీటి ఎద్దడితో తగ్గిన దిగుబడి
- నెల రోజుల్లో రూ.300-400 తగ్గిన ధరలు

కొల్లూరు, ఏప్రిల్ 17: ఈ ఏడాది రబీలో సాగు చేసిన మొక్కజొన్న దిగుబడులు అంతంత మాత్రంగా ఉన్నాయని రైతులు వాపోతున్నారు. తెగుళ్లు, నీటి ఎద్దడితో 10 క్వింటాళ్ల వరకు దిగుబడులు తగ్గిపోయాయి. కొల్లూరు మండలంలో సుమారు 9 వేల ఎకరాల మాగాణి భూముల్లో రైతులు ఈ ఏడాది రబీలో మొక్కజొన్న సాగు చేపట్టారు. ఖరీఫ్ చివరిలో తుఫాన్ వల్ల కురిసిన వర్షాలతో మొక్కజొన్న పైరు 20 రోజులు ఆలస్యమైంది. విత్తనాలు నాటినప్పటి నుంచి పైరును చీడపీడలు ఆశించడంతో అప్పుడే 20 శాతం మొక్కలు దెబ్బతిన్నాయి. మిగిలిన పంటను కాపాడుకుందామని రైతులు ప్రయత్నించినా సాగు నీరు సకాలంలో విడుదల కాలేదు. దీంతో పంటకు నీటి తడులు అందించేందుకు రైతులు భూగర్భ జలాలపై ఆధారపడాల్సి వచ్చింది. దీంతో రైతులకు అదనపు వ్యయ భారం పడింది. ఎకరా పైరుకు ఒక్కొక్క నీటి తడికి రూ.2 వేలు నుంచి రూ.3 వేలు వరకు ఖర్చు చేసినట్లు రైతులు తెలిపారు. ఇంత చేసినా మార్చిలో భూగర్భ జలాలు కూడా అడుగంటి పోవడంతో ఆయిల్ ఇంజన్లు, విద్యుత్ మోటార్లు మొరాయించడంతో పంటలకు నీటి తడులు అందించడం గగనంగా మారింది. ఈ ప్రభావం పంట దిగుబడులపై చూపడంతో ఎకరాకు 10 క్వింటాళ్లకు పైగా తగ్గాయని రైతులు చెబుతున్నారు. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్లు మాత్రమే దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. పైగా అధిక ఉష్ణోగ్రతలతో పొలాల్లోని పైరు ఒక్కసారిగా తిరిగమారిపోయి కండెలు ముదిరిపోయాయని వాపోతున్నారు. నెల రోజులకు ముందు మెట్ట భూముల్లో సాగు చేసిన మొక్కజొన్న పంటను దళారులు క్వింటా రూ.2400-2500 వరకు కొనుగోలు చేశారు. మాగాణి భూముల్లో పంట చేతికి వచ్చే సమయానికి దళారులు సిండికేట్‌గా ఏర్పడి రూ.300-400 వరకు తగ్గించేశారని రైతులు తెలిపారు. ఎన్నికల కారణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారో లేదో తెలియని పరిస్థితి నెలకొందని, దీనిని అవకాశంగా చేసుకుని దళారులు ధరలు తగ్గించారని రైతులు వాపోతున్నారు.

తొలి ఘనత ఒంగోలుకే సొంతం


ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శాసనసభ్యునిగా గెలుపొందిన టంగుటూరి ప్రకాశం పంతులు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1955లో ద్విసభ్య శాసనసభ్యులు కొనసాగగా ఆ సమయంలో టంగుటూరు ప్రకాశం పంతులు సీపీఐ అభ్యర్థి ఎం. నారాయణస్వామిపై విజయం సాధించారు. 1953 అక్టోబరు 1 నుంచి 1954 నవంబరు 15వ తేదీ వరకు ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా పనిచేశారు. జిల్లా వాసైన ప్రకాశం పంతులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా ఒక ఏడాది 45 రోజుల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసి ఒంగోలుకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారు.

ఒంగోలు వెరీవెరీ స్పెషల్

అసెంబ్లీ నియోజకవర్గ చరిత్ర ఎంతో ఘనం

ఒంగోలు నియోజకవర్గం ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు గెలిచిన అభ్యర్థులు

సంవత్సరం	గెలిచిన అభ్యర్థి	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	మెజార్టీ
2019	బాలినేని శ్రీనివాసరెడ్డి	వైసీపీ	దామచర్ల జనార్ధన్	టీడీపీ	22,245
2014	దామచర్ల జనార్దన్	టీడీపీ	బాలినేని శ్రీనివాసరెడ్డి	వైసీపీ	12,428
2012(ఉపఎన్నిక)	బాలినేని శ్రీనివాసరెడ్డి	వైసీపీ	దామచర్ల జనార్దన్	టీడీపీ	32,994
2009	బాలినేని శ్రీనివాసరెడ్డి	కాంగ్రెస్	ఈదర హరిబాబు	టీడీపీ	22,986
2004	బాలినేని శ్రీనివాసరెడ్డి	కాంగ్రెస్	శిద్దా రాఘవరావు	టీడీపీ	24,171
1999	బాలినేని శ్రీనివాసరెడ్డి	కాంగ్రెస్	యక్కల తులసీరావు	టీడీపీ	6,222
1994	ఈదర హరిబాబు	టీడీపీ	ఏ వెంకటేశ్వర్లు	కాంగ్రెస్ఐ	19,897
1989	బచ్చల బాలయ్య	కాంగ్రెస్ఐ	కే వెంకటరమణారావు	టీడీపీ	19,490
1985	పీ కోటేశ్వరరావు	టీడీపీ	పీఎంకే నాయుడు	కాంగ్రెస్ఐ	9,024
1983	పీ కోటేశ్వరరావు	టీడీపీ	టీఎస్ రెడ్డి	కాంగ్రెస్ఐ	29,848
1978	జీవరత్నంనాయుడు	కాంగ్రెస్ఐ	బీ వెంకటేశ్వరరెడ్డి	జనతా	5,080
1972	జీవరత్నంనాయుడు	కాంగ్రెస్	ఎస్. అంజయ్య	సీపీఐ	11,233
1967	చింతా రామచంద్రారెడ్డి	కాంగ్రెస్	బీవీ లక్ష్మీనారాయణ	ఇండి	8,012
1962	బీవీ లక్ష్మీనారాయణ	ఇండి	రొండా నారపరెడ్డి	కాంగ్రెస్	6,066
1957ఉపఎన్నిక)	బీవీ లక్ష్మీనారాయణ	ఇండి	జీ ఆదినారాయణ	కాంగ్రెస్	10,800
1955 (ద్వి)	టంగుటూరి ప్రకాశం	కాంగ్రెస్	ఎం నారాయణస్వామి	సీపీఐ	6,030
	టీ జియ్యర్‌దాస్	కాంగ్రెస్	కేఎం కొండయ్య	సీపీఐ	4,951
1952(ద్వి)	కే మాలకొండయ్య	సీపీఐ	కే కోటయ్య	కేఎల్‌పీ	27,088



ఒంగోలు(కలెక్టరేట్), ఏప్రిల్ 17 : ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో ఒంగోలు నగరంతోపాటు ఒంగోలు రూరల్, కొత్త పట్నం మండలాలు ఉన్నాయి. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఒంగోలు ఒక నియోజకవర్గంగా కొనసాగుతూనే ఉంది. 1952, 1955 సంవత్సరాల లో ద్విసభ్య నియోజకవర్గంగా కొనసాగగా, 1957నుంచి ఒక్క అభ్యర్థి మాత్రమే ఎన్నికవుతూ వస్తున్నారు. ఒంగోలు నియోజకవర్గానికి తూర్పున బంగాళాఖాతం, ఉత్తరం మద్దిపాడు మండలం, పశ్చిమాన సంతనూతలపాడు మండలం, దక్షిణం టంగుటూరు మండలాలు హద్దులుగా ఉన్నాయి. ఒంగోలుకు వంగలప్రోలు, వంగవోలు, వంగోలు అనే పేర్లు ఉన్నాయి. అద్దంకి రెడ్డిరాజుల కాలంలో వంగోలు అనే పేరు చరిత్రలో కనిపిస్తున్నది. నగరంలో

ఆంధ్ర రాష్ట్రానికి తొలి సీఎంను అందించిన ఒంగోలు
ఇక్కడ్నుంచి గెలిచి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం బాధ్యతల స్వీకరణ
1952లో అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు
నియోజకవర్గ ఓటర్లు 2,39,372
పోలింగ్ కేంద్రాలు : 231



తొలి మసీదు జామియా మసీదు, సకల దేవతల నిలయంగా సంతపేట వీరాంజనేయస్వామి ఆలయం ఉంది. కాలక్రమేణా ఒంగోలు అని పేరు వచ్చింది. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు 15 సార్లు ఎన్నికలు జరగ్గా 1957, 2012లో ఉపఎన్నికలు జరిగాయి.

టీడీపీ ఆవిర్భావంతో....

సినీరంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఎన్టీఆర్ పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1983లో జరిగిన ఎన్నికల్లో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పొనుగుపాటి కోటేశ్వరరావు ఘన విజయం సాధించారు. 1985లో జరిగిన పరిణామాల అనంతరం జరిగిన ఎన్నికల్లో కోటేశ్వరరావు రెండోసారీ గెలిచారు. 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఈదర హరిబాబు విజయం సాధించగా, 2014 ఎన్నికల్లో దామచర్ల జనార్దన్ గెలిచారు.

వైసీపీ ఆవిర్భావంతో....

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న సమయంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి బయటకొచ్చి వైసీపీని ఏర్పాటు చేశారు. ఆ సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా 17 మంది శాసనసభ్యులు ఆ పార్టీకి రాజీనామాలు చేశారు. 2012లో ఒంగోలు నియోజకవర్గానికి ఉప ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో బాలినేని శ్రీనివాసరెడ్డి వైసీపీ తరఫున ఘన విజయం సాధించారు. 2019 సాధారణ ఎన్నికల్లో మళ్లీ బాలినేని గెలిచారు.



ఒంగోలులో జనార్దన్ తరపున ప్రచారం చేస్తున్న ఆయన భార్య సత్యలత



దర్శిలో లక్ష్మి భర్త సమక్షంలో పార్టీలో చేరుతున్న వైసీపీ శ్రేణులు



సంతనూతలపాడు అభ్యర్థి విజయకుమార్ తమ్ముడు నాగులుప్పలపాడులో ప్రచారం



కనిగిరిలో ఉగ్ర తరపున ప్రచారం చేస్తున్న ఆయన కుమారుడు జయసింహారెడ్డి

అభ్యర్థులకు అండగా బంధుగణం

జిల్లాలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు కొండంత అండగా వారి కుటుంబ సభ్యులు నిలుస్తున్నారు. రాజకీయాలలో బంధువులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో కీలక నేతలకు అండగా పనులు చక్కబెడుతుంటారు. సాధారణ సమయంలో అవి పరిమితంగానో లేక ఇళ్ల వద్దనో పరిమితం అవుతుంటాయి. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలలో ఇంచుమించు అందరూ అభ్యర్థుల తరపున వారి కుటుంబసభ్యులు, బంధువులు అలాగే వారికి వెన్నంటి నిలిచి ప్రోత్సహించే ఆత్మీయులు అధికంగా భాగస్వామ్యులు అవుతున్నారు. కొందరు అభ్యర్థికి మద్దతుగా కార్యకర్తలు, ప్రత్యేకించి మహిళలతో ఆత్మీయ సమావేశాలు, ఇంటింటి ప్రచారానికి ప్రాధాన్యత ఇస్తుండగా మరికొందరు క్షేత్ర స్థాయి పరిస్థితులు అంచనా, వివిధ వర్గాల వారిని దగ్గరకు చేర్చడం, పార్టీలోని వివిధ స్థాయి నేతల మధ్య సమన్వయంతోపాటు పలు అంతర్గత అంశాలపై దృష్టి సారిస్తున్నారు.

టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్న కుటుంబ సభ్యుల ప్రచారం
ఆత్మీయ సమావేశాలు, ఇంటింటా క్యాంపెయిన్
ఆపై అంతర్గత వ్యవహారాల్లో తలమునకలు
సమన్వయంతో దూసుకెళ్తున్న వైనం

ఒంగోలు, ఏప్రిల్ 17(ఆంధ్రజ్యోతి): గతానికి భిన్నంగా ప్రతి ఇంటికీ, ప్రతి ఓటరును విధిగా పలకరించక తప్పని పరిస్థితి ప్రస్తుత ఎన్నికలలో కనిపిస్తోంది. దీంతో తక్కువ వ్యవధే ఉండటంతో పోటీ చేస్తున్న అభ్యర్థి అలా అందరిని పలుకరించే అవకాశం లేదు. దీంతో ఆ ప్రచార కార్యక్రమాల్లో అభ్యర్థుల జీవిత భాగస్వాములు, కుమారులు, కుమార్తెలు, తమ్ముళ్లు, తల్లిదండ్రులు పాల్గొంటుండటంతో వారు పర్యటించే ప్రాంతాల్లోనూ టీడీపీ శ్రేణులు ఉత్సాహంగా క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో జనసేన, బీజేపీ శ్రేణులు కూడా సంపూర్ణ మద్దతు పలికి వారితో నడుస్తున్నాయి. ఒంగోలు ఎంపీ, టీడీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డికి అండగా కుమారుడు రాఘవరెడ్డి విస్తృతంగా పర్యటిస్తుండగా కోడలు చందనలు ప్రచారంలో పాల్గొంటున్నారు. అలాగే పలువురు ఆయన సమీప బంధువులు వివిధ కీలక పనులు చక్కబెడుతున్నారు. వీరు పార్లమెంట్ పరిధిలో తలా ఒక ప్రాంతానికి వెళ్లి ఆయా నియోజకవర్గ అభ్యర్థితో కలిసి క్యాంపెయిన్‌లో పాల్గొంటున్నారు. ఇక ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్దన్ తరపున ఆయన సతీమణి నాగసత్యలతతో పాటు కుమార్తెలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రత్యేకించి మహిళా ఓటర్లు లక్ష్యంగా వారి కార్యక్రమం సాగుతుండగా జనార్దన్ తండ్రి కృష్ణారావు, సోదరుడు డాక్టర్ శివన్నారాయణలు పలు అంశాలలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. కొండపి అభ్యర్థి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి కుటుంబసభ్యులు ఉద్యోగులు కావడంతో ప్రత్యక్ష ప్రచారానికి దూరంగా ఉన్నా.. రాజకీయంగా ఆ కుటుంబానికి సంపూర్ణ అండదండలు ఇస్తున్న పార్టీ యువనేత దామచర్ల సత్య, సీనియర్ నేత దామచర్ల పూర్ణచంద్రరావులు అన్నీ తామై నడిపిస్తున్నారు. సంతనూతలపాడు అభ్యర్థి బీఎన్ విజయకుమార్ తరఫున ఆయన సోదరుడు అనిల్‌కుమార్ క్రియాశీలకంగా వ్యవహరిస్తూ నియోజకవర్గాన్ని చుట్టివస్తున్నారు. దర్శి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ తరఫున ఆమె భర్త డాక్టర్ కడియాల లలిత్ మొత్తం వ్యవహారాన్ని నడిపిస్తున్నారు. కనిగిరి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డికి మద్దతుగా ఆయన కుమారుడు జయసింహారెడ్డి విస్తృతంగా పర్యటిస్తూ యువతను ఆకర్షిస్తున్నాడు. గిద్దలూరు అభ్యర్థి అశోక్‌రెడ్డి తరఫున ఆయన సతీమణి పుష్పలీల, కుమారుడు కావ్యేష్, సోదరి గీతలు క్యాంపెయిన్‌లో విస్తృతంగా తిరుగుతుండగా సోదరుడు కిషోర్‌రెడ్డి పలు అంశాలలో కీలకంగా పనిచేస్తున్నారు. వైపాలెం అభ్యర్థి ఎరిక్షన్‌బాబుకు మద్దతుగా కుమార్తె డాక్టర్ బెల్సియా, కుమారుడు అజిత్‌లు విస్తృతంగా పర్యటిస్తున్నారు.



దర్శిలో మాగుంట తరపున ఆయన కుమారుడు రాఘవరెడ్డి ప్రచారం

మార్కాపురం టీడీపీ అభ్యర్థి కందుల నారాయణరెడ్డికి అండగా ఆయన సోదరుడు రామిరెడ్డి నిత్యం రాజకీయ వ్యవహారాలను చక్కబెడుతుంటారు. ఇప్పుడు అన్నితానై వస్తుండగా నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మి, కుమారుడు విఘ్నేష్‌రెడ్డిలు ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు.



మార్కాపురంలో కందులతరపున ఆయన సతీమణి ప్రచారం



దోర్నాల మండలంలో ఎరిక్షన్‌బాబు తరపున కుమార్తె,కొడుకు ప్రచారం



గిద్దలూరులో అశోక్‌రెడ్డి తరపున ప్రచారం చేస్తున్న ఆయన భార్య పుష్పలీల



కొండపిలో ఎమ్మెల్యే స్వామి, సత్యల సమక్షంలో టీడీపీలో చేరుతున్న యువత

దేగరమూడి గ్రామంలో నేత నిర్వాకం
యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘన.. పట్టించుకోని అధికారులు

ఇంటిపై వైసీపీ రంగుల బల్బులు



వైసీపీ నేత ఇంటికి వైసీపీ రంగులతో వెలుగుతున్న బల్బులు

మార్టూరు, ఏప్రిల్ 17 : ఎన్నికల కోడ్ ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతున్నా సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకు నిదర్శనమే మండలంలోని డేగరమూడి గ్రామంలో గత 10 రోజుల నుంచి వైసీపీ నేత తన ఇంటికి ఏకంగా వైసీపీ రంగుల విద్యుత్ బల్బులు ధగధగమంటున్నాయి. రాత్రి సమయంలో పరోక్షంగా పార్టీ ప్రచారానికి ఇది ఊతమిస్తోంది. అయినా అధికారులు పట్టించుకోలేదు. రాత్రి పూట కోడ్ ఉల్లంఘనకు రాదేమోనని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. ఇదిలా ఉండగా టీడీపీ వారు చేసే చిన్న చిన్న విషయాలను భూతద్దంలో చూపిస్తూ కోడ్ ఉల్లంఘించారంటూ అధికారులు పదేపదే వేధిస్తూ కేసులు నమోదు చేస్తున్నా.. వైసీపీ వారి జోలికి పోవడం లేదని పలువురు అంటున్నారు.

నామినేషన్‌లకు పటిష్ట భద్రత

నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలి
పోలీసు అధికారులకు గుంటూరు రేంజ్ ఐజీ త్రిపాఠి ఆదేశం





సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ త్రిపాఠి,హాజరైన పోలీస్ అధికారులు

ఒంగోలు (క్రైం), ఏప్రిల్ 17 : సార్వత్రిక ఎన్నికల నామినేషన్‌ల పర్వం గురువారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశించారు. స్థానిక డీపీవోలో ఆయన బుధవారం ఎస్పీ సుమిత్‌సునీల్‌తో కలిసి పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఐజీ మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 25వరకు నామినేషన్‌ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. అందుకు అనుగుణంగా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగి, ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండి మద్యం, నగదు, ప్రజలను ప్రలోభాలకు గురిచేసే వస్తువుల సరఫరాకు అడ్డుకట్టవేయాలన్నారు. ఎక్కడికక్కడ నిరంతర తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా రాజకీయ పార్టీల ముఖ్యనాయకుల పర్యటనలలో పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు స్టేషన్ పరిధిలో ముఖ్యమైన ప్రాంతాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈసందర్భంగా జిల్లాలోని పోలింగ్ స్టేషన్‌లు, చెక్‌పోస్టుల వివరాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్పీ వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు కె.నాగేశ్వరావు, ఎస్.వి.శ్రీధర్‌రావు, అశోక్‌బాబు, డీఎస్పీలు కిషోర్‌బాబు, రామరాజు, అశోక్‌వర్ధన్, సిహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజయ నవమి

తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం, అమలుచేయనున్న సూపర్‌సిక్స్ ప్రచార వాహనానికి తెలుగు మహిళలు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామనవమి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి, వాహనాన్ని ప్రారంభించగా, టీడీపీ మహిళలు, యువత, ప్రజల కోసం అమలు చేసే పథకాల గురించి వివరించేందుకు ఈ వాహనం ప్రజల్లోకి వెళ్లనుంది. పథకాల ప్రచారం రథం ఆలోచింపజేస్తోంది.

\- ఒంగోలు





రుధిరక్షేత్రం వద్ద నివాళులర్పిస్తున్న విమలక్క

ఏపీ ప్రత్యేక హోదాను అటకెక్కించారు

● చీరాలకు చేరుకున్న విమలక్క జన చైతన్య యాత్ర

చీరాలటౌన్, ఏప్రిల్ 17 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక హోదాను అటకెక్కించారని, ప్రస్తుతం రాష్ట్రంలో రాజధాని అనిశ్చితి కొనసాగుతోందని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు విమలక్క అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా తదితర సమస్యల పరిష్కారం కోరుతూ నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు చేపట్టిన చైతన్య బస్సు యాత్ర బుధవారం చీరాలకు చేరుకుంది. ఈసందర్భంగా విమలక్క తదితరులు స్థానిక విజయనగర్ కాలనీలోని కారంచేడు మృతవీరుల రుధిర క్షేత్రం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు గీతాలను ఆలపించారు. అనంతరం మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్ రావాల్సిన సమయంలో ఆంధ్రుల హక్కుగా ఉన్న స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఉరికంబం మీద వేలాడుతుందని ఆవేదన చెందారు. కృష్ణా నది జలాలు విషయంలో ఆగ్రహ జ్వాలలు పెకలి ప్రాంతాల మధ్య కృత్రిమ కుంపట్లు రగులుతున్నట్లు చెప్పారు. ఈక్రమంలో అసలైన ప్రజా జెండా ఎగురవేయాల్సిన సమయం ఆసన్నమైనట్లు వివరించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరీంబాషా, నాయకులు కృష్ణ, సామ్యేల్, గంగ, మల్సూర్ పాల్గొన్నారు.



మద్యం కేసులను పరిశీలిస్తున్న ఎస్పీ సుమిత్ సునీల్

ఎన్నికల్లో ప్రలోభాలకు పాల్పడితే సహించం

● మద్యం, డబ్బులు పంపిణీ చేస్తే కఠిన చర్యలు
● ఎస్పీ గరుడ సుమిత్ సునీల్

దర్శి , ఏప్రిల్ 17 : ఎన్నికల్లో ప్రలోభాలకు పాల్పడేవారిపై, మద్యం, డబ్బులు పంపిణీ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ గరుడ సుమిత్ సునీల్ హెచ్చరించారు. బుధవారం ముండ్లమూరు మండలంలో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకొని దర్శి ఎస్ఈబీ కార్యాలయానికి తరలించగా ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో నిబంధనలు అతిక్రమించే వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా మద్యం నిల్వ ఉంచిన నిందితుల వివరాలను ఏఎస్పీ కె.నాగేశ్వరరావు లిఖిత పూర్వక ప్రకటనలో వివరించారు. ముండ్లమూరు మండలంలోని రెడ్డినగర్, ముండ్లమూరు, తదితర గ్రామాల్లో 243 కేసుల మద్యాన్ని ఎస్ఈబీ అధికారులతో కలిసి పట్టుకున్నట్లు తెలిపారు. మద్యాన్ని నిల్వ ఉంచి, అక్రమ రవాణా చేస్తున్న నిందితుల వివరాలు వెల్లడించారు. నిర్వాహకుడు మేడం రమణారెడ్డి, డ్రైవర్ శ్రీరాం కొండయ్య, బి.కాశీంవలి, వై.శ్రీనివాసరావు, ఈ.పెదమాలకొండారెడ్డి, ఈ.పెద లక్ష్మిరెడ్డి, కె.చిన్నబాల, జి.జక్రయ్య, ఐ.దుర్గాప్రసాద్, పి.వెంకటేశ్వర్లు, జి.వెంకటరెడ్డి, కె.అంబేద్కర్, పి.శివారెడ్డి, షేక్ అంజిబాలును నిందితులుగా గుర్తించినట్లు వివరించారు. డీఎస్పీ అశోక్‌వర్ధన్ రెడ్డి, ఎస్ఈబీ సీఐ సుందరరామయ్య పాల్గొన్నారు.



అనమనమూరులో గొట్టిపాటికి దిష్టితీసి స్వాగతం పలుకుతున్న మహిళలు, నాయకులు

దళితులపై పెరిగిన దాడులు

● టీడీపీ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

మేదరమెట్ల, ఏప్రిల్ 17 : జగన్ పాలనలో దళితులపై దాడులు పెరిగాయని టీడీపీ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బుధవారం మండలంలోని అనమనమూరులో ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ దళితులకు శిరోముండనం చేయించిన తోట త్రిమూర్తులు లాంటి వ్యక్తులకు టికెట్ ఇచ్చిన జగన్‌ను దళితులు ఎలా నమ్ముతారన్నారు. 18నెలలు జైలు శిక్ష పడిన త్రిమూర్తులను వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలన్నారు. దళిత యువకుడు సుబ్రహ్మణ్యంను హతమార్చి డోర్ డెలివరీ చేసిన అనంతబాబు లాంటి వ్యక్తులను జగన్ కాపాడుతున్నారన్నారు. మాస్కులు అడిగిన డాక్టర్ సుధాకర్‌ను నడిరోడ్డుపై కాళ్లుచేతులు కట్టి హింసించిన ఘటనను దళితులు మరవరన్నారు. డాక్టర్ అచ్చన హత్య, కావలిలో కరుణాకర్ హత్యలు సర్కారువేనన్నారు. నాగమ్మ హత్యను ఖండించడానికి వెళ్లిన అనిత, ఎంఎస్ రాజుపై అట్రాసిటీ కేసులు పెట్టి వేధించారని గొట్టిపాటి గుర్తు చేశారు. అంబేద్కర్ రాజ్యాంగంపై జగన్‌కు అసలు గౌరవమే లేదన్నారు. మే 13న జరిగే ఎన్నికలల్లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా కృష్ణప్రసాద్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని గొట్టిపాటి విజ్ఞప్తి చేశారు. ఆయనవెంట అనమనమూరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన కొరిశపాడు ఎస్సీ కాలనీ వాసులు

టీడీపీలో చేరిన కొరిశపాడు ఎస్సీ కాలనీవాసులు

మేదరమెట్ల, ఏప్రిల్ 17 : మండలంలోని కొరిశపాడు ఎస్సీ కాలనీకి చెందిన 15 కుటుంబాలు కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. బుధవారం ముప్పవరంలోని పార్టీ కార్యాలయంలో కొరిశపాడు ఎస్సీ కాలనీ చెందిన గొల్లా వెంకటేశ్వర్లు, స్వర్ణ దాసు, దాసరి దావీదు, కె.కిరణ్ కుమార్, కె.సత్యం, వై.సురేష్, గొల్లా శివ, శ్రీను, పవన్ కల్యాణ్, తిప్పబత్తిన రవి, దార్ల వెంగళరాజులు వైసీపీని వీడి రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. గొట్టిపాటి వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

జాగర్లమూడివారిపాలెంలో వైసీపీని వీడిన ఎస్సీలు

పంగులూరు : మండలంలోని జాగర్లమూడివారిపాలెం గ్రామానికి చెందిన 10 ఎస్సీ కుటుంబాలు బుధవారం టీడీపీలో చేరారు. ఎస్సీకాలనీకి చెందిన తెలగతోటి వెంకటేశ్వర్లు, పంచాయతీ వార్డు సభ్యులు పూర్ణ, సురేష్, తెలగతోటి అబ్రహం, అదృష్టం, రామాంజనేయులు, కాంతారావు, శ్రీనివాసరావు, బత్తుల నాగేశ్వరరావు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరందరికీ ముప్పవరం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అల్లంనేని స్వామి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

వైసీపీ సేవలో ఎక్సైజ్

అధికారపార్టీకి అడిగినంత మద్యం

ఎన్నికల వేళ అధికార పార్టీ సేవలో ఎక్సైజ్ శాఖ తరిస్తోంది. వైసీపీ అభ్యర్థులకు అడిగినంత మద్యం సరఫరా చేస్తూ వారి ప్రాపకం కోసం పనిచేస్తోంది. ఏకంగా ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి కేసులకు కేసులు అక్రమంగా అధికార పార్టీ నేతల ఇళ్లకు చేరుస్తోంది. ఈసీ ఆదేశాల పేరుతో ఆ లెక్కలను కప్పిపుచ్చుకోవడానికి షాపులను మధ్యాహ్నానికే మూసివేస్తూ సాధారణ మందుబాబులకు చుక్కలు చూపెడుతోంది. అదేవిధంగా కొందరు దుకాణాల సిబ్బందిని ఆ సమీపంలోనే బాటిళ్లు ఉంచి బ్లాక్‌లో అమ్ముకుంటూ భారీగా సంపాదిస్తున్నారు. ఇందుకు బుధవారం ముండ్లమూరు మండలంలో పట్టుబడిన భారీ డంప్‌నే నిదర్శనం.

మద్యం డిపో నుంచే సరఫరా అంటూ ప్రచారం
బెల్టుషాపులకు సరఫరా చేస్తున్న సిబ్బంది
కోటా పేరుతో మధ్యాహ్నానికే దుకాణాల మూత
సాధారణ మందుబాబులకు చుక్కలు
ఇదే అదనుగా బ్లాక్‌లో భారీ ధరలకు అమ్మకాలు
ముండ్లమూరులో భారీ డంపు పట్టివేత
14మందిపై కేసు నమోదు.. అందులో సిబ్బంది కూడా



ముండ్లమూరు మండలంలోని వైసీపీ నేతల ఇళ్లలో దొరికిన మద్యం కేసులు

ఒంగోలు(క్రైం), ఏప్రిల్ 17 : ఎక్సైజ్ శాఖ అధికారపార్టీకి తొత్తులా వ్యవహరిస్తోంది. ఏకంగా ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి వైసీపీ అభ్యర్థులకు మద్యం సరఫరా జరగడమే ఇందుకు నిదర్శనం. అలాగే ముండ్లమూరు మండలంలో బుధవారం పట్టుబడిన డంప్ కూడా ఆ శాఖ డొల్లతనాన్ని, వైసీపీ పట్ల చూపుతున్న విపరీతమైన స్వామిభక్తిని తేటతెల్లం చేస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి గ్రామాలకు, అదీ అధికార పార్టీ నేతలు చెప్పిన వారి ఇళ్లకు మద్యాన్ని సరఫరా చేస్తూ పలువురు సిబ్బంది ఎస్ఈబీ అధికారులకు పట్టుబడ్డారు. అయినా కూడా వెనక్కితగ్గకుండా జిల్లావ్యాప్తంగా మద్యం సరఫరా జరుగుతూనే ఉంది. ఇంకా మరికొంతమంది బార్ల నుంచి ఎన్నికల కోసం అధికారపార్టీ అభ్యర్థులకు సరఫరా చేస్తున్నారు. నామినేషన్ల వేళ ముండ్లమూరు మండలంలో 243 పెట్టెల మద్యాన్ని వైసీపీ నేతలు తమ ఇళ్లలో నిల్వ ఉంచారు. అయితే ఆ మండలంలోని ప్రభుత్వ దుకాణాల నుంచి ఆ మద్యం సరఫరా జరిగింది. అదేసమయంలో మద్యం డిపోల నుంచి కూడా సరఫరా జరిగిందా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మద్యం దుకాణాలలో ఒక్క బాటిల్ మద్యం బయటకు ఇవ్వాలన్నా స్కాన్ చేయాల్సిందే. అలాంటిది ప్రభుత్వ దుకాణాలు మూడింటి నుంచి నేరుగా 243 పెట్టెలు మద్యం బాటిళ్లు తరలించడాన్ని పరిశీలిస్తే అనేక అనుమానాలు వస్తున్నాయి. ఇదే తరహాలో జిల్లాలో అనేకచోట్ల జరిగి ఉండవచ్చని ప్రచారం మొదలైంది.

బాధ్యత అంతా ఆ శాఖదే

మద్యం దుకాణాల నిర్వహణ బాధ్యత ఎక్సైజ్ శాఖది. ప్రతి దుకాణాన్ని నిత్యం తనిఖీ చేసి నిల్వలను పరిశీలించేందుకు ఎక్సైజ్ కానిస్టేబుల్ నుంచి ఎస్సై వరకు విధులు నిర్వర్తిస్తుంటారు. ఇలాంటి పరిస్థితులలో ముండ్లమూరు మండలంలో మూడు దుకాణాల నుంచి 243 పెట్టెలు సుమారుగా రూ.20 లక్షల పైచిలుకు విలువ గల మద్యం అక్రమంగా తరలించడం పట్ల సర్వత్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. మద్యం రేషన్ అంటూ చెబుతున్న అధికారులు ఇలా నిత్యం ప్రభుత్వ దుకాణాల నుంచి కేసులకు కేస్‌లు తరలించడంపై ఎన్నికల కమిషన్ దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని మందుబాబులు కోరుతున్నారు.

బెల్టుషాపులకు తరలిస్తున్న సిబ్బంది

మద్యం దుకాణాలలో పనిచేసే సిబ్బంది బాగా చేతివాటం చూపుతున్నారు. దుకాణాలలో పనిచేస్తున్న సిబ్బంది వైసీపీ నాయకుల సిఫార్సులతోనే ఉద్యోగాలలో చేరడంతో అంతా వారి ఇష్టారాజ్యంగా మారింది. దుకాణాల నుంచి నేరుగా మద్యాన్ని బెల్టుషాపులకు తరలిస్తు అనేక ప్రాంతాల్లో పట్టుబడ్డారు. వారిని ప్రలోభాలకు గురిచేసి అధికారపార్టీ నేతలు పెద్దమొత్తంలో మద్యాన్ని బయటకు తరలిస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి అక్రమంగా మద్యం తరలిచుకపోతుంటే ఎక్సైజ్ శాఖ చోద్యం చూస్తూ కూర్చోవడం ఏమిటి అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అదేవిధంగా ఎన్నికల దృష్ట్యా బార్ల నుంచి కూడా మద్యం బయటకు తరలించి నిల్వలు ఉంచారనే వాదనలు ఉన్నా, ఆవైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. బార్లలో ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు విక్రయాలు చేస్తున్నారు. అస్సలు అధికారులు పట్టించుకోవడం లేదు.

అక్రమ నిల్వలపై చర్యలు తప్పవు: ఎస్పీ

మద్యం అక్రమ నిల్వలు ఉంచడంపై ఎస్పీ జి.సుమిత్ సునీల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముండ్లమూరులో అక్రమంగా నిల్వ ఉంచిన 243 పెట్టెల మద్యాన్ని స్వాధీనం చేసుకొని 14మందిపై కేసు నమోదు చేశామని తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం విలువ రూ.20,63,203 అని తెలిపారు. ఇలా అక్రమ నిల్వలపై 100,112లకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కీలక ఘట్టానికి సిద్ధం

» నేటి నుంచి నామినేషన్లు » 25 వరకూ స్వీకరణ.. 26న పరిశీలన » 29 వరకు ఉపసంహరణకు గడువు


» రిటర్నింగ్ అధికారుల వద్ద దాఖలుకు ఏర్పాట్లు
» ఒక పార్లమెంట్, ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు
» 2,183 పోలింగ్ కేంద్రాలు, 18,14,371 మంది ఓటర్లు
» తాజాగా మరో 8,320 మంది దరఖాస్తు

ఒంగోలు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల నిర్వహణలో కీలక ఘట్టం గురువారం నుంచి ప్రారంభం కానుంది. అత్యంత ప్రధానమైన అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రక్రియ మొదలవుతుంది. తొలుత ఆయా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు తమ కార్యాలయాల్లో ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణను చేపడతారు. ఈనెల 25 వరకు దాఖలు చేయవచ్చు. సెలవు దినాలు కాకుండా గురువారం నుంచి 25వతేదీ మధ్య ప్రభుత్వ పనిదినాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ఆ మేరకు ఎన్నికల కమిషన్ స్పష్టత ఇవ్వగా సంబంధిత రిటర్నింగ్ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. నియోజకవర్గ కేంద్ర తహసీల్దార్ కార్యాలయాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయా లుగా ఏర్పాటుచేశారు. అభ్యర్థులు అక్కడే నామినేషన్లు దాఖలు చేయవచ్చు. ఇప్పటికే అందుకు సంబంధించి అధికారిక ఏర్పాట్లను పూర్తిచేశారు.

నియోజకవర్గం	నామినేషన్ల కేంద్రం	రిటర్నింగ్ అధికారి	ఫోన్ నెంబర్
ఒంగోలు పార్లమెంట్	ఒంగోలు కలెక్టరేట్	దినేష్‌కుమార్	8886616001
ఒంగోలు అసెంబ్లీ	ఆర్డీవో ఆఫీసు	జివి సుబ్బారెడ్డి	9281034411
యర్రగొండపాలెం	స్వశక్తి భవన్	డాక్టర్ శ్రీలేఖ	9281034427
దర్శి	తహసీల్దార్ ఆఫీసు	లోకేశ్వరరావు	9281034435
సంతనూతలపాడు	చీమకుర్తి మున్సిపల్ భవనం	ఆర్.గోపాలకృష్ణ	8886616002
కొండపి	తహసీల్దార్ ఆఫీసు	ఎ.కుమార్	9281034432
మార్కాపురం	ఆర్డీవో ఆఫీసు	రాహుల్‌మీనా	9281034413
గిద్దలూరు	తహసీల్దార్ ఆఫీసు	డి.నాగజ్యోతి	9281034426
కనిగిరి	ఆర్డీవో ఆఫీసు	పి.జాన్‌ఇర్విన్	9281034412

ఆర్వో కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు

పోటీచేసే అభ్యర్థులు లేదా వారి తరపు ప్రతినిధు లకు అవసరమైన సమాచారం, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు మంగళవారం నుంచి ఆర్వో కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు కూడా ఏర్పాటు చేశారు.



జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో మార్చి 29 నాటికి మొత్తం 18,14,371 మంది ఓటర్లు ఉండగా వారిలో 9,10,370 మంది మహిళలు ఉండగా 9,03,894 మంది పురుషులు ఉన్నారు. అలాగే 107 మంది థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు. కాగా ఈనెల 15 వరకు ఓటరు నమోదుకు అవకాశం ఇవ్వడంతో మరో 8,320 దరఖాస్తులు అధికారులకు అందాయి. వాటిని పరిశీలిస్తున్నారు. అర్హులైన వారికి తుది జాబితాలో ఓటు హక్కు కల్పించనున్నారు. ఆ ప్రకారం జిల్లాలో మరికొంతమేర ఓటర్లు పెరిగే అవకాశం ఉంది. కాగా జిల్లాలోని ఎనిమిది సెగ్మెంట్లలో 2,183 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఎన్నికల ప్రక్రియలో దాదాపు 25వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు భాగస్వామ్యులు అవుతున్నారు. వచ్చేనెల 13న పోలింగ్ జరుగుతుంది. జూన్ 4 లెక్కింపు ఉంటుంది.

ముహూర్తాలు ఖరారు

నామినేషన్‌ల వైపు టీడీపీ అభ్యర్థుల దృష్టి
నేడు మాగుంట, రేపు స్వామి, బీఎన్, ఎరిక్షన్, అశోక్‌రెడ్డి, లక్ష్మి
24న దామచర్ల, ఉగ్ర.. 25న కందుల
దాఖలుకు సన్నాహాలు
కొందరు తొలుత సాధారణంగా వేసి తర్వాత ర్యాలీలకు ఏర్పాట్లు

ఒంగోలు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రచారంలో ప్రత్యర్థుల కన్నా మిన్నగా దూసుకుపోతున్న టీడీపీ కూటమి అభ్యర్థులు గురువారం నుంచి ప్రారంభమవుతున్న నామినేషన్‌ల ప్రక్రియ వైపు దృష్టి సారించారు. ఈనెల 18నుంచి 25 వరకు పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థుల నామినేషన్‌ల స్వీకరణ జరగనుంది. దీంతో జిల్లాలోని ఒంగోలు పార్లమెంట్, 8 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి టీడీపీ తరఫున బరిలోకి దిగుతున్న అభ్యర్థులు మంచి రోజు చూసుకుని ముహూర్తం నిర్ణయించుకున్నారు. కొందరు అభ్యర్థులు కొద్దిమంది కార్యకర్తలతో వెళ్లి ఈసీ నిబంధనలకు అనుగుణంగా ఐదుగురితో ఆర్వో వద్ద నామినేషన్లు దాఖలుకు ఏర్పాట్లు చేసుకుంటుండగా, మరికొందరు ఒకేసారి భారీ ర్యాలీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అలాగే తొలుత సాదాసీదాగా నామినేషన్ వేసి, ఆ తర్వాత మరోరోజు భారీ ప్రదర్శన నిర్వహించే ఏర్పాట్లలో మరికొందరు ఉన్నారు. అలా ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు జిల్లాలోని ఆయా నియోజకవ ర్గాలలో టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు వేసే అవకాశం ఉంది. పార్టీవర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న సిటింగ్ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రక్రియ ప్రారంభ రోజైన గురువారం సాదాసీదాగా నామినేషన్ వేయనున్నారు. బుధవారం తిరుమలలో దైవదర్శనం చేసుకున్న ఆయన రాత్రికి నెల్లూరులో బస చేశారు. గురువారం ఉదయం అక్కడి నుంచి బయల్దేరి వచ్చి వల్లూరమ్మ గుడిలో పూజలు చేస్తారు. అనంతరం 11 గంటలకు పార్లమెంట్ రిటర్నింగ్ అధికారైన కలెక్టర్ దినేష్ కుమార్ చాంబర్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. రెండోరోజైన 19వ తేదీన కొండపి నియోజకవర్గ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఎర్రగొండపాలెం అభ్యర్థి గుడూరి ఎరిక్షన్‌బాబులు భారీ ర్యాలీలు నిర్వహించి నామినేషన్లు వేయనున్నారు. సంతనూతలపాడు అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్, గిద్దలూరు అభ్యర్థి ఎం.అశోక్‌రెడ్డి, దర్శి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మిలు కూడా 19వతేదీన సాదాసీదాగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. అనంతరం మరోరోజు భారీ ర్యాలీలను నిర్వహించాలన్న యోచనలో వారు ఉన్నారు.

ఇక ఒంగోలు అభ్యర్థి దామచర్ల జనార్దన్, కనిగిరి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఈనెల 24న నామినేషన్లు వేయనున్నారు. దామచర్ల ఈసారి ర్యాలీ, ఆర్బాటం లేకుండా సాదాసీదాగానే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉగ్ర నరసింహారెడ్డి నామినేషన్ దాఖలు రోజు భారీ ర్యాలీ ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం, ఇక చివరిరోజైన 25వతేదీన మార్కాపురం అభ్యర్థి కందుల నారాయణరెడ్డి నామినేషన్ వేయనున్నారు. ఆ సందర్భంగా భారీ ర్యాలీకి ఆయన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

పార్టీలోకి వచ్చిన వారికి సముచిత స్థానం

కొండపి ఎమ్మెల్యే స్వామి, టీడీపీ ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి సత్య

పర్చూరివారిపాలెంలో 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరిక



ఎమ్మెల్యే స్వామి, సత్యల సమక్షంలో పార్టీలో చేరుతున్న వైసీపీ కార్యకర్తలు

పొన్నలూరు (కొండపి), ఏప్రిల్ 17: వైసీపీని వీడి టీడీపీలోకి వస్తున్న వారికి సముచిత స్థానం కల్పిస్తామని కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని పర్చూరివారిపాలెం గ్రామంలో 20 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఈసందర్భంగా జరిగిన సభలో స్వామి మాట్లాడుతూ కొండపి నియోజవర్గంలోని మారుమూల గ్రామాలను సైతం టీడీపీ హయాంలో అభివృద్ధి పరిచామన్నారు. అంతేకాకుండా గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు టీడీపీ హయాంలోనే జరిగాయన్నారు. పార్టీలో చేరిన వారికి అండగా ఉంటామన్నారు. దామచర్ల సత్య మాట్లాడుతూ వైసీపీ పాలనలో పేద ఎస్సీ, బీసీలపై దాడులు, అఘాయిత్యాలు పెరిగిపోయాయని విమర్శించారు. అనేక గ్రామాల నుంచి వైసీపీ పాలనలో రాష్ట్రం వెనుకబడిపోతున్నదని గ్రహించి టీడీపీలోకి భారీగా వలసలు కొనసాగుతుండటం శుభ పరిణామమన్నారు. కార్యక్రమంలో జనసేన కొండపి నియోజవకర్గ సమన్వయకర్త, టీడీపీ నాయకులు కోటిరెడ్డి, మండవ ప్రసాద్ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీని వీడిన కుటుంబాలు

గ్రామానికి చెందిన పతకమూరి శ్రీనివాసులు, తింటకుర్తి సురేష్, అరటి వేములు, కొలకని బ్రహ్మయ్య, పొతకమూరి అంకయ్య, నేలపాటి రూబేను, నేలపాటి దేవయ్య, దొడ్డియేసురత్నం, నేలపాటి ఏసు, నేలపాటి బోడయ్య కప్పల సయేలుతోపాటు మరో 20కుటుంబాలు, అగ్రహారానికి చెందిన షేక్ మహమ్మద్ బాషా, సురేష్‌కుమార్ కూడా పార్టీలో చేరారు.

నేటి నుంచి ప్రసన్న చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

ఒంగోలు(కల్చరల్), ఏప్రిల్ 17:స్థానిక కేశవస్వామిపేట శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం అవుతున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.రజనీకుమారి తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రతిరోజు స్వామి వారికి విశేష సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. గురువారం ఉదయం అంకురార్పణతో కార్యక్రమాలు ప్రారంభమై ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు.

ప్రతి రోజు రాత్రి 7 గంటల నుంచి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆమె తెలిపారు. గురువారం రాత్రి తులసి మెలొడీస్ వారిచే సంగీత కచేరి, శుక్రవారం ఉదయం శేషవాహనంపై నగరోత్సవం, రాత్రికి చందు డాన్స్ అకాడమి చిన్నారులచే నృత్య ప్రదర్శన ఉంటాయి. ఇక శనివారం ఉదయం సింహవాహన సేవ, రాత్రికి మాగంటి మూర్తి బృందంచే భక్తి సంగీత విభావరి ఉంటుందన్నారు. భక్తులు కార్యక్రమాలలో పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈవో రజనీకుమారి కోరారు.


కల్యాణ అలంకరణలో సీతారాములు

వైభవంగా శ్రీరామ నవమి

» మార్మోగిన రామ నామం
» మందిరాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు
» భారీ ఎత్తున అన్నదానం

చీరాలటౌన్, ఏప్రిల్ 17 : చీరాల పట్టణ, గ్రామీణంలో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. అన్ని రామాలయాలు రామ నామంతో మార్మోగాయి. ఈపూరుపాలెం పద్మనాభునిపేట రామాలయంలో మేళ తాళాలతో నగరోత్సవం, అనంతరం శ్రీసీతారామ కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. పలుచోట్ల రామాంజనేయ యుద్ధం, గయోపాఖ్యానం, సత్య హరిచ్చంద్ర కాటి సీను నాటక ప్రదర్శనలు, కోలాట ప్రదర్శనలు జరిగాయి. చివరిగా స్వామి వారి ఏకాంతసేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఇంకొల్లు : శ్రీరామనమి సందర్భంగా మండలంలో సీతారాముల కల్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. హరిహర ధార్మిక సేవా సమితి ఆధ్వర్యంలో చెన్నకేశవ దేవాలయంలో రాములోరి కల్యాణాన్ని నిర్వహించగా భక్తులు చూసి తరించారు. వేలాది మందికి అన్నసంతర్పణ నిర్వహించారు. చెన్నకేశవ దేవాలయంలో రూ.లక్షతో తాటాకు పందిళ్లను ఏర్పాటు చేయగా, అర్ధరాత్రి 3 గంటలకు ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగి పందిరి దగ్ధమైంది. అన్ని రామమందిరాల్లో పూజలు నిర్వహించారు.

పర్చూరు : శ్రీరామ నవమిని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉప్పుటూరులోని శ్రీ కోనేటి ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీ సీతారాముల వారి కల్యాణోత్సవం నిర్వహించారు. వెంటక పిచ్చయ్య శాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితులతో సీతారాముల కల్యాణం జరిపించారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్వామిఅమ్మవార్లను దర్శించుకొని పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని పంటలు బాగా పండాలని ఈసందర్భంగా ఏలూరి కోరారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ నిర్వహకులు కాల్వ సత్యనారాయణ, గ్రామస్థుల సారథ్యంలో ఏర్పాట్లు చేశారు.

అలరించిన కూచిపూడి నృత్యం

ఆలయ ప్రాంగణంలో నృత్య శ్రీ నాట్య అకాడమీ వారి సారథ్యంలో ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. చిన్నారుల నృత్య ప్రదర్శన కార్యక్రమంలో ఏలూరి పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.

మార్టూరు : శ్రీరామ నవమిని శ్రీరామ మందిరాల్లో కనులపండువగా నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని భక్తులు తిలకించి తరించారు. తూర్పు, పడమర బజారు, యానాది కాలనీ, నేతాజీనగర్‌లో రాములోరికి పూజలు నిర్వహించారు. రాజుగారిపాలెంలో 20 జంటలు కూర్చొని కల్యాణాన్ని జరిపించారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు. తాటివారిపాలెం, డేగరమూడి, కోలలపూడి, నాగరాజుపల్లిలో శ్రీరామ నవమి పూజలు నిర్వహించారు. యద్దనపూడి మండలంలోని గ్రామాలలో కోదండ రాముని మందిరాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. 35 జంటలు కల్యాణం నిమిత్తం కలశాలతో అర్చనలు నిర్వహించారు. యనమదల, అనంతవరం, పూనూరు తదితర గ్రామాలలో వడపప్పు, పానకం పంపిణీ చేశారు.


కూచిపూడి నృత్య కళాకారులతో ఎమ్మెల్యే ఏలూరి

కారంచేడు : శ్రీ రామనవమి వేడుకలను కారంచేడు మండలంలో వైభవంగా నిర్వహించారు. స్వామివార్ల విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. సీతారాముల కల్యాణం అనంతరం భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. కారంచేడు, స్వర్ణ, కుంకలమర్రు గ్రామాల్లో సాస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కారంచేడులో శ్రీరామనవమి రోజున హస్యనృత్యం ఏర్పాటు సంప్రదాయానికి ప్రతీక.

అద్దంకిటౌన్ : శ్రీరామనవమి వేడుకను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శింగరకొండలోని సీతారామాలయం వద్ద జరిగిన వేడుకలలో డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు దంపతులు రాములోరి కల్యాణాన్ని జరిపించారు. గాజులపాలెం, బలిజపాలెం, గానుగపాలెం కాలనీలలోని ఆలయాల వద్ద, రామాటాకిస్ పక్క బజార్‌లో నవమి వేడుకలు జరిగాయి.

బల్లికురవ : మండలంలోన అన్ని గ్రామాలలో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. రాములోరి మందిరాల్లో సీతారామల కల్యాణాన్ని తిలకించారు. గుంటుపల్లి, కొత్తపాలెం గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పంగులూరు : సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మండలంలోని పంగులూరు దళితవాడలోని రామ మందిరంలో నవమి వేడుకను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పంగులూరు, కశ్యాపురం. జాగర్లమూడివారిపాలెం, తక్కెళ్లపాడు, భగవాన్‌రాజుపాలెం, చందలూరులో వేడుకలు జరిగాయి.

చినగంజాం : సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భావనారాయణస్వామి, వాసవీ మాత ఆలయం, పెదగంజాం, రామచంద్రానగర్, రాజుబంగారుపాలెం, సంతరావూరు, మోటుపల్లి, మూలగానివారిపాలెం, గొనసపూడి, చింతగుంపల్లి, సోపిరాల, పల్లెపాలెం తదితర గ్రామాల్లో శ్రీరామ నవమిని వైభవంగా నిర్వహించారు. కడవకుదురులో సీతాలక్ష్మణ హనుమత్ సమేత శ్రీకోదండరామస్వామి కల్యాణ ఘట్టాన్ని భక్తులు చూసి తరించారు.


పంగులూరులో కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు

మేదరమెట్ల : మండలంలోని రామాలయాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి సీతారామ కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. దైవాలరావూరులోని చెన్నకేశవస్వామి ఆలయంలో రాములవారి కల్యాణం నిర్వహించారు. గ్రామస్థులు రాయిపాటి శ్రీనివాసరావు, త్రివేణి దంపతులు, ముమ్మన సుబ్బారావు దంపతులతో పాటు పదిమంది దంపతులు పాల్గొన్నారు. తూర్పుపాలెం రామాలయంలో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. రావినూతల, పమిడిపాడు, బొడ్డువానిపాలెం తదితర గ్రామాల్లో నవమి వేడుకను పండువగా నిర్వహించారు. అన్ని చోట్లా కల్యాణం అనంతరం సీతారాముల విగ్రహాలతో రాత్రికి గ్రామోత్సవాలు నిర్వహించారు.


పూజల్లో పాల్గొన్న డీఎస్పీ దంపతులు

టీడీపీతోనే బీసీలకు ప్రత్యేక గుర్తింపు

జయహో బీసీలో కూటమి అభ్యర్థి గొట్టిపాటి

పంగులూరు, ఏప్రిల్ 17 : స్వర్గీయ ఎన్టీఆర్ నాలుగు దశాబ్దాల క్రితం తెలుగుదేశం పార్టీని స్థాపించి బీసీలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారని టీడీపీ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో పార్టీ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం రాత్రి జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపట్ల పార్లమెంటరీ పార్టీ న్యాయ విభాగ అధ్యక్షుడు బత్తుల రామకోటయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గొట్టిపాటి మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచే బడుగుబలహీనవర్గాల ప్రజలు అండగా ఉండగా, వారి అభ్యున్నతికి పార్టీ పాటుపడుతున్నదన్నారు. మళ్లీ చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వ పాలనలో బలహీనవర్గాలకు రక్షణతోపాటు సంక్షేమం ఉంటుందన్నారు. వైసీపీ పాలనలో బీసీలపై దాడులు పెరిగిన విషయం అందరికీ తెలుసునన్నారు. పార్టీ మారలేదన్న కారణంతోపాటు జగన్‌రెడ్డి పాలన వైఫల్యాలను ఎత్తిచూపిన 75 మంది బీసీ నేతలను హతమార్చారని గొట్టిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి పార్టీలకు మద్దతు ఇవ్వండి.. మీకు అండగా కూటమి ఉంటుందన్నారు. జగన్‌రెడ్డి బీసీలకు కార్పొరేషన్, ఛైర్మన్ పదవులిచ్చి కుర్చీలకే పరిమితం చేశారని గొట్టిపాటి అన్నారు. కార్యక్రమంలో కూటమి ఎంపీ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్, అద్దంకి, సంతమాగులూరు మాజీ ఎంపీపీలు మన్నం ఏడుకొండలు, సన్నెబోయిన ఏడుకొండలు, బీసీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీకి మద్దతు తెలిపిన వైదన వైసీపీ నేతలు

బల్లికురవ : మండలంలోని వైదన గ్రామానికి కొందరు వైసీపీ నేతలు బుధవారం ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను అయన స్వగృహంలో కలిసి మద్దతు తెలిపారు. వైదన గ్రామంలో వైసీపీలో ఉన్న గాలం శ్రీను, గాలం నిమ్మయ్య కుంచపు శ్రీను, తోట సురేష్, ఆలకుంట శేషయ్య, షేక్ పెద భూడే, పంచాయతీ వార్డు మెంబరు నాగిపోగు చినబాబులు తమ అనచరులతో కలిసి రవికుమార్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పోగుల చంద్రశేఖర్, చినమేడ ప్రసాద్, షేక్ చినభూడే, మెరబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


గొట్టిపాటి సమక్షంలో టీడీపీలో చేరిన వైదన వైసీపీ నేతలు


వేదికపై అభివాదం చేస్తున్న కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కృష్ణప్రసాద్, గొట్టిపాటి, బీసీ నేతలు

సైకిల్ గుర్తుపై ఓటేసి గొట్టిపాటిని గెలిపించండి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 17: ఎన్నికలల్లో సైకిల్ గుర్తుపై ఓటేసి టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ గెలిపించాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు సందిరెడ్డి శ్రీనివాసరావు కోరారు. బుధవారం పట్టణంలోని రెండవ వార్డులో సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటికీ తిరిగి పంచిపెట్టారు. గొట్టిపాటి నామినేషన్‌కు తరలివచ్చి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో 2వ వార్డు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువులకు చేరని సాగర్ జలాలు

» అరకొర విడుదలతో నిండేదెట్లా » గ్రామస్థుల ఆందోళన


పమిడిపాడు మేజర్‌లో అరకొరగా పారుతున్న సాగర్ జలాలు

పంగులూరు, ఏప్రిల్ 17 : చెరువులకు సాగర్ జలాలు చేరే పరిస్థితి కనిపించడం లేదు. కొద్ది రోజులుగా తాగు నీటి అవసరాల కోసం విడుదలైన సాగర జలాలు పమిడిపాడు మేజర్‌కు బుధవారం అరకొరగా విడుదలయ్యాయి. రామకూరు మేజర్ వద్ద 90 క్యూసెక్కుల నీటిని పమిడిపాడు మేజర్ పరిధిలోని చెరువులు నింపేందుకు విడుదల చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య తెలిపారు. మండలంలో 10 నోటిఫైడ్, పది నాన్ నోటిఫైడ్ చెరువులను నింపాల్సి ఉండగా, ఒక్క రామకూరు చెరువుకు 50 శాతం నీరు చేరినట్లు ఏఈ తెలిపారు. నీటి కొరత ఎక్కువగా ఉండే నూజెళ్లపల్లి, ఆరికట్లవారిపాలెం చెరువులకు నేటికీ నీరు చేరలేదు. తాగు నీటి కోసం విడుదలైన సాగర్ జలాలు తక్కువగా విడుదలైతే చెరువులకు నీరు చేర్చడం ఎలా అని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం పమిడిపాడు మేజర్‌కు విడుదలైన నీటిని మండలంలోని జనకవరం, కొండమంజులూరు మళ్లిస్తున్నట్లు ఏఈ తెలిపారు. చెరువులను నింపకపోతే నీటి కష్టాలు తప్పవని పలు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

రాములమ్మ నూరేళ్ల వసంతం


కుటుంబ సభ్యులతో రాములమ్మ

పంగులూరు, ఏప్రిల్ 17 : మంబలంలోని భగవాన్‌రాజుపాలెం గ్రా మంలో రాములమ్మకు వందేళ్లు నిం డాయి. ఈ సందర్భంగా కుటుం బ సభ్యులు రాములమ్మ నూరేళ్ల వసం త వేడుకను నిర్వహించారు. నార్నె రాములమ్మ ఐదు తరాల కుటుంబ సభ్యులతో బుధవారం జరిగిన వేడుకలో బంధు మిత్రులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ ఎత్తేస్తారని వైసీపీ ఫేక్ ప్రచారం

నమ్మొద్దని ముస్లింలకు హర్షవర్ధన్ విజ్ఞప్తి

సంతమాగులూరు, ఏప్రిల్ 17 : నాలుగు శాతం రిజర్వేషన్ ఎత్తేస్తారనే వైసీపీ నాయకులు చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని ముస్లింలు నమ్మొద్దని టీడీపీ యువ నేత గొట్టిపాటి హర్షవర్ధన్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని కొమ్మాలపాడు గ్రామంలో కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా తనయుడు హర్షవర్ధన్ ప్రచారం చేశారు. కూటమి ప్రభుత్వం వస్తేనే రాష్ట్రం బాగుపడు తుందని చెప్పారు. ఒక్క చాన్స్ వచ్చిన జగన్‌రెడ్డి, వైసీపీ నేతలు ఐదేళ్లలో రాష్ట్రాన్ని దోచుకున్నారని, రెండో చాన్స్ ఇస్తే ప్రజా ఆస్తులను కొల్లగొడతారని అన్నారు. ఐదేళ్లలో ఏ వర్గం ప్రజలు సంతోషంగా గడిపిన రోజు లేదన్నారు. ప్రతి చోటా దౌర్జన్యాలు, దాడులు, అక్రమ అరెస్టులతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారని తెలిపారు. ప్రజాస్వామ్య పద్ధతిలో, ధర్మబద్ధంగా పాలన సాగించే చంద్రబాబు కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకొని అరాచక వైసీపీ పాల కులకు ఓటుతో దెబ్బకొట్టాలని హర్షవర్ధన్ పిలుపునిచ్చారు. ప్రజలంతా టీడీపీ కూటమిని గెలిపించేందుకు సిద్ధమయ్యారని, ఇక ఓటమి తప్పదని గ్రహించిన జగన్‌రెడ్డి కుల చిచ్చు కుట్రకు తెరలేపారన్నారు. అన్ని కులాలవారు, అన్ని వర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండి జగన్ మాయను తిప్పికొట్టాలన్నారు. బీజేపీతో పొత్తు వల్ల ముస్లిం, క్రిస్టియన్లకు ఎలాంటి కష్టం రాకుండా చంద్రబాబు చూస్తారని, ఆ ధైర్యంతో కూటమికి మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గాడిపర్తి వెంకట్రావు, దూపాటి ఏసోబు, తేలప్రోలు రమేష్, చేవూరి వాసిరెడ్డి, సన్నెబోయిన ఏడుకొండలు, చింతా రామారావు, శ్రీరామమూర్తి, కోటేశ్వరరావు, గురుయాదవ్, సుజాత, చల్లా కృష్ణ, రామాంజి, మురళి, అంకమ్మరావు, మోతాదు బాషా, బాజీ మసూద్ హఫీస్ లాల్‌బుడే, మీరన, హుక్కు, దర్యావలి, పెద్ద మీరసా, మస్తాన్‌వలి, గొట్టిపాటి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


పథకాలపై అవగాహన కల్పిస్తున్న హర్షవర్ధన్

ఇంకొల్లులో టీడీపీలోకి పెరిగిన వలసలు


టీడీపీలో చేరిన ఇంకొల్లు కృష్ణనగర్‌వాసులు ... ఎమ్మెల్యే ఏలూరికి మద్దతు తెలిపిన కారంచేడు యువత

» సైకిలెక్కిన వైసీపీకి చెందిన ప్రముఖ నేతలు
» ఆహ్వానించిన ఎమ్మెల్యే ఏలూరి

ఇంకొల్లు, ఏప్రిల్ 17 : ఇంకొల్లు మండలంలో టీడీపీలోకి వలసలు పెరిగాయి. ఇప్పటివరకు వైసీపీలో ఉన్న ప్రముఖ నేతలు ఆ పార్టీని వీడి పసుపు కండువాను కప్పుకున్నారు. పార్టీ మండలాధ్యక్షుడు నాయుడు హనుమంతరా వు, మరికొందరు నేతలు మండలంలోని ఇడుపులపాడులో 40 మంది బీసీలు సైకిల్ ఎక్కారు. పూసపాడు గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చారు. ఇంకొల్లు వైసీపీ ఎంపీటీసీ సభ్యుడు ఆయోషాబు దేతోసహా 15 కుటుంబాలు మంగళవారం చేరగా, కృష్ణనగర్‌కు చెందిన కొం తమంది వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే ఏలూరి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కృష్ణనగర్‌కు చెందిన 17 కుటుంబాలు నిడగంటి నాగేశ్వరరావు, పసుపులేటి బాలకృష్ణ, పసుపులేటి ప్రసాద్, పసుపులేటి మాధవరావు, పసుపులేటి మల్లేశ్వరరావు, నీడగంటి వెంకటనారాయణ, దత్తాత్రేయ, రవీంద్రబాబు బుధవారం చేరగా ఏలూరి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

ఏలూరి వెంట కారంచేడు యువత

పర్చూరు : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయానికి మేము సైతం అటూ యువత ముందుకు సాగుతోంది. ఎమ్మెల్యే చేపడుతున్న ఎన్నికల ప్రచారంలో పెద్దఎత్తున తరలి వచ్చి ఏలూరికి మద్దతుగా నిలుస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఏలూరి మండలంలోని ఉప్పుటూరు గ్రామంలో పర్యటిస్తున్న నేపథ్యంలో కారంచేడు గ్రామానికి చెం దిన యువకులు మూకుమ్మడిగా తరలి వచ్చి మేము సైతం మీకు తోడుగా అం టూ ఏలూరి వెంట నడిచారు. యువత రాకతో టీడీపీలో జోష్ పెరిగింది.


వైసీపీ సర్పంచ్ సీతామహాలక్ష్మిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరులో టీడీపీ శ్రేణుల ప్రచారం

మార్టూరు : అంబేడ్కర్‌నగర్‌లో బుధవారం టీడీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావును మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఈ సందర్భంగా సూపర్‌సిక్స్ పథకాలు, మహిళా శక్తి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీ అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో 25వేల మంది పేదలకు ఏలూరి ఇంటి స్థలాలు ఇస్తారన్నారు. అంబేడ్కర్ నగర్‌లో జరిగిన అభివృద్ధిని మర్చిపోకుండా ఏలూరికి మద్దతు పలకాలన్నారు. కార్యక్రమంలో జంపని శ్రీను, కన్నె గంటి శ్రీను, కామినేని జనార్దన్, షేక్ రజాక్ తాటి నాగేశ్వరరావు, పుట్టా శ్రీను, కాకోలు వెంకటేశ్వర్లు, గన్నవరం బుడే, రావినేని శ్రీను, గొట్టిపాటి వెంకట్రావు, భూలక్ష్మి, రుక్మిణి, శేషమ్మ, శివమ్మ పాల్గొన్నారు.

వైసీపీని వీడిన నాయుడువారిపాలెం సర్పంచ్
వందలాదిమంది టీడీపీలో చేరిక

నాయుడువారిపాలెం (పర్చూరు) : కారంచేడు మండలం నాయుడువారిపాలెం గ్రామ వైసీపీ సర్పంచ్ గుమ్మడి సీతామహాలక్ష్మి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో బుధవారం పార్టీలోకి చేరారు. ఆమెతోపాటు, గ్రామానికి చెందిన వందలాదిమంది వైసీపీకి గుడ్‌బై చెప్పి సైకిలెక్కారు. వారందరికీ ఏలూరి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో గుమ్మడి రామ్మోహన్, నాయుడు సుబ్బారావు, జరుగుల జయప్రకాష్, రాధా లక్ష్మి ఆధ్వర్యంలో పలువురు వైసీపీ నాయకులు కార్యకర్తలు మూకుమ్మడిగా టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ కలసి పని చేసి రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఏలూరి అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం మండలపార్టీ అధ్యక్షుడు తిరుములశెట్టి శ్రీహరి, నాయకులు ఉన్నారు.

ఏలూరి గెలుపు కోసం విస్తృత ప్రచారం

పర్చూరు : ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విజయాన్ని కాంక్షిస్తూ కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే ఏలూరికి అఖండ మెజార్టీతో హ్యాట్రిక్ విజయం చూకూర్చాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం పర్చూరులోని ప్రధాన వీధుల్లో ప్రచారం సాగింది. జగన్‌రెడ్డి పాలనలలో అన్ని రంగాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుదేశం పట్టణ పా ర్టీ అధ్యక్షుడు అగ్నిగుండాల వెంకటకృష్ణారావు, కొల్లా శివరాం ప్రసాద్, కొండ్రగంటి శివనాగేశ్వరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, మల్లాది సురేష్, అబ్రహం, నాగరాజు, కొల్లా చౌదరి, పఠాన్ మీరావలి, కోటగిరి ప్రసాద్, మహిళా నాయకులు పూరిమెట్ల జయమ్మ, ఊటుకూరి నిర్మల, కొల్లా సుబ్బమ్మ, జనసేనులు దీర్ఘాల రమేష్, తులసి చంటి, అచ్చికోలు సతీష్, సుధాకర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..ఆత్మీయత

పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కూటమి అభ్యర్థి కొండయ్య

చీరాల, ఏప్రిల్ 17 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య బుధవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆత్మీయ కార్యక్రమాల్లో పాల్గొని, స్థానికులు, భక్తులతో ఆత్మీయంగా మాట్లాడారు. మండల పరిధిలోని బోయినవారిపాలెంలో శ్రీరామనవమి సందర్భంగా జరిగిన సీతారాముల కల్యాణ మహోత్సవ ప్రత్యేక పూజల్లో కొండయ్య పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రతి ఒక్కరూ మా కొండయ్య అంటూ పక్కవారికి పరిచయం చేశారు. అనంతరం కావూరివారిపాలెంలో బ్రహ్మంగారి గుడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.


బ్రహ్మంగారి గుడి కార్యక్రమంలో పాల్గొన్న కొండయ్య


మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి కొండయ్య

కూటమి నేతల విస్తృత స్థాయి సమావేశం

చీరాల, ఏప్రిల్ 17 : త్వరలో జరగబోయే ఎన్నికలలో ఎలాంటి ప్రణాళికలు అనుసరించాలనే అంశంపై చర్చించడానికి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎం. కొండయ్య అధ్యక్షతన టీడీపీ, జనసేన, బీజేపీ నేతల విస్తృత స్థాయి సమావేశం బుధవారం చీరాల పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని ఓటరును కలిసి వైసీపీ వైఫల్యాలను వివరించడమే లక్ష్యంగా ముందుకుసాగలన్నారు. ఎన్నికలలో ఎలాంటి వ్యూహాలను అమలు చేయాలనే అంశాలపై కూటమి నేతలు చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నాతాని ఉమామహేశ్వరరావు, సీనియర్ నాయకురాలు సజ్జా హేమలత, జనార్దన్, శ్రీనివాసరావు ఇతర నేతలు పాల్గొన్నారు

టీడీపీ ప్రచారంలో పాల్గొనలేదు

» వల్లాపల్లి వీఆర్ఏ వివరణ
» ముస్లింలంతా టీడీపీలోకి వెళ్తున్న అక్కసుతోనే తప్పుడు వార్త

బల్లికురవ, ఏప్రిల్ 17 : టీడీపీ ఎన్నికల ప్రచారంలో తాను పాల్గొనలేదని కావాలనే కొందరు తనపై పత్రికల్లో వార్త రాయించారని వల్లాపల్లి గ్రామానికి చెందిన వీఆర్ఏ షేక్ జాన్ సాహెబ్ బుధవారం తెలిపారు. వల్లాపల్లిలో ముస్లిలందరూ టీడీపీ వైపు వెళ్లారనే కోపంతో వైసీపీ నేతలు గతంలో తాను పసుపు రంగుతో పోలి ఉన్న కండువాతో ఉన్న ఫొటోను అధికార పార్టీ పత్రికకు అందజేసి తనపై తప్పుడు వార్తను రాయించారని తెలిపారు. వల్లాపల్లి గ్రామంలో గత శుక్రవారం జరిగిన టీడీపీ ప్రచారం కార్యక్రమంలో తాను పాల్గొన్నట్లు బుధవారం వచ్చిన వార్తపై ఉన్నతాధికారులకు వివరణ ఇస్తానని తెలిపారు. ముస్లిం అయినందునే తనపై తప్పుడు వార్త రాయించి, ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని షేక్ జాన్ సాహెబ్ ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల కిందట తాను టీడీడీ ప్రచారంలో పాల్గొన్నట్లు వార్త రాయించమేమిటని ప్రశ్నించారు.

నీటికుంటలో వ్యక్తి మృతదేహం


కుంటలో మృతదేహం

చీరాలటౌన్, ఏప్రిల్ 17 : చీరాల పరిధిలో గుర్తు తెలియని వ్యక్తుల మృతదేహాలతో పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. గత శుక్రవారం మండల పరిధిలోని ఈపూరుపాలెం పద్మనాభునిపేటలో ఇంటి నిర్మాణం కోసం యజమాని ఇంటికి ఇసుక తీసుకురాగా అందులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉండడంతో అందరూ ఆందోళన చెందారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం మండల పరిధిలోని విజయనగర్ కాలనీ శివారులోని నీటి కుంటలో మరో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. విచారణ అనంతరం విజయనగర్ కాలనీకి చెందిన మోటూరి జయరావు(58)గా గుర్తించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టంకు తరలించారు. బహిర్భూమికి వచ్చి నీటికుంటలో జారిపడి మృతిచెందినట్లు భావిస్తున్నారు. వరుస సంఘటనలతో పోలీసులకు తలలు బొప్పికడుతున్నాయి. ఈ కేసులను పోలీసులు ఎలా ఛేదిస్తారో చూడాలి.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

బల్లికురవ, ఏప్రిల్ 17 : మండలంలోని వైదన గ్రామం వద్ద రెండు రోజుల కితం బైకుపై నుంచి కింద పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు బండారు రాజు(52) బుధవారం మృతి చెందినట్లు ఏఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. అద్దంకి మండలం చినకొత్తపల్లి గ్రామానికి బండారు రాజు తన కుమారుడు మహేంద్రతో కలిసి సోమవారం బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు కొలుపుల భోజనానికి వచ్చి తిరిగి వెళుతుండగా జరిగిన ప్రమాదంలో రాజు గాయపడ్డారు. ఒంగోలు ఆసుపత్రిలో చికిత్స పొందుతు మృతి చెందారు. కుమారుడు మహేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

48 మద్యం బాటిళ్లు స్వాధీనం

మార్టూరు, ఏప్రిల్ 17 : మార్టూరులో కొణిదెన రోడ్ నుంచి నాగరాజుపల్లి రోడ్‌లోకి వెళ్లే మట్టిరోడ్డులో బుధవారం నడిచి వెళ్తున్న కోనంకి అంజయ్య అనే వ్యక్తి నుంచి 48 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. అద్దంకి మండలం చిన్న కొత్తపల్లికి చెందిన అంజయ్య గోతాంలో అక్రమంగా మద్యం బాటిళ్లను తీసుకెళ్తున్నట్లు అందిన సమాచారంతో పోలీసులు సోదాలు చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సైదా, కానిస్టేబుల్ రామకోటేశ్వరరావు ఉన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం


స్వాధీనపర్చుకున్న మద్యం సీసాలు

మేదరమెట్ల : జాతీయ రహదారిలో మేదరమెట్ల వద్ద ఎస్ఈబీ అధికారులు ప్రైవేట్ ట్రావెల్ బస్సును తనిఖీ చేసి నాలుగు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం వేకువజామున హైదరాబాద్ నుంచి కొండపి వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు డ్రైవర్ రెండు లీటరు బాటిళ్లు, రెండు 750 ఎంఎల్ బాటిళ్లు తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. డ్రైవర్‌ను బస్సును అదుపులోకి తీసుకున్నారు. ప్రయాణికులను వేరే బస్సుల్లోకి ఎక్కించారు. అద్దంకి ఎస్ఈబీ ఎస్సై వీరవల్లి సైమన్ కేసు నమోదు చేశారు.


వ్యక్తిపై దాడికి పాల్పడిన పలువురిపై ఫిర్యాదు

చీరాలటౌన్, ఏప్రిల్ 17 : వ్యక్తిపై దాడికి పాల్పడిన పలువురిపై బాధితుడు చీరాల టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని ఈపూరుపాలెంకు చెందిన ఈశ్వర్‌పై మంగళవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో సాయికాలనీలో కల్యాణి మరికొందరు దాడిచేశారు. దీంతో అతను చీరాల ఏరియా వైద్యశాలలో అవుట్‌పోస్ట్ పోలీసులకు అందించిన సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు విచారణ చేస్తున్నారు. దీనిపై కల్యాణి మాట్లాడుతూ ఈశ్వర్ గోడదూకి ఇంట్లోకి చొరబడి చోరీకు యత్నించే క్రమంలో అతడిని పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. దాడి జరిగిన దాఖలాలు లేవని చెప్పారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి గెలుపుతోనే యువతకు భవిత

ఇంకొల్లు, ఏప్రిల్ 17 : కూటమి గెలుపుతోనే యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జనసేన ఆర్టీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దపూడి విజయ్ కుమార్ అన్నారు. ఇంకొల్లులో బుధవారం తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీల ఆధ్వర్యంలో యువత మేలుకో కార్యక్రమంలో భాగంగా స్థూపం సెంటర్ నుంచి కడవకుదురు రోడ్డు, సినిమాహాల్ కూడలి మీదగా నాగులచెరువుకట్ట వద్ద ఎన్టీఆర్ విగ్రహం వరకు యువత, నాయకులు ర్యాలీ నిర్వహించారు. జగన్‌రెడ్డి పాలనలో యువత ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోయారని, యువత ఉజ్వల భవిష్యత్ కోసం విద్యావంతులు, యువత కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలని విజయకుమార్ విజ్ఞప్తి చేశారు. వైసీపీ పాలనలో రాజధాని లేని రాష్ట్రంగా మార్చారన్నారు. కార్యక్రమంలో రావిపాటి అరుణ, పవన్, పొద శ్రీరామ చంద్రమూర్తి, బాచిన తిరుపతయ్య,కొల్లిపర కల్యాణకుమార్, నాగ అనిల్, చింతనిప్పల సుమంత్, గోగినేని మురళి, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న యువత, కూటమి నేతలు



జిల్లాలో ఎన్నికల వ్యయ పరిశీలకులు

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 17 : సాధారణ ఎన్నికల వ్యయ పరిశీలకులుగా నియమితులైన జ్యోతిమోయ్ బయ్ లంగ్, కంచన్ రామ్‌మీనాలు బుధవారం రాత్రి నెల్లూరు నగరానికి చేరుకున్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకులకు నుడా వీసీ బాపిరెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటరమణ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కందుకూరు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు వ్యయ పరిశీలకులుగా జ్యోతిమోయ్ బయ్ లంగ్, నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాలకు అబ్జర్వర్‌గా కంచన్ రామ్‌మీనా వ్యవహరించనున్నారు.

ప్రాంతం	నెల్లూరు	కావలి	ఆత్మకూరు	ఉదయగిరి	కందుకూరు
గరిష్ఠం	41.0	38.0	42.0	42.0	39.0
కనిష్ఠం	30.9	28.0	29.0	27.0	28.0



జై శ్రీరామ్!!

• వైభవంగా నవమి • ఊరూరా కల్యాణాలు • మారుమోగిన రామనామం

నెల్లూరు (సాంస్కృతికం) ఏప్రిల్ 17 : శ్రీరామ నామం జిల్లా అంతటా మారుమోగింది. బుధవారం శ్రీరామ నవమి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పల్లెలు, పట్టణాల్లో వాడవాడా సీతారాముల కల్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి. చలువ పందిళ్లు, పానకం, వడపప్పు, ప్రసాదాలు, విసనకర్రలు, పెండ్లి విందులతో నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. జానకి రమణుల పరిణయోత్సవాన్ని కనులారా వీక్షించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. శ్రీరామ నామ జపం, భజనలు చేస్తూ తన్మయత్వం చెందారు. ఎన్నికల సీజన్ కావడంలో ప్రచారంలో భాగంగా పోటీలో ఉన్న అభ్యర్థులు, వారి అనుచరులు సీతారామ కల్యాణోత్సవాలకు హాజరై పండితులు ఆశీస్సులు అందుకున్నారు. నెల్లూరు నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. పట్టు వస్త్రాలను తెలుగుగంగ ప్రాజెక్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ హరినారాయణరెడ్డి దంపతులు, ముత్యాల తలంబ్రాలను 1వ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి జీ కపర్ది దంపతులు సమర్పించారు. ఎంపీలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నగర మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి హాజరయ్యారు. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



సీతారాముల కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు


చిల్లరిస్తేనే చెక్కులు!

• ముఖ్యమంత్రి సహాయ నిధి సాయానికి చేయి తడపాల్సిందే
• అధికార పార్టీ నేతల కక్కుర్తి
• కావలి ఎమ్మెల్యే ఆఫీస్ కేంద్రంగా రోగుల సొమ్ములో వాటాలు



గాయపడిన ఓరుగంటి హిమబిందును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే దంపతులు(ఫైల్)


కావలి రూరల్, ఏప్రిల్ 17 : "ఎక్కడా కూడా లంచాలు అనే మాట లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే నగదు జమ చేస్తున్నాం" అంటూ సీఎం జగన్ చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల చుట్టూ తిరిగే రోగులకు అందించే సీఎం రిలీఫ్ ఫండ్ (సీఎంఆర్ఎఫ్/ముఖ్యమంత్రి సహాయనిధి) చిల్లర ఇస్తేనే చేతికందుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నెల్లూరు జిల్లా కావలి మండలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయాలంటే కొంతమంది వైసీపీ నాయకులు బాధితుల నుంచి నగదు వసూలు చేస్తు న్నారనే విమర్శలు జోరుగా ఉన్నాయి. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి కార్యా లయంలో కొంత మంది నాయ కులు ఈ తరహా దందాకు పాల్పడుతున్నట్టు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావలి మండలం కొత్తపల్లిలో గత ఏడాది సెప్టెంబరు 20న వినాయక చవితి సందర్భంగా గణనాథుడి ప్రతిమ నిమజ్జన ఊరేగింపు జరిగింది. ఆ ఊరేగింపులో బాణసంచా పేలి పలువురు చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. దామా వర్షిత, ఒరుగంటి హిమబిందు తీవ్రంగా గాయపడగా, నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందారు. వర్షిత రూ.6 లక్షలతో చికిత్స పొందగా, చేతి సర్జరీకి మరో రూ.2 లక్షలు ఖర్చు అయిందని బాధితురాలి తండ్రి వాపోయారు. అలాగే హిమబిందు వైద్యానికి రూ. 2 లక్షలు ఖర్చు అయ్యింది. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి దంపతులు వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో బాధితులు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా ఈ ఏడాది జనవరిలో చెక్కులు వచ్చాయి. అయితే, ఈ విషయాన్ని ఎమ్మెల్యే కార్యాలయంలో కొంతమంది మార్చి నెలాఖరు వరకు గోప్యంగా ఉంచారు. అంతేకాదు, సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇవ్వాలంటే 50 శాతం నగదు ఎమ్మెల్యే కార్యాలయానికి ఇవ్వాలని సదరు కార్యాలయంలో పనిచేసే యడవల్లి మహేశ్ డిమాండ్ చేసినట్లు బాధితులు వాపోయారు. గత్యంతరం లేక దామా వర్షిత తండ్రి చంద్ర కెనరా బ్యాంక్‌లో రూ.1.90 లక్షలు జమ చేసిన తర్వాత చెక్కు అందుకున్నారు. అలాగే ఓరుగంటి హిమబిందు తండ్రి మధు నుంచి ఎమ్మెల్యే కార్యాలయంలో పనిచేసే సాయిచరణ్ రూ.30 వేలు ఫోన్ పే ద్వారా తీసుకున్నారు. ఆ తరువాతే సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు. ఇలా పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి మంజూరు కాగా, ఆ నిధిలో కూడా ఎమ్మెల్యే అనుచరులు వాటాలు అడగడంపై బాధితులు లబోదిబోమంటున్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు కోసం హిమబిందు తండ్రి మధు నుంచి రూ.30 వేలు ఫోన్ పే చేయించుకున్న సాయిచరణ్

ఏం.. ఉన్నారో.. ఏం విన్నారో.. ఏం చూశారో...!?

ఐదేళ్లలో ఒక్క హామీ నెరవేర్చని జగన్
'ఒక్క చాన్స్' ఇచ్చినందుకు విసిగిపోయిన జనం
రేపటి నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాలు



'నేను ఉన్నాను.. నేను విన్నాను.. నేను చూశాను..!' సీఎం కుర్చీ ఎక్కడమే ధ్యేయంగా రాష్ట్రమంతా పాదయాత్ర చేసిన వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నెల్లూరు జిల్లాలో కూడా తన మాటను బలంగా వినిపించారు. ఆ మాటలు నమ్మిన జనం 2019 ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులను గెలిపించారు. అయితే, ఐదేళ్లు గడిచినా జగన్‌రెడ్డి చెప్పిన మాటలు నెరవేరలేదు. ఏం ఉన్నారో.. ఏం చూశారో.. ఏం విన్నారో...నంటూ నిట్టూర్పులు విడుస్తున్నారు. పాదయాత్ర సందర్భంగా జగన్ నడిచిన దారులు బాగుపడలేదు. పల్లె, పట్టణం ఇలా ప్రతిచోట స్థానికులకు జగన్ ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదు. పాపం జగన్ అంటూ ఒక్క చాన్స్ ఇచ్చిన ప్రజలకు గత ఐదేళ్లుగా ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ఆయన చుక్కలు చూపిస్తున్న వైనంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాలు శుక్రవారం నుంచి వెలువడనున్నాయి.

• **పాదయాత్రలో మాటలివి..**

కోవూరు చక్కెర ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తామన్నారు. అది జరగకపోగా ఫ్యాక్టరీని తుక్కు కింద విక్రయించడానికి సిద్ధమయ్యారు. పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్న సోమశిల జలాశయాన్ని విస్మరించారు. చివరికి దెబ్బతిన్న అప్రాన్ మరమ్మతులకు కూడా డబ్బులు ఇవ్వలేదు. ఉత్తర కాలువ ఆధునీకరిస్తానన్నారు. హైలెవల్ కెనాల్ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. నెలలు, సంవత్సరాలు గడిచినా ఆ ఊసే లేదు. పరిశ్రమలు తీసుకొచ్చి, ఉద్యోగాలు కల్పి స్తామని ఆత్మకూరు యువతకు ఇచ్చిన మాట నెరవే రకపోగా వచ్చిన ఒక్క పరిశ్రమను కూడా బద్వేలుకు తరలించుకుపోయారు. కలిగిరి జిర్రావారిపాలెం కాటన్ యార్డును కోల్డ్ స్టోరేజ్‌గా, రాళ్లపాడు ప్రాజెక్టు రూపురేఖలు మారుస్తామన్నారు. సోమశిల లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులకు నీరిస్తామన్నారు. కానీ, ఇవేవీ ఆచరణ సాధ్యం కాలేదు.

• **సీఎంగా ఇచ్చిన హామీలూ గాలికి..**

ప్రతిపక్ష నాయకుడిగా ఇచ్చిన హామీలు అటుంచితే ముఖ్యమంత్రిగా చేసిన హామీలు సైతం అటకెక్కించేశారు. కావలి పర్యటనలో ఆ పట్టణ అభివృద్ధికి 80 కోట్ల రూపాయలు ప్రకటించారు. పైసా విదల్చలేదు. 2021లో నెల్లూరును వరద ముంచెత్తినప్పుడు మందీమార్బలంతా వచ్చిన జగన్ అన్నీ చూశారు. మునక ప్రాంత ప్రజల బాధలు విన్నారు. వరద పోటు నివారణకు పెన్నా పొర్లు కట్టల నిర్మాణానికి యుద్ధ ప్రాతిపదిక రూ.100 కోట్లు కేటాయిస్తున్నట్లు పెన్నా నది ఒడ్డు మీద నుంచి బలంగా ప్రకటించారు. కానీ, ఏం చేద్దాం... రెండేళ్లు అవుతున్నా పొర్లుకట్టల నిర్మాణాలు పూర్తికాలేదు. పొట్టేపాళెం వంతెన వద్ద ప్రజల అవస్థలు చూశారు. వంతెన నిర్మిస్తామని మాటిచ్చారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి జలదీక్షకు పూనుకుంటే దానిని విఫలం చేయడానికి కలుజు నుంచి నీరు రాకుండా తాత్కాలికంగా మట్టి వేయించారే తప్ప వంతెన నిర్మాణానికి పూనుకోలే. జొన్నవాడ సమీపంలోని దేవరపాళెం కలుజు కొట్టుకుపోవడాన్ని చూశారు. యుద్ధప్రాతిపదికన వంతెన నిర్మాణానికి నిధులు విడుదల చేస్తున్నట్లు అక్కడికక్కడే ప్రకటించారు. పాపం యుద్ధ ప్రాతిపదికన అంటే అర్థం ఎప్పటికి పూర్తి కాదనే విషయాన్ని ఇప్పటికి అర్థం చేసుకున్నారు.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)





కోవూరులోని తహసీల్దారు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

తొలిఘట్టం నేటి నుంచే!

• 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ
• రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో ఏర్పాట్లు

నెల్లూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఘట్టం రానే వచ్చింది. పార్లమెంటు, అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ వెలువడనుంది. దేశవ్యాప్తంగా ఏడు దశల్లో ఎన్నికలు జరగనుండగా నాల్గవ దశలో మన రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నాయి. నెల్లూరు పార్లమెంటుతో పాటు జిల్లా పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఆయా రిటర్నింగ్ అధికారులు (ఆర్వో) నోటిఫికేషన్లను విడుదల చేస్తారు. ఆ వెంటనే నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఉదయం 11 గంటల నుంచి నామినేషన్లను దాఖలు చేయవచ్చు. మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఒక్క నిముషం ఆలస్యమైనా నామినేషన్‌ను స్వీకరించరు. ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ సెలవు రోజుల్లో నామినేషన్ల దాఖలుకు వీలుండదు. 26న స్క్రూటినీ, 29న మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. ఆ తర్వాత బరిలో నిలిచిన అభ్యర్థుల జాబితాను ఆర్వోలు ప్రకటిస్తారు. రిజిస్టర్ పార్టీల అభ్యర్థులకు ఆయా పార్టీల గుర్తులనే కేటాయిస్తారు. స్వతంత్ర అభ్యర్థులకు మాత్రం ఎన్నికల నిబంధనల ప్రకారం గుర్తులను కేటాయిస్తారు.

• **నామినేషన్ల స్వీకరణ ఇక్కడే!**

నెల్లూరు నగర నియోజకవర్గానికి కార్పొరేషన్ కార్యాలయంలో, నెల్లూరు రూరల్‌కు నెల్లూరు ఆర్డీవో కార్యాల యం, సర్వేపల్లికి వెంకటాచలం ఎంపీడీవో కార్యాలయం, కోవూరుకు కోవూరు తహసీల్దార్ కార్యాలయం, ఆత్మకూరుకు ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం, ఉదయగిరికి ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయం, కందుకూరుకు కందు కూరు సబ్ కలెక్టర్ కార్యా లయం, కావలికి కావలి ఆర్డీవో కార్యాల యంలో నామినే షన్లు స్వీకరిస్తారు. అలానే నెల్లూరు పార్లమెంటు స్థానా నికి సంబంధించి నెల్లూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ వేసే వ్యక్తితోపాటు నలుగురికి మాత్రమే ఆర్వో కార్యాలయంలోకి అనుమతి ఉంటుంది. పార్లమెంటు స్థానానికి నామినేషన్ వేసే అభ్యర్థులు రూ.25 వేలు, అసెంబ్లీ స్థానాలకు నామినేషన్లు వేసే అభ్యర్థులు రూ.10 వేలను నామినేషన్‌తోపాటు సెక్యూరిటీ డిపాజిట్ కింద అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఇందులో సగం మినహాయింపు ఉంటుంది. ఇక నామినేషన్ల సమయంలో ఆర్వో కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకే ర్యాలీలు, వాహనాలకు అనుమతి ఉంటుంది.

నిబంధలు పాటించాలి : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం) : అభ్యర్థులు నిబంధనలు పాటిస్తూ నామినేషన్లు దాఖలు చేయాలని కలెక్టర్ హరినారాయణన్ ఒక ప్రకటనలో సూచించారు. అన్ని రాజకీయ పార్టీలకు నూతన నామినేషన్ పత్రాలను అందచేశామని, వీటిని క్షుణ్ణంగా పరిశీలించి ఎటువంటి తప్పులు, పొరపాట్లు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. నామినేషన్లలో ఎటువంటి ఖాళీలు ఉండకూడదని, ఫామ్-ఏ, ఫామ్-బీ పత్రాలను ఇంకుతో మాత్రమే సంతకం చేసి అందించాలని సూచించారు. అలాగే తాజా అఫిడవిట్, నామినేషన్ పత్రాలను మాత్రమే వినియోగించాలని కోరారు.

తీర ప్రాంత ప్రజల అభిమానం మర్చిపోలేనిది

• నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఉలవపాడు, ఏప్రిల్ 17 : గ్రామీణ ప్రాంత ప్రజలతో కలిసి దైవ కార్యక్రమాలు, పూజలు నిర్వహించడం, తీర ప్రాంత ప్రజల ఆదరణ, అభిమానం మరచిపోలేనిదని గెలిచాక అందరికీ సేవచేసి రుణం తీర్చుకుంటానని ఎన్డీఏ కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెదపట్టపుపాలెం, పల్లెపాలెం, రెడ్డిపాలెం, చాకిచర్ల శ్రీశ్రీనగర్ ఎస్సీ కాలనీల్లో బుధవారం జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో కందుకూరు అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చింది ప్రజాసేవ చేయడానికే తప్ప మరొకటి ఆశించికాదని, పదేళ్లుగా 150 గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రజలకు మంచినీటిని అందించానని అన్నారు. మరో అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ తీరప్రాతం గ్రామాల్లో తిష్టవేసిన సమస్యలను రాబోవు టీడీపీ ప్రభుత్వంలో పక్కా తీరుస్తానని ఆయా గ్రామస్థులకు మాట ఇచ్చారు. చాకిచర్ల శ్రీశ్రీనగర్ ఎస్సీ కాలనీలో శ్రీరాములవారి గుడి నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తానని వేమిరెడ్డి కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార గ్రామల కాపులు, పెద్దలు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



పెదపట్టపుపాలెం రాములవారి గుడిలో ప్రత్యేక పూజలు చేస్తున్న వేమిరెడ్డి, ఇంటూరి

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలి

• పోలీస్ అధికారుల సమీక్షలో ఐజి సర్వశ్రేష్ఠ త్రిపాఠి

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 17 : ఎన్నికల కమిషన్ గైడ్‌లైన్స్ అనుగుణంగా పారదర్శకత, నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వహించాలని గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పోలీసు అధికారులతో ఐజీ ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు, భద్రత పరమైన అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ప్రచారం కోసం జిల్లాకు వచ్చే వీవీఐపీలకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలని, ఈ మేరకు ముందస్తు సమాచారాన్ని సేకరించాలని సూచించారు. నామినేషన్లకు ఎంసీసీ నిబంధనలు అనుసరించి తగిన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని, నోడల్ అధికారి అప్రమత్తంగా పర్యవేక్షించాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలలో ఇతర శాఖలు, గ్రామపెద్దల సమన్వయంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. ఎన్నికల్లో శాంతికి విఘాతం కలిగించే ట్రబుల్ మాంగర్స్, గత ఎన్నికల ఎలక్టోరల్ అఫెండర్లు, శారీరిక, భౌతిక దాడి చేసిన వారు, నేర చరిత్ర కలిగిన వారిని బైండోవర్ చేయాలని, బైండోవర్ ఉల్లంఘించి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం జిల్లాలో ఇప్పటివరకు డిపాజిట్ చేసుకున్న ఆయుధాల వివరాలు, ఎగ్జిక్యూట్ చేసిన వారెంట్లు, బైండోవర్లు, నేర చరిత్ర కలిగిన వారి వివరాలు, సమస్యాత్మక ప్రాంతాలలో కేంద్ర బలగాలతో జరిపిన ఫ్లాగ్ మార్చ్ గురించి క్షుణ్ణంగా ఆరా తీశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు సీహెచ్ సౌజన్య, ఏవీఆర్‌పీబీ ప్రసాద్, శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న ఐజీ

రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం!

● ప్రజలకు తప్పని ఇబ్బందులు



దుకాణాల ఎదుట అధ్వానంగా రహదారి



ప్రభుత్వ కార్యాలయాల ఎదుట తొలగించని రాళ్లు

కలిగిరి, ఏప్రిల్ 17: కావలి-దుత్తలూరు రహదారి విస్తరణలో భాగంగా కలిగిరి తహసీల్దారు కార్యాలయ కూడలి నుంచి హెచ్‌పీ పెట్రో ల్ బంకు వరకు రోడ్డుకు ఇరువైపులా ఇల్లు, దుకాణాలు, ప్రహరీలను తొలగించారు. ఈ క్రమంలో తొలగించిన ప్రాంతాల్లో నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తహసీల్దారు కార్యాలయం నాలుగు రహదారుల కూడలి ప్రాంతం కావడం, సమీపంలో బస్‌షెల్టర్, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు ఉండటం వలన నిత్యం విద్యార్థులు, ప్రయాణికులు, ఉద్యోగులు ఎక్కువగా సంచరిస్తుంటారు. రోడ్డు నిర్మాణపు పనులు మొదలు పెట్టకపోవడం వలన స్థానికులు ఇళ్లలో నుంచి బయటకు వచ్చి తమ పనులు చేసుకోవాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీలను పగులకొట్టిన తరువాత వాటిని తొలగించి ఆ ప్రాంతం శుభ్రం చేయకపోవడతో కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే ప్రజానీకం అసౌకార్యానికి గురవుతున్నారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ కాలువ, రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా వెంటనే పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

మాలేపాటికి టీడీపీ శ్రేణుల సత్కారం



మాలేపాటిని సత్కరిస్తున్న టీడీపీ శ్రేణులు

కావలి, ఏప్రిల్ 17: టీడీపీ కావలి మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడిని రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పార్టీ నియమించిన సందర్భంగా బుధవారం పట్టణంలోని మాలేపాటి నివాసంలో పలువురు టీడీపీ శ్రేణులు ఆయనను కలిసి అభినందనలు తెలిపి శాలువాలు, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బానాయుడు మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా పార్టీ వెన్నంటే నడుస్తున్న తనను పార్టీ గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి ఇచ్చి ప్రోత్సహిస్తున్నందుకు పార్టీకి ధన్యవాదాలు తెలిపారు. తనను గుర్తించి రాష్ట్రస్థాయి పదవి ఇచ్చిన జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకి, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడికి, జాతీయప్రధానకార్యదర్శులు నారా లోకేష్, బీద రవిచంద్రలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, మన్నవ రవిచంద్ర, బొట్లగుంట శ్రీహరినాయుడు, యేగూరి చంద్రశేఖర్, మంచాల ప్రసాద్, కాంత్ర భాస్కర్, చల్లా వెంకటేశ్వర్లు, వెంకట్రావు, పీ. రవీంద్ర పాల్గొన్నారు

పైడి కుటుంబానికి పరామర్శ

బిట్రగుంట : బోగోలు మండలం కడనూతలలో బుధవారం జరిగిన తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి పైడి హర్ష సతీమణి పైడి ప్రియాంక ప్రథమ వర్ధతిలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు పాల్గొన్నారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆమె కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట దగుమాటి వేణుగోపాల్‌రెడ్డి, మాలేపాటి నాగేశ్వరావు, పోట్లూరి శ్రీనివాసులు, దాసరి శ్రీనివాసులు ఉన్నారు.

దళితులను వేధించిన వారికి టికెట్లు!

● 18 నెలలు కాదు 18 ఏళ్లు శిక్ష విధించాలి

● దళిత సంఘర్షణ సమితి నేతల ధర్నా

అల్లూరు, ఏప్రిల్ 17 : దళితులను వేధించినా, హత్య చేసిన వారికి వైసీపీలో ఎమ్మెల్యే, ఎంపీ టిక్కెట్లు ఇచ్చేస్తారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి అన్నారు. దళితుల శిరోముండనం కేసులో తోట త్రిమూర్తులుకు 18 నెలల జైలు శిక్ష విధిస్తూ వెలువడిన తీర్పుపై ఆయన దళితులతో కలసి అల్లూరు పాతబస్టాండు కూడలి వద్ద బుధవారం సాయంత్రం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1996లో దళితులను అన్యాయంగా శిరోముండనం చేసిన కేసులో తోట త్రిమూర్తులుకు ఐదేళ్ల జైలు శిక్షకు బదులు 18 నెలలు మాత్రమే జైలు శిక్ష వేయడం దారుణమైన పరిణామమన్నారు. అటువంటి వారికి 18 ఏళ్లు శిక్ష విధించినా తక్కువేనన్నారు. పేదలకు ఒక చట్టం సంపన్నుడికి మరో చట్టంగా ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగం నడుస్తుందన్నారు. దళితులపై హత్య, హత్యాయత్నం, హింసలు చేసి వారికి వైసీపీలో టిక్కెట్లు ఇచ్చి దళితులకు అన్యాయం చేసి అక్రమార్కులకు ప్రత్యేక గౌరవాన్ని జగన్మోహన్‌రెడ్డి కల్పిస్తున్నాడని మండిపడ్డాడు. ఇటువంటి చర్యలు ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి తగదన్నారు. దళితులపై ఉక్కుపాదం మోపిన తోట త్రిమూర్తులుకు వైసీపీ టికెట్లు ఇవ్వవద్దని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సాగు ప్రసాద్, సాదేపల్లి దాసు, కాకాణి వెంకయ్య, దర్శిగుంట వెంకయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




అల్లూరు పాతబస్టాండు కూడలిలో ధర్నా చేస్తున్న దళిత నేతలు

అయ్యప్పస్వామి ఆలయానికి విరాళం

కందుకూరు, ఏప్రిల్ 17: పట్టణంలోని కనిగిరి రోడ్డులో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న అన్నప్రసాద వితరణ భవనానికి గుర్రం శ్రీనివాసులు, వెంకట రమణమ్మ దంపతులు బుధవారం రూ.30వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో అన్నప్రసాద కమిటీ సభ్యులు కేఎస్ వెంకటేశ్వర్లు, ఇస్కాల వెంకటనరసింహం, నలబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, దాసరి శ్రీనివాసులు, ఉన్నం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం



జలదంకి : వేదికపై కొలువుదీరిన సీతారాములు

కందుకూరు, ఏప్రిల్ 17: శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా బుధవారం రామాలయాల్లో సీతారాముల కల్యాణోత్సవాలు కమనీయంగా జరిగాయి. కందుకూరు పట్టణం, వాడవాడలా రామాలయాలు శ్రీరామనామస్మరణతో మార్మోగాయి. ప్రజలు ఇంటింటా పూజలు నిర్వహించిన అనంతరం కుటుంబ సమేతంగా రామాలయాల్లో తరలివెళ్లారు. ఆలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించి వడపప్పు, పానకం పంచిపెట్టారు. పట్టణంలోని పెద్దబజారులోని కోదండరామాలయం, పామూరు రోడ్డులోని రామాలయం, అమలనాథునిపాలెం, నందావారి వీధి, ఏకలవ్య నగర్ ప్రాంతాల్లోని రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా జరిగాయి. అమలనాథునిపాలెం, మండలంలోని మోపాడులో జరిగిన శ్రీరామనవమి ఉత్సవాలలో కందుకూరు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య తదితరులున్నారు.



కావలిటౌన్ : సత్యనారాయణస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సీతారాముల కల్యాణం

కావలిటౌన్ : పట్టణంలోని దక్షిణంపేట కోదండరాముడి ఆలయం, ఉత్తరంపేట పట్టాభిరాముడి ఆలయం, పుల్లారెడ్డి నగర్ సత్యనారాయణ స్వామి ఆలయం, వెంగళరావునగర్, జనతాపేట, రామయ్యబడి, ముసునూరులలోని రామాలయాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. సత్యనారాయణస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలు కనులపండువగా జరిగాయి. యేల్చూరి వెంకటేశ్వర్లు కుమారులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. దక్షిణంపేట కోదండరామాలయంలో చొప్పఉత్సవం, తిరుమంజనం ప్రత్యేక పూజలు జరిగాయి.

కావలి రూరల్ : మండలంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. రామాలయాలను విద్యుత్ దీపాలు, పచ్చతోరణాలతో ముస్తాబు చేశారు. ఆలయాల చలువపందిళ్లు వేసి దేవతామూర్తులను పూలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు వడపప్పు, బెల్లం పానకాలను అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

కలిగి : మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. రామాలయాల్లో జరిగిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోశ్చరణాల మధ్య, చలువపందిళ్ల కింద జరిగిన సీతారామ కల్యాణ వేడుకలను భక్తులు కనులారా తిలకించారు.

అల్లూరు : అల్లూరు, నార్తుమోపూరుల్లోని రామమందిరాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అల్లూరుపేటలోని సీతా లక్ష్మణ హనుమత్సమేత కోదండరామస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది దంపతులకు రాత్రి నిర్వహించిన కల్యాణం విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా తీరప్రాంత గ్రామాల్లో ప్రతిచోటా శ్రీరామనవమి కార్యక్రమాలు అంబరాన్నంటాయి.

జలదంకి : మడంలంలోని అన్ని రామాలయాల్లో శాస్త్రోక్తంగా నిర్వహించిన సీతారాముల కల్యాణోత్సవాలను భక్తులు తిలకించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయాలు విద్యుద్దీపాలంకరణలతో మిరమిట్లుగొలిపాయి. రామనామస్మరణతో మారుమోగాయి. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

బిట్రగుంట : బోగోలు మండలంలోని విశ్వనాథరావుపేటలోని ట్రాఫిక్ రామాలయంలో రైల్వే పీడబ్ల్యూ అధికారి కృష్ణన్ ఆధ్వర్యంలో వేదపండితులు సీతారాముల కల్యాణం నిర్వహించారు. భక్తులకు వడపప్పు, పానకాల పంపిణీ అనంతరం ఆలయ కమిటీ సభ్యులచే అన్నసంతర్పణ కార్యక్రమం జరిగింది. చెంచులక్ష్మీపురంలోని కోదండరామాలయంలో పీఎస్సార్ ట్రస్ట్ నిర్వహకులు పసుపులేటి సుధాకర్, సుగుణ దంపతులు కల్యాణ ఉభయకర్తలుగా వ్యవహరించారు. రామస్వామిపాలెం రామాలయం, బోగోలు విజయ గణపతి, యాదవపాలెం కోదండరామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి వడపప్పు, పానకం పంచిపెట్టారు.



బిట్రగుంట : సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

లింగసముద్రం : లింగసముద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండలంలో సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువలా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామానికి చెందిన ఓరుగంటి శివమురళీకృష్ణ, సుస్మితలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కమనీయంగా జరిగిన కల్యాణ మహోత్సవాన్ని తిలకించిన భక్తులు పరవశంతో పులకరించిపోయారు. అనంతరం గ్రామానికి చెందిన దేవకి బసవారావు భక్తులకు అన్నదానం చేశారు. ఈ పండుగ సందర్భంగా లింగసముద్రంలోని బలిజపాలెం, జంగంరెడ్డిపాలెం, తిమ్మారెడ్డిపాలెం, వీఆర్ కోట, మొగిలిచెర్ల, పెంట్రాల, చినపవని, పెదపవని తదితర గ్రామాలలోని రాములవారి ఆలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవాలు నిర్వహించారు. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

వలేటివారిపాలెం : మండలంలోని శింగమనేనిపల్లె రామాలయంలో బుధవారం జరిగిన శ్రీరామనవమి వేడుకలకు కందుకూరు నియోజకవర్గం టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వడపప్పు, పానకం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు అత్తోటి విజయసారధి, సర్పంచు వెంకటేశ్వర్లు, నాయకులు గరికపాటి రామానాయుడు, తానికొండ బాపయ్య, కాపులూరి వెంకటేశ్వర్లు, బాసం వెంకటేశ్వర్లు, బత్తిన మాల్యాద్రి, అంజయ్య మాధవి, తానికొండ అశోక్, గుర్రం లక్ష్మీనరసింహం, కంచర్ల మాల్యాద్రి, గౌడపేరు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



లింగసముద్రం : శాస్త్రోక్తంగా సీతారాముల కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

అగ్ని ప్రమాదాల నివారణ అందరి బాధ్యత



గ్యాస్ లీకేజీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కావలి రూరల్, ఏప్రిల్ 17: అగ్ని ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని అగ్నిమాపక అధికారి రామసిద్ధార్థ పేర్కొన్నారు. బుధవారం స్థానిక శ్రీ లక్ష్మీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్, సైన్స్ కళాశాల విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఎస్ఎఫ్‌వో రామసిద్ధార్థ మాట్లాడుతూ గ్యాస్, కరెంటు ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహనతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎదైనా ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన చీమలపెంట ఎస్సీ కాలనీ వాసులు



బడేవారిపాలెంలో ఇంటూరి సమక్షంలో టీడీపీలో చేరిన చీమలపెంట ఎస్సీ కాలనీవాసులు

లింగసముద్రం, ఏప్రిల్ 17 : మండలంలోని పెంట్రాల పంచాయతీ పరిధిలోని చీమలపెంట ఆదిఆంధ్ర కాలనీ యువకులు బుధవారం వలేటివారిపాలెం మండలం బడేవారిపాలెంలోని ఇంటూరి నాగేశ్వరరావు స్వగృహంలో ఆయన సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన యువకులు బందెల శ్రీను, వందనం, అజయ్, గోచిపాతల సింగయ్య, సిద్ధారపు పుల్లయ్య, కోటేశ్వరరావు, రూబేను, లక్ష్మయ్య, లాబాను, బంకా దీనమ్మ తదితరుకు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు బొల్లినేని రమణయ్య, నాయకులు ముత్తులూరి సుధాకర్, గంగినేని మధు, కరణం హజరత్తయ్య, చెన్నారెడ్డి దత్తాత్రేయ, కరణం మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాతలు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 17 : మండలంలోని పోకూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి సందర్భంగా మంగళవారం నిర్వహించిన ఏక పాత్రాభినయం నాటిక పోటీలలో విజేతలకు బుధవారం బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి తెనాలికి చెందిన రాము, రెండవ బహుమతి కలిగిరికి చెందిన పురుషోత్తం, మూడవ బహుమతి అనంతపురంకు చెందిన ఆనంద్‌రెడ్డి, ప్రోత్సాహక బహుమతి బడేవారిపాలెంనకు చెందిన గాంధీదీకి లభించింది

టీడీపీ పాలనలోనే రాయితీ రుణాలు, సంక్షేమ పథకాలు : బీద రవిచంద్ర



పార్టీలో చేరిన వారితో బీద రవిచంద్ర, కావ్య క్రిష్టారెడ్డి

బిట్రగుంట, ఏప్రిల్ 17: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాయితీ రుణాలు, సంక్షేమ పథకాలను అందచేశామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర తెలిపారు. బోగోలు వైసీపీ సీనియర్ నాయకులు బోగిరి యోహాను, ఆయన తనయుడు బోగిరి ప్రభాకర్, వారి అనుచరులు సుమారు 100 మంది బుధవారం రాత్రి టీడీపీలో చేరారు. వారంతా కావలి అభ్యర్థి కావ్య క్రిష్టారెడ్డి సమక్షంలో పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కావ్య, బీద రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్రాభివద్ధే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. కావలి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరిగాయంటే టీడీపీ పాలనలో మాత్రమే అన్నారు. బిట్రగుంట రైల్వే అభివృద్ధి చెందాలన్న, రైతులు, సామాన్యులు ఆర్థికంగా ఎదగాలన్నా టీడీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వారన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఎం.నాగేశ్వరావు, కే.మధుబాబునాయుడు, డీ.వేణుగోపాల్‌రెడ్డి, పీ.రవికుమార్‌చౌదరి, ఎం.వెంకయ్య, డీ.అంజయ్యయాదవ్, కే.రఘురాంనాయుడు, ఎస్.దావీదు, శివ వరప్రసాద్ రెడ్డి, విజయ్‌కుమార్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

● పడమర పల్లెలో ప్రచారం

బోగోలు మండలంలోని పడమర పల్లెలో టీడీపీ మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరావు ఆధ్వర్యంలో బుధవారం ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు, యువత పెద్ద సంఖ్యలో బైక్ ర్యాలీ నిర్వహించారు. కమ్మవారిపాలెంకు చెందిన వైసీపీ నాయకుడు బట్టేపాటి ప్రభాకర్ చౌదరి, కొమ్మి ఆనంద్, వారి అనుచరులు టీడీపీలో చేరారు. వారికి క్రిష్టారెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సోమేశ్వరపురంలో శివయ్యకు పూజలు జరిపించి, గ్రామంలో ప్రచారం సాగించారు. అనంతరం జక్కేపల్లిగూడూరు, బీజీవీ కండ్రిక, ఎస్‌జీవీ కండ్రికల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నేతలు పమిడి రవికుమార్ చౌదరి,కే.వెంకటేశ్వర్లురెడ్డి, గద్దెకొండయ్య, వై.వెంకటేశర్లురెడ్డి, పుట్ట సుబ్బారావు, ఎంకపునాయుడు, సుధీర్‌బాబు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ ధర్మాన్ని ఎవరైనా పాటించవచ్చు..!



బుద్ధుడి చిత్రపటంతో ర్యాలీ నిర్వహిస్తున్న బౌద్ధ సేవకులు

బిట్రగుంట, ఏప్రిల్ 17: బౌద్ధ ధర్మాన్ని స్త్రీ పురుషులెవరైనా పాటించవచ్చని సాదవి (బికుని) ఉపేక అయ్యాజీ అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటకు చెందిన వైద్యుడు కొర్రా చంద్రశేఖర్, శిరీష దంపతులు ఆహానం మేరకు ఆమె బుధవారం బోగోలుకు చేరుకున్నారు. మాస్టర్ సుబ్బారావుతో పాటు పలువురు బౌద్ధ ధర్మ అనుచరులతో కలసి ర్యాలీ నిర్వహించారు. బోగోలు కూడలోని అంబేడ్కర్ విగ్రహానికి నమస్కరించిన అనంతరం వెంకటేశ్వర పాలి క్లీనిక్ వద్ద ఏర్పాటు చేసి బౌద్ధ మత చిహ్నం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతు బుద్ధుడు భారతదేశంలో జన్మించినప్పటికి ఆయన బోధనలను అనుసరించే వారు కొందరే అన్నారు. బుద్ధుడి పంచశీల సూత్రలను ఎవరైనా పాటించవచ్చన్నారు. పరస్పర గౌరవం, సార్వభౌమ అధికారం, సమానత్వం, శాంతియుత, సహజీవనం వంటి వాటిలో సత్య న్యాయ ధర్మాలను పాటించాలని కోరారు. సాదవి ఉపేక అయ్యాజీ నుంచి బోగోలు, విశ్వనాథరావుపేట పంచాయతీలకు చెందిన పలువురు బౌద్ధమతం స్వీకరించారు.

పులకించిన భద్రగిరి



భద్రగిరి పులకించింది.. భక్తకోటితో హోరెత్తింది. పవిత్ర పుణ్యక్షేత్రం భద్రాచలంలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. తెల్లవారుజాము నుంచే మొదలైన వేడుక మధ్యాహ్నం ముత్యాల తలంబ్రాలతో ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. డిప్యుటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సుప్రీంకోర్టు న్యాయమూర్తి పీఎస్ నరసింహ, హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, ఐజీ ఏవీ రంగనాథ్, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు, దేవనాథ రామానుజ జీయర్‌స్వామి తదితరులు తరలివచ్చి కల్యాణ వేడుకను తిలకించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో భద్రాచలం కోలాహలంగా మారింది. -భద్రాచలం

● కన్నుల పండువగా సీతారాముల కల్యాణ వేడుక



జీలకర్రబెల్లంను భక్తులకు చూపుతున్న దృశ్యం



కల్యాణం వీక్షిస్తున్న మంత్రి సురేఖ, సీఎస్ శాంతికుమారి



పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి





స్వామివారి ఊరేగింపు




ద్వారకా తిరుమల దేవస్థానంవారి పట్టువస్త్రాలు



గౌతమీ నదిలో పుణ్య స్నానాలు



20న జిల్లాలో చంద్రబాబు ప్రచారం



నెల్లూరు (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జిల్లాలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలోని గూడూరు, సర్వేపల్లి నియోజక వర్గాల్లో జరిగే బహిరంగ సభల్లో ఆయన పాల్గొంటారు. 20వ తేదీ ఉదయం 11 గంటలకు గూడూరులో మహిళలతో సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం మధ్యాహ్నం మూడు గంటలకు సర్వేపల్లిలో బహిరంగ సభలో జరిగే ప్రజాగళం సభలో చంద్రబాబు పాల్గొని ప్రసంగిస్తారు.

సమరానికి సై

నామినేషన్ ప్రక్రియ ప్రారంభ కానుండడంతో ఎన్నికల సమరానికి తెరలేచింది. తమ బలాలను, బలగాలను పార్టీలు మోహరిస్తున్నాయి. ఇప్పటికే తొలివిడత ఎన్నికల ప్రచారాన్ని ముగించుకున్న ప్రధాన పార్టీలు గురువారం నుంచి ప్రచారాలను మరింత ముమ్మరం చేయనున్నాయి. వ్యూహాలు, ప్రతివ్యూహాలతో క్షణం తీరికలేకుండా గడపనున్నారు. గత ఎన్నికలతో పోల్చితే జిల్లాలో దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లో హేమాహేమీలు తలపడుతున్నారు. తమ తలరాతలు తేల్చుకునే ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.

బరిలో హేమాహేమీలు • ఊపందుకోనున్న వ్యూహాలు.. ప్రతివ్యూహాలు • ధర పెరగనున్న ఓటు • రూ.వేలల్లో పలికే సూచనలు

నెల్లూరు (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని ఎనిమిది అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాల్లో ప్రధాన పార్టీల నుంచి సమ ఉజ్జీలు కదనరంగంలోకి దిగారు. నెల్లూరు పార్లమెంట్ నుంచి టీడీపీ, బీజేపీ, జనసేనల ఉమ్మడి అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి పోటీ చేస్తున్నారు. ప్రత్యక్ష ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేస్తున్నా వ్యూహాత్మకంగా ముందుకు కదులుతున్నారు. ప్రచారంలో కొత్త ఒరవడిని, ఊపును తీసుకొస్తున్నారు. వైసీపీ కూడా వ్యూహాత్మకంగా పార్లమెంట్ అభ్యర్థిగా విజయసాయిరెడ్డిని రంగంలోకి దింపింది. ఆయన కూడా పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అయితే వీపీఆర్ ప్రభావంతో వైసీపీ నుంచి వలసవెళుతున్న వారిని నిలువరించడానికే ఆయన ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. ఏది ఏమైనా విజయ సాయి అభ్యర్థిత్వంతో వైసీపీ నుంచి వలసలు కొంతవరకు తగ్గాయనే చెప్పాలి.

• సిటీలో ప్రచారం ఏకపక్షం

ఇక నెల్లూరు సిటీలో ప్రచారం, పోటీ ఏకపక్షంగానే కనిపిస్తోంది. మంత్రి హోదాలో నెల్లూరుకి అభివృద్ధిని పరిచ యం చేసిన పొంగూరు నారాయణ ఈ సారి మళ్లీ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తు న్నారు. ఆయన నియోజకవర్గం పరిధి లోని లక్ష కుటుంబాలను నేరుగా కలిసి టీడీపీని గెలిపించమని అభ్యర్థించారు. నారాయణతోపాటు ఆయన సతీమణి రమాదేవి సైతం ప్రచారంలో ఉన్నారు. ఈ స్థానం నుంచి వైసీపీ అభ్యర్థిగా డిప్యూటీ మేయర్ ఖలీల్అహ్మద్ పోటీ చేస్తున్నారు. ఇక్కడ పోటీ కాని, ప్రచారం కాని ఏకపక్షంగానే కనిపిస్తున్నాయి.

• రూరల్ బరిలో దిగ్గజాలు

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రాజకీయ దిగ్గజాల మధ్య రసవత్తర పోటీ నెలకొంది. టీడీపీ అభ్యర్థిగా తాజా మాజీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఆయనకు మాస్ లీడర్‌గా గుర్తింపు ఉంది. నిత్యం ప్రజల్లో ఉండటంతోపాటు ప్రజాసమస్యలపై నిరంతర ఉద్యమాలు చేస్తున్నారు. ప్రత్యర్థిగా పోటీ చేస్తున్న వైసీపీ అభ్యర్థి ఆదాల ప్రభాకరరెడ్డికి రాజకీయంగా ప్రజల్లో మంచి గుర్తింపు ఉంది. సిట్టింగ్ ఎంపీ, తాజా మాజీ ఎమ్మెల్యే మధ్య రూరల్‌లో రసవత్తర పోటీ వాతావరణం కనిపిస్తోంది.

• హాట్‌టాపిక్‌గా కోవూరు

జిల్లాలో హాట్‌టాపిక్‌గా కోవూరు ఉంది. ప్రముఖ రాజకీ య కుటుంబానికి చెందిన నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి వైసీపీ అభ్యర్థిగా మరోసారి పోటీ చేస్తున్నారు. టీడీపీ అభ్యర్థిగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పోటీ చేస్తున్నారు. ఆమెకు ఎన్నికల వాతావరణానికి పూర్తిగా కొత్త అయినా ప్రచారంలో కాని, ప్రసంగాల్లో కాని ఏ మాత్రం తగ్గకుండా విజృంభిస్తున్నారు. వీపీఆర్ దంపతుల పోటీతో కోవూరు వాడీ, వేడిగా, హడావిడిగా కనిపిస్తోందంటే అతిశయోక్తి కాదు.



• కనకపట్నంలో నువ్వా..నేనా ?

కావలి నుంచి పాత, కొత్త నాయకులు నువ్వా, నేనా అంటూ తలపడుతున్నారు. టీడీపీ అభ్యర్థిగా దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తొలిసారిగా పోటీ చేస్తున్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర వ్యూహకర్తగా, మాలేపాటి సుబ్బానాయుడు సర్వ సైన్యాధ్య క్షుడిగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమయ్యారు. ఆయనకు అండగా రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు ఎన్నికల వ్యూహ రచన చేస్తుండగా, సుకుమార్ రెడ్డి సైన్యాధ్య క్షుడిగా వ్యవహరిస్తున్నారు.

• కొత్త వ్యూహ్యాలు..

నిన్నటి వరకు ప్రచారాల వరకే పరిమితమైన పార్టీలు గురువారం నుంచి ప్రచారంతోపాటు ప్రలోభాలకు తెరలేపే సూచనలు కనిపిస్తున్నాయి. గత ఎన్నికలకు భిన్నంగా అధికార పార్టీ నుంచి ఈసారి భారీగా వలసలు జరుగుతున్నాయి. అగ్రస్థాయి నాయకుల నుంచి గ్రామ స్థాయి నాయకుల వరకు పెద్ద సంఖ్యలో వైసీపీ నుంచి టీడీపీలోకి వలస వస్తున్నారు. వీటిని నిలువరించే క్రమంలో ఇక కొనుగోళ్లు మొదలు కానున్నాయి. జిల్లాలో అన్ని విధాలాబలమైన అభ్యర్థులు పోటీ పడుతున్న నేపథ్యంలో ఈసారి ఓటు విలువ కూడా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. అధికార పార్టీ నాయకులు ఇప్పటికే ప్రలోభాలకు తెరలేపారు. గ్రామ, వార్డు స్థాయి నాయకులకు ధర నిర్ణయించి, వారిని తమ పార్టీలోనే కొనసాగేలా ప్రయత్నాలు మొదలు పెట్టారు. నాయకుల అసమ్మతిని కరెన్సీ కట్టలతో చల్లబరిచారు. చాలా నియోజకవర్గాల్లో నాయకుల స్థాయిని బట్టి ఇప్పటికే తొలి విడతగా పంపకాలు జరిగినట్లు సమాచారం. వలంటీర్లను, మెప్మా సిబ్బందిని అడ్డంగా పెట్టుకుని ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలు ప్రారంభించారు.

• కొత్త, పాతల యుద్ధం

కందుకూరులో కొత్త, పాతల మధ్య యుద్ధం మొదలయ్యింది. టీడీపీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు తొలిసారిగా పోటీ చేస్తున్నారు. వైసీపీ ఈ స్థానానికి పక్క నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే బుర్రాను దిగుమతి చేసుకుంది. ఇక్కడ ఇప్పుడిప్పుడే వేడి రాజుకొంటోంది.

• సర్వేపల్లిలో పాతకాపులే..

సర్వేపల్లి బరిలో ఉన్నది ఇద్దరు పాతకాపులే అయినా ఈ సారి యుద్ధం మాత్రం కొత్తగా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రత్యర్థి అవినీతిని ప్రధాన అంశంగా జనంలోకి తీసుకెళుతున్నారు. వైసీపీ అభ్యర్థి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చేసిన అభివృద్ధిని, జగన్ మోహన్‌రెడ్డి పథకాలను నమ్ముకొని జనంలోకి వెళుతున్నారు.

• ఉద్దండులు పోటీ


రాజకీయాల్లో ఉద్దండ కుటుంబాలు ఆత్మకూరులో కలబడుతున్నాయి. ఆనం కుటుంబ పెద్ద రామనారాయణరెడ్డి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. మంత్రి హోదాలో ఆత్మకూరులో ఆయన చేసిన అభివృద్ధి ఈ రోజుకు ఆయనకు అండగా నిలుస్తోంది. నియోజకవర్గంలోకి ఆలస్యంగా అడుగుపెట్టినా, వైరి వర్గాలు బిత్తరపోయేలా పాత కాపులను కలుపుకొంటూ దూసుకుపోతున్నారు. మేకపాటి కుటుంబం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఇక్కడ రెండు కుటుంబాల మధ్య రసవత్తర పోటీ నడుస్తోంది.

• దుర్గంలో ఇద్దరూ కొత్తవారే..

ఉదయగిరిలో రెండు ప్రధాన పార్టీల నుంచి కొత్తవారు పోటీ పడుతున్నారు. కాకర్ల సురేష్ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. కొత్తగా నియోజకవర్గంలోకి అడుగుపెట్టినా ఊహకందని రీతిలో ప్రజలను తనవైపునకు ఆకర్షించుకుంటు న్నారు. నలుగురు మాజీ ఎమ్మెల్యేలు ఆయనకు అండగా నిలిచి ముందుకు నడిపిస్తున్నారు. ఇప్పటివరకు తెరవెనుక పాత్ర పోషించిన మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఈసారి వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. రాజకీయ కురువృద్ధుడు మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఉదయగిరి, ఆత్మకూరులో వైసీపీ తరపున ఎన్నికల సారథ్యం వహిస్తున్నారు.

ఓటేద్దాం..

● ఫ్లెక్సీలతో అవగాహన



ఉదయగిరి తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

మే13న సార్వత్రిక ఎన్ని కలు జరగను న్నాయి. దేశ, రాష్ట్ర భవి ష్యత్తు నిర్దేశిం చే ఎన్ని కలు కావడంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించా ల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఓటర్లను చైతన్యపరిచేలా అధికారులు పలు కార్యక్రమా లు చేపట్టారు. ఇందులో భాగంగా ఓటింగ్‌లో పాల్గొం దాం.. తప్పనిసరిగా ఓటువేద్దాం.. అంటూ ఉదయగిరి తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

- ఉదయగిరి రూరల్



మాయదారి ఎన్నికలు మళ్లొచ్చే!

రమణమ్మ : వదినా.. మాయదారి ఎన్నికలు మళ్లొచ్చా.. ఇంకేముంది మనూళ్లో జాతరే జాతర. మీ ఆయన, మాఇంటోడు ఇక మనకి దొరకరే !

సుభద్ర : బాగచెప్పావ్.. రమణమ్మ ! మొన్ననే మీ అన్న ఉదయమెప్పుడో.. బయటపోయి రాత్రేప్పుడో వచ్చిండు. ఏమైపోయావయ్యా అంటే ఎన్నికలమే అన్నాడు.

రమణమ్మ : వదినో మీ తమ్ముడు ఇప్పట్నుంచే జనాల్ని పోగేసుకుంటు న్నాడు.వాళ్లకి ఈయనే ఖర్చంతా పెడత న్నాడంటా. ఈయనకెందుకు అంత జిల.

సుభద్ర : ఓమే రమణమ్మ ఇలాంటియ్యి ఇంకెన్ని చూడల్నో...మనం. ఐదేనెల్లోనంట ఎలచ్చన్లు. అప్పటిదాకా ఈల్లిద్దరితో యాగొద్దా ?

రమణమ్మ : ఏమోపో వదినా... మా ఇంటోడు ఎన్ని గొడవలు తెస్తాడో.. భయంగా ఉంది. ఈ మనిషికి ఎన్ని చెప్పినా రాజకీయం పిచ్చిపోదు...

సుభద్ర : ఇద్దరికి గట్టిగ చెప్పి చూద్దాం. వినకపోతే ఆ దేవుడు మీదే భారమేద్దాం..సరేనా !

- నెల్లూరు రూరల్

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

- కలెక్టరేట్‌లో ఎంపీ అభ్యర్థులు..
- కార్పొరేషన్ కార్యాలయంలో నగర అభ్యర్థులు..
- ఆర్డీవో కార్యాలయంలో నెల్లూరు రూరల్ అభ్యర్థులు నామపత్రాల దాఖలు
- ప్రతి సెంటరు వద్ద డీఎస్పీతోపాటు 92 మంది సిబ్బంది విధి నిర్వహణ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 17 : సార్వత్రిక ఎన్నికలకు తొలి ఘట్టం గురువారం నుంచి ప్రారంభం కానుంది. పోటీలో నిలిచే అభ్యర్థులు నేటి నుంచి నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ ప్రక్రియలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నెల్లూరు నగర నియోజ కవర్గం నుంచి పోటీ చేసే అభ్యర్థులు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం లోనూ, నెల్లూరు రూరల్ నుంచి పోటీ చేసే అభ్యర్థులు ఆర్డీవో కార్యాలయంలోనూ, నెల్లూరు పార్లమెంటుకు పోటీ చేసే అభ్యర్థులు కలెక్టరేట్‌లోనూ నామినేషన్లు వేయనున్నారు. కాగా ఆయా కేంద్రాల వద్ద బందోబస్తు వివరాలను నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి బుధవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు.




నెల్లూరు నగర కార్పొరేషన్ కార్యాలయం వద్ద నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డితో పాటు నలుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలు, 30మంది ఏఎస్ఐలు, 50 మంది కానిస్టేబు ళ్లు, రెండు స్పెషల్ పార్టీలు బందోబస్తులో ఉంటాయి. ఆర్డీవో కార్యాలయం కేంద్రం వద్ద సీసీఎస్ డీఎస్పీ రామకృష్ణాచారితోపాటు నలుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలు, 30 మంది ఏఎస్ఐలు, 50 మంది కానిస్టేబుళ్లు, రెండు స్పెషల్ పార్టీలు ఉంటాయి. కలెక్టరేట్ వద్ద ఏఎస్పీ సీహెచ్ సౌజన్యతో పాటు నలుగురు సీఐలు, 12 మంది ఎస్ఐలు, 30 మంది ఏఎస్ఐలు, 50 మంది కానిస్టేబుళ్లు, రెండు స్పెషల్ పార్టీలు బందోబస్తు నిర్వహించనున్నాయి. ఆయా కేంద్రాల గేట్ల వద్ద నుంచి 100 మీటర్ల దూరం ముందే ఊరేగింపుగా వచ్చిన వారిని పోలీసులు నిలిపి వేస్తారు. అనుమ తులు తీసుకున్న నాలుగు వాహనాలను మాత్రం కేంద్రం గేటు వరకు అనుమతి స్తారు. గేటు వద్ద వాహనాలను నిలిపి అభ్యర్థులు కాలి నడకన నామినేషన్ కేంద్రంలోకి వెళ్లి నామి నేషన్ వేస్తారు. అభ్యర్థులు ఎప్పుడు నామినేషన్లు వేస్తున్నారో ముందుగా తెలియజేయాల్సి ఉంటుంది. ఊరేగింపులకు ముందుగా పోలీసుల అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది.

ఎన్నికల్లో పోటీ చేస్తున్నారా..?

- నియమ నిబంధనలు ఇవిగో...
- మార్గదర్శకాలపై అవగాహన ఉండాలి

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 17 : సార్వత్రిక ఎన్నికల నగారా మోగడంతో జిల్లాలోని ఆశా వహులు తమ అదృష్టాన్ని పరీక్షిం చుకునేందుకు సిద్ధ మవుతున్నారు. తమకు అసెంబ్లీ, పార్లమెంట్ టికెట్లను కేటా యించాలని పార్టీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మరి కొందరైతే ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు రంగం సిద్ధపడుతు న్నారు. అయితే వీరంతా కూడా ఎన్నికల మార్గదర్శకాలపై అవగాహన కలిగి ఉంటేనే ఎన్నికల్లో పోటీకి అర్హులవుతారు. పోటీ చేసే వారి అర్హత, నామి నేషన్ వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పూర్తిగా తెలుసు కోవాలని అధి కారులు చెబుతున్నారు. గురువారం నుంచి నామినేషన్ల ప్రక్రి య ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అభ్యర్థులు నియమ, నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుంది.



• నిబంధనలు ఇలా..

ఎంపీ లేదా ఎమ్మెల్యేగా పోటీ చేయాలనుకునే అభ్యర్థులు భారతదేశ పౌరులై ఉండాలి. 25 ఏళ్ల వయసు కలిగి దేశంలో, రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా ఓటర్ల జాబితాలో పేరు కలిగి ఉండాలి. రాష్ట్రంలో ఏ నియోజకవర్గం నుంచైనా పోటీ చేయ వచ్చు. స్థానికేతరులు పోటీచేసే సమయంలో మాత్రం ప్రతిపా దించేవారు ఆ నియోజకవర్గానికి చెందిన వారై ఉండాలి. అలాగే స్థానికేతర నియో జకవర్గాల్లో పోటీ చేసేటప్పుడు ఓటు ఏ నియో జకవర్గంలో ఉందో అక్కడి రిటర్నింగ్ అధికారి నుంచి అటెస్టెడ్ సర్టిఫికెట్ తీసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఆదాయం పొందే పదవిలోనూ, ఉద్యోగి అయి ఉండకూడదు. ఒకవేళ ఉద్యోగి పోటీ చేయాలనుకుంటే ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి ఉంది.

నామినేషన్ సమయంలో జాగ్రత్తలివే..

● అభ్యర్థులు నామినేషన్ దాఖలకు ముందు విధిగా బ్యాంకు ఖాతా పాసుపుస్తకాన్ని, పాన్‌కార్డు వివరాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. ● ఓసీ, బీసీ అభ్యర్థులు అసెంబ్లీకి పోటీ చేసేందుకు రూ.10వేలు డిపాజిట్ చెల్లించాలి. పార్లమెంట్‌కు పోటీచేసే అభ్యర్థులు రూ.25వేలు డిపాజిట్ చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మాత్రం ఇందులో సగం చెల్లిస్తే సరిపోతుంది. అయితే ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు విధిగా కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. ● గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి పోటీచేసే అభ్యర్థులు సంబంధిత నియోజకవర్గానికి చెందిన ఒక్క ఓటరు ప్రతిపాదిస్తే సరిపోతుంది. ఇతరులను మాత్రం విధిగా 10 మంది ఓటర్లు ప్రతిపాదించాలి. ● గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరఫున పోటీ చేసేటప్పుడు నామినేషన్ సమయం ముగిసేలోపు ఆయా రాజకీయ పార్టీల ఏ, బీ ఫారమ్‌లను రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. అప్పుడే పార్టీ గుర్తు లభిస్తుంది. ఏ, బీ ఫారమ్స్ ఇవ్వలేకుంటే ప్రతిపాదించిన ఓటర్ల సంఖ్య 10 కంటే తక్కువ ఉంటే ఆ నామినేషన్ పరిశీలన తిరస్కరణకు గురవుతుంది. ప్రతిపాదించిన ఓటర్లు పదిమంది ఉంటే ఇండిపెండెంట్ అభ్యర్థిగా గుర్తిస్తారు. ● అసెంబ్లీ లేదా పార్లమెంట్‌కు పోటీ చేసే సమయంలో నామినేషన్ దాఖలు సమయంలో నోటరీ చేయించిన అఫిడవిట్ సమర్పించాలి. ఇందులో ఆస్తులు, అప్పులు, కేసుల వివరాలు సమగ్రంగా ఉండాలి. ● అఫిడవిట్‌లోని అన్ని కాలమ్స్‌ను విధిగా పూర్తిచేయాలి. ఏ ఒక్క కాలమ్ ఖాళీగా ఉంచినా రిటర్నింగ్ అధికారి నోటీసు ఇస్తారు. అప్పటికీ స్పందించి పూర్తిచేస్తే సరి లేదంటే నామినేషన్ తిరస్కరణకు గురవుతుంది.

తాజా ఓటర్ల జాబితా విడుదల

- జిల్లాలో 19.36 లక్షల మంది హక్కుదారులు
- పురుషుల కంటే మహిళలే అధికం



నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 17 : జిల్లాలో తాజా ఓటర్ల జాబితాను అధికారులు విడుదల చేశారు. ఈ జాబితా ప్రకారం జిల్లాలో 19.36 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురు షులు 9,47,344 మంది, స్త్రీలు 9,88,579 మంది ఉన్నారు. తాజా ఓటర్ల జాబితా ప్రకారం పురుషుల కంటే మహిళా ఓటర్లే 41,235 మంది ఎక్కువగా ఉన్నారు. నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు ఇలా ఉన్నాయి.

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కందుకూరు	112917	115373	26	228316
కావలి	116689	120969	28	237686
ఆత్మకూరు	105466	109152	8	214626
కోవూరు	128580	137856	25	266461
నెల్లూరు సిటీ	116111	122046	67	238224
నెల్లూరు రూరల్	135602	143111	20	278733
సర్వేపలి	112528	118889	26	231443
ఉదయగిరి	119451	121183	10	240644

ఉద్దండుల బరి ఆత్మకూరు

ఆత్మకూరు ఏప్రిల్ 17: జిల్లాలో ఆత్మకూరు నియోజకవర్గానికి ఓ ప్రత్యేకత ఉంది. ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ ఓటర్లు విభిన్న తీర్పు ఇస్తున్నారు. వెన్ను పోట్లుకు, వర్గాధిపత్యాలకు ఆలవాలమై కొందరికి రాజకీయ భవిష్యత్‌ను ఇచ్చి, మరికొందరిని రాజకీయాల నుంచి సాగనం పుతోంది. ఈ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డి భీకరపోరుకు అస్త్రాలు సిద్ధం చేసుకున్నారు. వైసీపీ అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డి తన పట్టు నిలుపుకునే ప్రయత్నంలో ఉన్నారు. జిల్లాలో ప్రముఖ రాజకీయ కుటుంబాలకు చెందిన ఈ ఇద్దరు ఈ ఎన్నికల్లో అమీతుమీ తేల్చుకోబోతున్నారు.

ఎక్కువసార్లు గెలిచింది కాంగ్రెస్సే...

ఆత్మకూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 17 సార్లు ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ ఏకంగా 9 సార్లు విజయం సాధించింది. వైసీపీ మూడు సార్లు, టీడీపీ రెండు సార్లు, స్వతంత్ర అభ్యర్థులు మూడు దఫాలు విజ యం సాధించారు. కాగా 2022లో జరిగిన అసెంబ్లీ ఉపఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి అత్యధిక మెజార్టీ సాధించారు. 1958లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆనం సంజీవరెడ్డి స్వల్ప మెజార్టీతో గెలుపొందారు.

● 1952లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో జీసీ .కొండయ్య స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి గంగవరపు తిరుపతినాయుడిపై గెలుపొందారు. 1957లో జీసీ కొండయ్యపై గెలుపొందిన బెజవాడ గోపాలరెడ్డి సీఎంగా కూడా పనిచేశారు. బెజవాడ గోపాల రెడ్డి లోక్‌సభకు వెళ్లడంతో 1958లో జరిగిన ఉప ఎన్నికల్లో ఆనం సంజీవరెడ్డి విజయం సాధించారు. 1962లో జరిగిన ఎన్నికల్లో పెళ్ళకూరు రామచంద్రారెడ్డి ఆనం సంజీవరెడ్డితో ఢీకొని పరాజయం పొందారు. తిరిగి 1967లో రామచంద్రారెడ్డి విజయం సాధించారు. 1972లో కంచర్ల శ్రీహరినాయుడు,1978లో డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి 1983లో టీడీపీ తరఫున ఆనం వెంకటరెడ్డి విజయం సాధించారు. 1985లో కాంగ్రెస్ అభ్యర్థిగా సుందరరామిరెడ్డి బీజేపీ అభ్యర్థి ఎం.వెంకయ్యనాయుడుపై 831 ఓట్ల తేడాతో గెలుపొంది రాష్ట్రరాజకీయాల్లో సంచలనం సృష్టించారు. 1989లో సుందరరామిరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 1994 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా కొమ్మి లక్ష్మయ్య నాయుడు, 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా బొల్లినేని క్రిష్ణయ్య విజయం సాధించారు. 2004లో ఇండిపెండెంట్‌గా అభ్యర్థి కొమ్మి లక్ష్మయ్యనాయుడు, 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డి విజయం సాధించారు. 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి మేకపాటి గౌతమ్ రెడ్డిని ప్రజలు గెలిపించారు. మేకపాటి గౌతమ్‌రెడ్డి మరణం తరువాత జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన సోదరుడు మేకపాటి విక్రమరెడ్డి ఆత్యధిక మెజార్టీ సాధించారు.

ముఖచిత్రం



ఆత్మకూరు నియోజకవర్గ చిత్రపటం

కొత్తదనానికి చోటు

● మే 13న జరగనున్న ఎన్నికల్లో తిరిగి వైసీపీ అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణ రెడ్డితో తలపడుతున్నారు. ఆది నుంచి కొత్తదనానికి ప్రాధాన్యత ఇస్తూ, కొన్ని సమయాల్లో వర్గ రాజకీయానిదే పైచేయిగా ఉంటున్న ఆత్మకూరు నియోజకవర్గంలో ఈ దఫా అర్థ, అంగబలం కలిగిన సమ ఉజ్జీలు రంగంలోకి దిగారు. మొత్తం మీద నియోజక వర్గం లో వర్గ రాజకీ యాలు, వెన్ను పోట్లను తట్టు కొన్నవారు సులభంగా విజ యం సాధిస్తు న్నారు. ఉద్దండు లకు ఊపిరి పోసి న ఆత్మకూరు ఈసారి ఎవరికి పడుతుందో బ్రహ్మరథం పడుతుందో చూడాలి.

సంవత్సరం	విజేతలు	పార్టీ	ఆధిక్యం
2022	మేకపాటి విక్రమ్‌రెడ్డి (ఉపఎన్నిక)	వైసీపీ	82884
2019	మేకపాటి మేకపాటి గౌతమ్‌రెడ్డి	వైసీపీ	22276
2014	మేకపాటి గౌతమ్‌రెడ్డి	వైసీపీ	31,412
2009	ఆనం రామనారాయణరెడ్డి	కాంగ్రెస్	18,644
2004	కొమ్మి లక్ష్మయ్యనాయుడు	స్వతంత్ర	4,397
1999	బొల్లినేని కృష్ణయ్య	కాంగ్రెస్	2,069
1994	కొమ్మి లక్ష్మయ్యనాయుడు	టీడీపీ	17,965
1989	డాక్టర్ బి.సుందరరామిరెడ్డి	కాంగ్రెస్	334
1985	డాక్టర్ బి.సుందరరామిరెడ్డి	కాంగ్రెస్	830
1983	ఆనం వెంకటరెడ్డి	టీడీపీ	14,249
1978	డాక్టర్ బి.సుందరరామిరెడ్డి	కాంగ్రెస్	3,238
1972	కంచర్ల శ్రీహరినాయుడు	కాంగ్రెస్	5,340
1967	పెళ్లకూరు రామచంద్రారెడ్డి	స్వతంత్ర	5,224
1962	ఆనం సంజీవరెడ్డి	కాంగ్రెస్	8,647
1958	ఆనం సంజీవరెడ్డి (ఉపఎన్నిక)	కాంగ్రెస్	45
1955	బెజవాడ గోపాల్‌రెడ్డి	కాంగ్రెస్	14,097
1952	జీసీ కొండయ్య	స్వతంత్ర	10122

అమ్మ బాబోయ్... ఏం ఎండలు ?



ప్రచారంలో ఎండ దెబ్బకు తాళలేక చెట్టుకింద సేదతీరుతున్న టీడీపీ నాయకులు

● చెట్ల కింద సేదతీరుతూ ప్రచారం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 17: సాధారణ ఎన్నికలకు సమయం సమీపిస్తోంది. ఆయా పార్టీల అభ్యర్థులు, నాయకుల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అదే క్రమంలో ఎండలు మండుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే భానుడు భగభగమం టున్నాడు. ఆరేడు ఇళ్లు తిరిగి, ఎండదెబ్బకు తాళలేక నాయ కులు, కార్యకర్తలు చెట్ల కింద సేదతీరుతు న్నారు. శీతలపానీ యాలు, చల్లనినీటితో గొంతు తడుపుకుంటున్నారు. బుధవారం ఉదయగిరి మండలం మాసాయిపేట బీసీ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు ఎండధాటికి తట్టుకోలేక ఇలా చెట్టు కింద సేదతీరారు.